PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 108 | విజయవాడ, బుధవారం 19 నవంబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 19 November 2025 | Rs

కార్మిక, రైతు చట్టాలపై

26న నిరసనలను జయప్రదం చేయండి

- కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపు
- విశాఖ ఉక్కు ఉద్యోగులపై సిఎం వ్యాఖ్యలకు ఖండన

2



నెట్స్‌లో కఠోర సాధన

- శుభ్‌మన్ ఫిట్‌నెస్‌పై ఉత్కంఠ
- గౌహతి టెస్ట్‌కు సిద్ధమౌతున్న టీమిండియా

8

మారేడుమిల్లి రక్తసిక్తం

పోలీసు కాల్పుల్లో మావోయిస్టు అగ్రనేత హిడ్మా సహా ఆరుగురు మృతి

- రాష్ట్రవ్యాప్తంగా దాడులు
- పలువురు అరెస్టు
- విజయవాడలో అత్యధికంగా 28 మంది పోలీసుల అదుపులోకి..

ప్రజాశక్తి- యంత్రాంగం

ఆకుపచ్చటి అటవీ ప్రాంతం మంగళవారం ఉదయాన్నే నెత్తుటి రంగు పులుముకుంది. అడవిజంతువుల అరుపులు, పక్షుల కూతలు తప్ప ఇతర శబ్దాలకు దూరంగా ఉండే మారేడుమిల్లి తుపాకి మోతలతో దద్దరిల్లింది. పోలీసు కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. మృతులలో మావోయిస్టు అగ్రనేత, గెరిల్లా యుద్ధ వ్యూహకర్తగా ప్రసిద్ధి పొందిన మడివి హిడ్మా, ఆయన భార్య రాజే ఉన్నారన్న సమాచారం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. మారేడుమిల్లిలో ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠ ప్రజానీకంలో వ్యక్తమవుతుండగానే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పోలీసులు పెద్ద ఎత్తున దాడులు నిర్వహించారు. పలువురు మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నారు. వివిఐపిల కదలిక పెద్ద ఎత్తున ఉండే విజయవాడ నగరానికి అత్యంత సమీపంలోనే 28 మంది మావోయిస్టులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు, ప్రస్తుతం ముఖ్య నేతగా భావిస్తున్న తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ సెక్యూరిటీ సిబ్బంది ఉండటం కలకలం రేపుతోంది...!



హిడ్మా



రాజే అలియాస్ రాజక్క



దేవ్



మల్లు



లక్మల్ అలియాస్ చైతు



కమ్లు అలియాస్ కమలేష్

ఎన్‌కౌంటర్ ఇలా..

మారేడు మిల్లిలో మావోయిస్టులు ఉన్నట్లు పక్కా సమాచారం అందడంతో దాడి జరిపామని పోలీసులు చెబుతున్నారు. మంగళవారం ఉదయం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల మధ్యలో కాల్పులు జరిగాయని వారు అంటున్నారు. ఈ కాల్పుల్లో మరణించిన మావోయిస్టుల నుండి రెండు ఎకె 47 గన్‌లు, ఒక పిస్టల్, ఒక రివాల్వర్, ఒక సింగిల్ బోర్ ఆయుధం, పెద్ద ఎత్తున పేలుడు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టుల మృతదేహాలను రంపచోడవరం ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. పోస్టుమార్టం అనంతరం బుధవారం మృతుల బంధువులకు అప్పగించనున్నారు. రంపచోడవరం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎపి ఇంటిలిజెన్స్ ఎడిజి మహేష్ చంద్ర లడ్డా మాట్లాడుతూ అక్కడి నుంచి వారిలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పిఎల్‌జిఎ) కంపెనీ వన్ కమాండర్ మడివి హిడ్మా, ఆయన భార్య రాజె అలియాస్ రాజక్క, లక్మల్ అలియాస్ చైతు, కమ్లు అలియాస్ కమలేష్, మల్ల అలియాస్ మల్లు, దేవె ఉన్నారని తెలిపారు. పోలీసుల ఈ కథనంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

విజయవాడలో కీలక నేతల బృందాలు

విజయవాడ సమీపంలో కృష్ణాజిల్లా పెనమలూరు మండలం కానూరు ఆటోనగర్‌లో 28 మంది మావోయిస్టులను పోలీసు దళాలు పట్టుకున్నాయి. ఇంటెలిజెన్స్ సమాచారంతో ఆక్టోపస్, టాస్క్‌ఫోర్స్, లా అండ్ ఆర్డర్ పోలీసుల బృందాలు పెద్ద సంఖ్యలో ఒక్కసారిగా కానూరు ఆటోనగర్‌లో మావోయిస్టులు ఉన్న భవనంపై మంగళవారం ఉదయం మెరుపుదాడి చేశాయి. అరెస్టయిన వారిలో 21 మంది మహిళలు ఉన్నారు. వీరిలో హిడ్మా దళ బెటాలియన్ సభ్యులు 19 మంది, మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు తిప్పిరి తిరుపతి (అలియాస్ దేవ్‌జీ) రక్షణసభ్యులు 9 మంది ఉన్నట్లు చెబుతున్నారు.

మావోయిస్టు పార్టీలో తిరుపతి ప్రస్తుతం ముఖ్య బాధ్యతలు చూస్తున్నట్లు సమాచారం. సెక్యూరిటీ సిబ్బంది దొరికినా, ఆయన లేరని చెబుతుండటం చర్చనీయాంశంగా మారింది. ఆయన విజయవాడకు వచ్చారా. వచ్చివుంటే తప్పించుకున్నారా? ఆ భవనంలో కాకుండా వేరే చోట ఉంటున్నారా? లేక పోలీసులు అదుపులోనే ఉన్నారా అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. పోలీసులు మాత్రం తిరుపతి ఆచూకీపై పెదవి విప్పడం లేదు.

ఏలూరులో 15 మంది?

ఏలూరు నగర శివార్లలో 15 మంది మావోయిస్టులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వీరిలో ఐదుగురు మహిళలున్నారు. నగర శివార్లలో మినీ బైపాస్ రోడ్డులోని కెకెఆర్ గ్రీన్‌సిటీ (గేటెడ్ కమ్యూనిటీ)లో ఒక భవంతిలో షెల్టర్ తీసుకుంటుండగా పోలీసులు ఒక్కసారిగా దాడిచేశారు. అంతకుముందు డ్రోన్‌లతో ఈ ప్రాంతంలో గాలింపు చేశారు. వీరు సుమారు పది రోజుల నుంచి ఈ భవనంలో ఉంటున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. నగరంలోని ఒక ప్రయివేటు కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తున్న మిగతా 7లో



ఇఆర్‌సి చైర్మన్ పివిఆర్ రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

మరో ట్రూ అప్ బాదుడు వద్దు

- ఎపిఇఆర్‌సి ప్రజాభిప్రాయ సేకరణలో పలువురు అభ్యంతరం
- దుర్మార్గ విధానాన్ని రద్దు చేయాలి : సిహెచ్ బాబూరావు

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

రాష్ట్ర ప్రభుత్వం మరో ట్రూ అప్ ఛార్జీల పేరుతో రూ.12,717 కోట్ల బాదుడును ప్రజలపై వేయాలన్న ప్రతిపాదన ఉపసంహరించుకోవాలని పలువురు తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు నియంత్రణ మండలి ఛైర్మన్ పివిఆర్ రెడ్డి ఆధ్వర్యంలో ట్రూ అప్ ఛార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని మంగళవారం కర్నూలులోని ఎపిఇఆర్‌సి కార్యాలయంలో నిర్వహించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ ఇప్పటికే అనేకసార్లు ట్రూ అప్ ఛార్జీలు వేసి ప్రజల నడ్డి విరగొట్టారు. మరోసారి రూ.12,717 కోట్లు భారం వేయడానికి ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో రావడాన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. ప్రపంచ బ్యాంకు ఆదేశిత విద్యుత్ సంస్కరణల్లోని దుర్మార్గమైన షరతుల్లో ఇది ముఖ్యమైనదని పేర్కొన్నారు. ట్రూ అప్ ఛార్జీల విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో రూ.32 వేల కోట్ల భారం వేస్తే టిడిపి కూటమి ప్రభుత్వం సంవత్సరం ఏడు నెలల కాలంలోనే రూ.30 వేల కోట్ల భారం వేయడం దుర్మార్గమన్నారు. స్మార్ట్ మీటర్లను పగలకొట్టండని, తాము అధికారంలోకి వస్తే విద్యుత్ భారాలను వేయబోమని ప్రచారం చేసి ఓట్లు దండుకున్న టిటిపి కూటమి నాయకులు గత జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన విధానాలనే చాలా వేగంగా అమలు చేస్తూ స్మార్ట్ మీటర్లను బిగించడం అమానుషమని పేర్కొన్నారు. 2022-23కు సంబంధించి ఇప్పటికే రూ.15,485 కోట్లు ఇంధన సర్దుబాటు ఛార్జీలు ప్రజలపై మోపారని, నెలకు యూనిట్‌కు 40 పైసలు చొప్పున ఏడాది కాలంలో రూ.2,787 కోట్లు వసూలు చేశారని తెలిపారు. విద్యుత్ సుంకాన్ని ఆరు పైసల నుండి రూపాయికి పెంచుతూ చట్టసవరణ చేశారని, 2024-25 సంవత్సరాలకు సంబంధించి ఇంధన సర్దుబాటు ఛార్జీలు రూ.842 కోట్ల వసూలుకు ప్రతిపాదనలు ఇఆర్‌సి ముందు ఉంచారని అన్నారు. ప్రజల కళ్లుగప్పి స్మార్ట్ మీటర్ల బిగింపునకు టిడిపి కూటమి ప్రభుత్వం పూనుకుందని, ముందుగా డబ్బులు చెల్లించి కరెంటు వాడుకునే విధానాన్ని రహస్యంగా ప్రవేశ పెడుతున్నారని వివరించారు. 2019లో వాడుకున్న విద్యుత్తుకు 2025లో మిగతా 7లో

'ఉక్కు'ను తుక్కు చేసే కుట్రలు

- ఉద్యోగులను తొలగిస్తూ ప్రైవేటీకరణ ప్రయత్నాలు తీవ్రతరం
- ప్యాకేజీని అప్పులకు జమ చేసి సాయం చేసినట్టు బిల్డప్
- రాష్ట్ర ప్రాజెక్టులకు సైతం రాయపూర్ ఉక్కు వినియోగం

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

'విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు' నినాదంతో త్యాగాలు చేసి పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారంపైనా, అందులో పనిచేస్తున్న కార్మికులపైనా నాలుగున్నరేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్రలు కొనసాగుతూనే ఉన్నాయి. ఉక్కును తుక్కు చేసి కార్పొరేట్లకు కారుచౌకగా కట్టబెట్టే కుయుక్తులు ముమ్మరమయ్యాయి. స్టీల్‌ప్లాంట్‌పైనా, కార్మికులపైనా ఏకంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు సిఐఐ భాగస్వామ్య సదస్సు ముగింపు సందర్భంగా అనుచిత వ్యాఖ్యలు చేశారు. అవాస్తవాలు మాట్లాడారు. వాస్తవానికి రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చాక స్టీల్‌ప్లాంట్‌లో పెద్ద ఎత్తున కార్మికులను తొలగించబడ్డారు. ప్యాకేజీ పేరుతో ఇచ్చిన డబ్బంతా బ్యాంకులకు పన్ను బకాయిలుగా కేంద్ర బొక్కసానికి జమకట్టి ప్రైవేటీకరణ చర్యలు వేగవంతం చేయబడ్డాయి.



ఏం జరుగుతోంది ?

కేంద్రం ప్రకటించిన రూ.11,440 కోట్ల ప్యాకేజీలో ఇంకా రూ.800 కోట్లు చెల్లించాల్సి ఉంది. వచ్చిన డబ్బంతా బ్యాంకుల అప్పులకు, పన్నులకు జమ చేయాలనే కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను స్టీల్ యాజమాన్యం అమలు చేసింది. ఉత్పత్తికి కానీ, ప్లాంట్‌లో మరమ్మతులకు కానీ, వేతన బకాయిలకు కానీ ఒక్క పైసా కూడా వెచ్చించలేదు. ప్రైవేటీకరణ నిర్ణయం ప్రకటించే నాటికి అంటే, 2021 జనవరి 27కు ప్లాంట్ రూ.916 కోట్ల లాభాల్లో ఉంది. గడిచిన నాలుగేళ్లలో రూ.10 వేల కోట్ల నష్టం వచ్చింది. కావాలనే నష్టాల పాలు చేసి తాము ఆదుకున్నామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గొప్పలు పోతున్నాయి. 2,020 నాటికి విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యం 7.3 మిలియన్ టన్నులు. పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులు కలిపి 28 వేల మంది వరకూ ఉండేవారు. ప్రైవేటీకరణ నిర్ణయం తర్వాత కార్మికుల సంఖ్య 20 వేలకులోపునకు వచ్చేసిందని కార్మిక సంఘాల నేతలు చెబుతున్నారు. అప్పట్లో రా మెటీరియల్ నాణ్యంగా వచ్చేది. ఇప్పుడు నాసిరకమైన రా మెటీరియల్ వస్తోందని అంటున్నారు. సొంత గనులూ లేవు. ఆరేళ్లుగా కార్మికుల రిక్రూట్‌మెంట్ జరగలేదు. ఈ కారణాలన్నింటితో విశాఖ ఉక్కు నష్టాలబారిన పడుతోంది. నాగర్‌నార్ స్టీల్‌ప్లాంట్, బిపిసిఎల్ వంటి పరిశ్రమల ప్రైవేటీకరణను కేంద్రం ఉపసంహరించుకున్నట్లు పార్లమెంట్‌లో ప్రకటించింది. దీపం వెబ్‌సైట్ నుంచీ ఆ సంస్థలను తొలగించింది. అక్కడి కార్మికుల, రాష్ట్ర ప్రభుత్వాల ఒత్తిడి మూలంగా ప్రైవేటీకరణ చర్యలు ఆగాయి. విశాఖ స్టీల్‌ప్లాంట్ విషయంలో మాత్రం అలా జరగడం లేదు. గత వైసిపి, ప్రస్తుత టిడిపి ప్రభుత్వాలు మిగతా 7లో

పడవ బోల్తా పడి మత్స్యకారుడు మృతి

ప్రజాశక్తి - నరసన్నపేట



పడవ బోల్తా పడి మత్స్యకారుడు మృతి చెందిన ఘటన శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలంలో చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలో గుప్పిడిపేటకు చెందిన మత్స్యకారుడు చెక్క రాజారావు (45), చెక్క హరయ్య, తులె సింహాచలం మంగళవారం వేకువజామున సముద్రంలో చేపల వేటకు పడవలో వెళ్లారు.

వేట ముగించి తిరిగి వస్తున్న క్రమంలో పడవ బోల్తా పడింది. హరయ్య, సింహాచలం ఈత కొట్టుకుంటూ ఒడ్డుకు చేరారు. పడవ కింద పడడంతో రాజారావు మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబసభ్యులు భోరున విలపించారు. భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ రంజిత్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌సి వసతి గృహాల్లో ఆర్‌ఒ ప్లాంట్లు

- సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి ఉత్తర్వులు
- 311 హాస్టళ్లలో రక్షిత నీరు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



(ఫైల్ ఫొటో)

రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో మంచినీటికి కూడా దిక్కులేని దయనీయ పరిస్థితులపై 'ప్రజాశక్తి' సహా మీడియాలో కథనాలు వెలువడిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. విద్యార్థులకు రక్షిత మంచినీరు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రకటించింది. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని వసతి గృహాలల్లో ఆర్‌ఒ ప్లాంట్ల ఏర్పాటు చేసి రక్షిత మంచినీరు అందించనున్నట్లు తెలిపింది.

ఈ మేరకు ఆ శాఖ కార్యదర్శి ఎం.ఎం నాయక్ మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 311 వసతి గృహాల్లో ఒక్కో ఆర్‌ఒ ప్లాంట్‌కు రూ.2 లక్షల వ్యయం చొప్పున మొత్తం రూ.6.22 కోట్లను ఇందుకు కేటాయిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 49 ఎపిఎస్ఆర్‌డబ్ల్యుఆర్ఇఐఎస్ సంస్థల్లోను, రెండు ఎపి స్టడీ సర్కిళ్లలోను రూ.6 లక్షల రూపాయల విలువైన ఆర్‌ఒ ప్లాట్లను ఏర్పాటు చేయనున్నారు. ఈ ఆర్‌ఒ ప్లాంట్ల ఏర్పాటు పనులను 45 రోజుల్లోగా పూర్తి చేయాలని ఉత్తర్వుల్లో వెల్లడించారు. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎపి ఎస్‌సి కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్, మైనేజింగ్ డైరెక్టర్‌కు సూచించింది.

చిలీ అధ్యక్ష ఎన్నికల్లో

లెఫ్ట్ అభ్యర్థి ముందంజ



శాంటియాగో : చిలీ అధ్యక్ష ఎన్నికల్లో వామపక్ష అభ్యర్థి ముందంజలో ఉన్నారు. మొదటి విడత జరిగిన ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ తరుపున పోటి చేసిన జెన్నెట్ జారా 26.85% ఓట్లు సాధించారు. మితవాద పార్టీ అయిన రిపబ్లికన్ పార్టీ నుండి పోటీ చేసిన జోస్ ఆంటోనియోకి దాదాపు 23.92% ఓట్లు వచ్చాయి. ఫ్రాంకో పారిసి (పార్టీ ఆఫ్ పీపుల్) 19.71% ఓట్లతో మూడవ స్థానాన్ని పరిమితమయ్యారు. మరో అభ్యర్థి జోహన్నెస్ కైసర్ ఓటమిని అంగీకరించారు. ఏ అభ్యర్థికీ 50% ఓట్లు రాకపోవడంతో రెండో విడత ఎన్నిక అనివార్యమయింది. ఈ ఎన్నికలు డిసెంబర్ 14న జరగనున్నాయి. దీనిలో జారా, జోస్ ఇద్దరు అభ్యర్థులు మాత్రమే పోటీపడనున్నారు.. మిగతా అభ్యర్థులకంటే అధిక ఓట్లు సాధించిన లెఫ్ట్ నాయకురాలు జెన్నెట్ జారా దేశంలో వ్యవస్థీకృత నేరాలను అరికడతానని, బ్యాంక్‌ల పనితీరును మెరుగుపరుస్తానని, జీవన ప్రమాణాలు పెంచుతానని ప్రచారం చేశారు. మరోవైపు మితవాద పార్టీ అభ్యర్థి జోస్ ఆంటోనియో అమెరికాతో చేతులు కలిపి ట్రంప్ విధానాలను ప్రచారం చేశారు. వలసదారులను తరిమేస్తానని, బొలివియా సరిహద్దులో గోడలు, కంచెలు, కందకాలు నిర్మిస్తానని ప్రచారం చేశారు. దీంతో వామపక్షం వర్సెస్ ఫాసిజంగా ఎన్నికలు మారిపోయాయి.

రైతు ఖాతాల్లో రూ.560 కోట్లు జమ

- మంత్రి నాదెండ్ల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రాష్ట్రంలో ముమ్మరంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ జరుగుతున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. విజయవాడ కానూరులోని సివిల్‌సప్లై కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 32,793 మంది రైతుల వద్ద నుంచి 2,36,284 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు చెప్పారు. రైతులకు సుమారు రూ.560.48 కోట్లు వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. ధాన్యం అమ్మిన రైతుల్లో కౌలు రైతులు 6,600 మంది ఉన్నారన్నారు. గోనె సంచుల సమస్య లేకుండా 6.34 కోట్ల గోతాలను రైతు సహాయ కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు. ఈ నెల 23, 24 తేదీల్లో తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో 50 వేల టార్పాలిన్‌లు రైతు సహాయ కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని మంత్రి తెలిపారు. ఇప్పటి వరకు 19వేల టార్పాలిన్‌లు రైతులకు ఉచితంగా పంపిణీ చేసినట్లు ఆయన వెల్లడించారు.

కౌలు రైతులకు ఇప్పుడూ లేదు!

- 'అన్నదాతా..' రెండవ కిస్తులోనూ మొండి చెయ్యి
- ఎప్పుడిస్తారో తెలపని కూటమి సర్కార్
- వాస్తవ సాగుదార్ల ఆవేదన

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

రైతులకు వ్యవసాయ పెట్టుబడుల నిమిత్తం ఈ సంవత్సరంలో 'అన్నదాతా సుఖీభవ' రెండవ కిస్తును బుధవారం విడుదల చేసేందుకు రంగం సిద్ధం చేసిన రాష్ట్ర ప్రభుత్వం, ఈ తడవ కూడా కౌలు రైతులకు మొండి చెయ్యి చూపించింది. ఆగస్టు 2న పథకం ప్రారంభించి మొదటి కిస్తు విడుదల చేసేటప్పుడూ కౌలు రైతులను మినహాయించి రెండవ కిస్తు విడుదల సమయంలో ఇస్తామంది. ఇప్పుడు కూడా కౌలు రైతులను తప్పించి తర్వాత అంటోంది. లేదంటే మూడవ కిస్తు సమయంలో మొత్తం మూడు కిస్తుల సొమ్మునూ ఒకేసారి జమ చేస్తామని మాట మార్చింది. ఈ సారైనా తమకు అన్నదాతా.. సాయం అందకపోతుందా అని కొన్ని నెలలుగా ఎదురు చూస్తున్న కౌలు రైతుల ఆశలపై కూటమి సర్కార్ నీళు చల్లింది. ఈ మారు సైతం తమకు సాయం లేదనడంతో కౌలు రైతులు ఆవేదన చెందుతున్నారు.

సూపర్ సిక్స్..!

రైతులకు ఏటా రూ.20 వేల ఆర్థిక సాయం చేస్తామని సూపర్ సిక్స్‌లో భాగంగా కూటమి హామీ ఇవ్వగా, అధికారంలోకొచ్చాక తొలేడాది ఇవ్వలేదు. రెండవ ఏడాది 2025 ఖరీఫ్ నుంచి స్వంత భూమి కలిగిన రైతులకు కేంద్ర పథకం పిఎం కిసాన్‌తో కలిపి తమ అన్నదాతా... సాయాన్ని ఏడాదిలో మూడు కిస్తుల్లో... ఖరీఫ్, రబీ, వేసవిలో అందిస్తామన్నారు. కౌలు రైతులకు రాష్ట్ర ఖజానా నుంచి మొత్తం రూ.20 వేలూ జమ చేస్తామన్నారు. ఆగస్టు 2న తొలి కిస్తు కేంద్రం వాటా రూ.2 వేలు, రాష్ట్రం వాటా 5 వేలు వెరసి... 7 వేలు 46.86 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. అప్పుడు కౌలు రైతులకు ఇవ్వకుండా వాయిదా వేశారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేసి మరీ ఇస్తామన్నారు. బుధవారం రెండవ కిస్తును తిరిగి 46.86 లక్షల మందికి నగదు బదిలీ చేస్తున్నట్లు ప్రకటించారు. తొలి జాబితాలపై రైతుల నుంచి లక్షల్లో అభ్యంతరాలు, అర్జీలు వచ్చాయి. గ్రీవెన్స్‌లో వచ్చిన దరఖాస్తులపై ఎలాంటి చర్యలూ చేపట్టకుండా, జాబితాలు అప్‌డేట్ కాకుండా, మొదటి కిస్తు ఇచ్చిన వారందరికీ రెండవ కిస్తును ప్రభుత్వం బుధవారం జమ చేస్తోంది. మరో వైపు కౌలు రైతులకు ఇవ్వాల్సిన సాయాన్ని ఇవ్వకుండా వాయిదా వేసింది. ఒకటి, రెండు కిస్తుల బకాయిలను వీలైనంత త్వరలో, లేదంటే అన్నదాతా.. మూడవ కిస్తు ఇచ్చే సమయంలో ఒకేసారి జమ చేసే అవకాశం ఉందని అధికార వర్గాలు వెల్లడించాయి. కౌలు రైతులకు ఎప్పుడిచ్చేదీ ప్రభుత్వం అధికారికంగా స్పష్టత ఇవ్వకుండా దాట వేసింది.

వారికే సాయం అవసరం

రాష్ట్రంలో కౌలు వ్యవసాయం అంతకంతకూ విస్తరిస్తోంది. అరవై శాతానికిపైగా విస్తీర్ణం కౌలు రైతుల చేతుల్లోనే ఉంది. కొన్ని జిల్లాల్లో 80, 90 శాతం ఉంది. లక్షలాదిగా ఉన్న కౌలు రైతులకు గుర్తింపు కార్డులు రావడం గగనమవుతుండగా, కార్డులిచ్చిన వారికి అనేక కొర్రీలు వేసి బ్యాంకులు రుణాలివ్వట్లేదు. ఇప్పుడున్న చట్టం స్థానంలో కొత్త కౌలు చట్టం తెచ్చి కార్డుల జారీని సులభతరం చేస్తామన్న కూటమి సర్కార్ ఆ కసరత్తును అర్థంతరంగా నిలిపివేసింది. మొంథా తుపాన్, అకాల, భారీ వర్షాలు, కరువు వలన పంట నష్టపోయింది కౌలు రైతులే. వారికే తిరిగి సాగును సాగించడానికి పెట్టుబడులు అవసరం అవుతాయి. మోడీ సర్కార్ అసలు కౌలు రైతులను సాగుదార్లుగా పరిగణించట్లేదు. సాయం చేస్తామన్న కూటమి ప్రభుత్వం తొలేడాది ఇవ్వలేదు.

రెండవ ఏట కౌలు దారులకు ఇవ్వకుండా స్వంత భూమి కలిగిన రైతులకు రెండు కిస్తులిస్తూ... కౌలు రైతులకు కొద్దిపాటి సాయాన్ని సైతం వాయిదా వేసింది.

పరకామణిలో చోరీ ఘటనపై మరోసారి కేసు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సమావేశం మంగళవారం తిరుమల అన్నమయ్య భవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో పరకామణిలో చోరీ ఘటనపై కీలక నిర్ణయం చేసింది. ఈ సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ పరకామణి చోరీ ఘటనపై మరోసారి పోలీసులకు ఫిర్యాదు చేయాలని, లోక్ అదాలత్ రాజీ వెనుక ఉన్న కుట్రను తేల్చాలని తీర్మానించారు. గతంలో నమోదైన కేసు పరిధి పరిమితంగా ఉండడంతో ఇటీవల కాలంలోనూ మరిన్ని చోరీ ఘటనల దృష్ట్యా మరో కేసు పెట్టాలని నిర్ణయించామని, తిరుమల వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నామని చెప్పారు.

పిఎం, సిఎంల కార్యక్రమాలు ప్రత్యక్ష ప్రసారం

- వ్యవసాయశాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ నిధులు విడుదల సందర్భంగా ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొంటున్న కార్యక్రమాల ప్రత్యక్ష ప్రసారాన్ని రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాలు, రైతు సేవా కేంద్రాలు, కెవికెలలో, వ్యవసాయ పరిశోధనా స్థానాల్లో ప్రసారం చేయాలని అధికారులను వ్యవసాయశాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. మంగళగిరిలోని వ్యవసాయశాఖ డైరెక్టర్ కార్యాలయం నుంచి ఈ అంశంపై జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ పథకంలో కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు చొప్పున మొత్తం రూ.7 వేలను రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 46.86 లక్షల మందికి రూ.3,135 కోట్లను విడుదల చేస్తున్నట్లు చెప్పారు. పంట కొనుగోళ్ల కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, భూసార పరీక్షలు, మార్కెట్ డిమాండ్ పంటల సాగు, భూసార పరీక్షలు తదితర అంశాలపై వివరించాలన్నారు. నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి వరకూ అర్హులు, అనర్హులు, ఎన్‌పిసిఐ క్రియాశీలకంగా లేని ఖాతాల వివరాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషి

- మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తుందని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. ఇందుకోసం నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించడంతోపాటు, డ్రగ్స్‌కు బానిసలైన వారికి డ్రగ్ డి అడిక్షన్ సెంటర్‌లను ప్రతి జిల్లాలో ఏర్పాటు చేశామన్నారు. వీటి ద్వారా కౌన్సెలింగ్, చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం చేపట్టి ఐదేళ్ళ పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సదస్సుల్లో భాగంగా సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యాన విజయవాడలోని దేవయ్య ఆడిటోరియంలో మంగళవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి డోలా మాట్లాడుతూ.. డ్రోన్ల సాయంతో గంజాయి సాగును గుర్తించి నిర్వీర్యం చేయడం, గంజాయి సాగు చేసే వారికి అవగాహన కల్పించి ప్రత్యామ్నాయ పంటలవైపు మళ్లించేలా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదంతో ప్రత్యేక క్యాంపెయిన్లను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేష్, అనిత నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ఈగల్ ఎస్‌పి కెఎస్ నగేష్ తదితరులు ప్రసంగించారు. అనంతరం విద్యార్థులతో రాష్ట్రాన్ని మాదక ద్రవ్య రహితంగా తీర్చిదిద్దేందుకు ధృడమైన సంకల్పం తీసుకుంటున్నామంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిసేబుల్డ్, నషాముక్త్ భారత్ అభియాన్ డైరెక్టర్ రవి ప్రకాష్‌రెడ్డి, రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఉమారాజ్, సాంఘిక సంక్షేమశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు మంత్రి సత్యకుమార్ అభినందనలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విజయవాడ, చుట్టుపక్కల ప్రాంతాలను షెల్టర్ జోన్‌గా ఉపయోగించుకుంటున్న మావోయిస్టులను పక్కా ప్రణాళికతో ఆక్టోపస్, గ్రేహౌండ్స్, ఇంటెలిజెన్స్ పోలీసులు పట్టుకోవడం అభినందనీయమని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ విషయంపై విజయవాడ సిపి రాజశేఖర్‌బాబుతో ఫోన్‌లో మాట్లాడారు. ఇదే స్ఫూర్తిని పోలీసులు కొనసాగించాలని కోరారు.

కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలపై

26న నిరసనలను జయప్రదం చేయండి

- కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపు
- విశాఖ ఉక్కు, ఉద్యోగులపై సిఎం వ్యాఖ్యలకు ఖండన



సదస్సులో మాట్లాడుతున్న సిహెచ్ నరసింగరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులకు ప్రధాన మంత్రి మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ద్రోహం చేస్తున్నారని కార్మిక సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశ్రామిక రంగంలో కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు, రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 26న జరిగే జిల్లా కేంద్రాల్లో నిరసర ప్రదర్శనలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాల సంయుక్తంగా రాష్ట్ర స్థాయి సమావేశం మంగళవారం నిర్వహించారు.

ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు మాట్లాడుతూ.. విశాఖపట్నం ఉక్కు పరిశ్రమ కార్మికులను ఉద్దేశించి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. పరిశ్రమను వైట్ ఎలిఫెంట్ అని, కార్మికులు పనిచేయని దొంగలని, వారిపై పిడి యాక్ట్‌లు పెడతానని హెచ్చరించడం ముఖ్యమంత్రికి సహేతుకం కాదన్నారు. కార్మిక ద్రోహులే ఇటువంటి వ్యాఖ్యలు చేస్తారన్నారు. ఎన్నికల ముందు ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకమని, అధికారం చేపట్టిన అనంతరం మాట మార్చడం సరికాదన్నారు. ఎఐటియుసి రాష్ట్ర నాయకులు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. కార్పొరేట్ అనుకూల, రైతు, కార్మిక వ్యతిరేక విధానాల అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకుంటున్నాయని తెలిపారు. మాజీ మంత్రి, ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. బడా కార్పొరేట్ కంపెనీలకు రాష్ట్ర వనరులను దోచి పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు అధికారం చేపట్టిన తొలి రోజుల నుంచి అన్ని రంగాలనూ ప్రైవేటీకరించేందుకే పెద్దపీట వేస్తున్నారని, ప్రభుత్వ రంగాన్ని నాశనం చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్నారని చెప్పారు. ప్రజాస్వామ్య పోరాటాలతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచాలని కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలకు పిలుపునిచ్చారు. రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నూతన మార్కెట్ విధానం, నూతన విత్తన చట్టం, విద్యుత్ సంస్కరణల పేరుతో రైతులు, కూలీలు, కార్మికులకు ద్రోహం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశానికి సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు అధ్యక్షత వహించి ప్రసంగించారు. సమావేశంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సింహాద్రి ఝాన్సీ, ఎఐకెఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం వెంకటరెడ్డి, ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం రామకృష్ణ, సిఐటియు రాష్ట్ర నాయకులు సుబ్బరావమ్మ, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు సిధీర్, యుటియుసి రాష్ట్ర అధ్యక్షులు జూపల్లి జానకిరాములు, టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు మరీదు ప్రసాద్‌బాబు, ఎఐటియుసి రాష్ట్ర గౌరవాధ్యక్షులు చలాసాని రామారావు, ఉపాధ్యక్షులు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న దిగుమతులపై కేంద్రం మౌనం..!

న్యూఢిల్లీ : అమెరికా ఉత్పత్తులు సోయా, మొక్కజొన్న, పాల ఉత్పత్తుల దిగుమతులకు కేంద్రం అంగీకరించినట్లు స్పష్టమవుతోన్నప్పటికీ దీనిపై కేంద్రంగా మౌనంగా ఉంది. మంగళవారం న్యూఢిల్లీలో ఇండో-అమెరికన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించిన ఇండో-యుఎస్. ఆర్థిక సదస్సులో మంత్రి గోయల్ యుఎస్ ఆంక్షలపై ఎలాంటి వ్యాఖ్యలు చేయకూండా రైతుల ప్రయోజనాలే ముఖ్యమంటూ నమ్మబలికారని అర్థమవుతోంది. అమెరికాతో చేసుకునే ఒప్పందంలో రైతులు, మత్స్యకారుల ఆసక్తులను తప్పనిసరిగా కాపాడుకుంటామన్నారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, వ్యాపారాన్ని విస్తరించే దిశగా ఇద్దరమూ సమానంగా కట్టుబడి ఉన్నామన్నారు. ఈ విషయంలో త్వరలోనే మంచి ఫలితాలు తప్పకుండా వస్తాయన్నారు. అయితే.. అమెరికా షరతులకు భారత్ తలొగ్గినట్లు వస్తోన్నట్లు రిపోర్టులపై మాత్రం ఆయన స్పందించలేదు. ఇప్పటికే ఆ దేశం నుంచి భారీగా వంట గ్యాస్ కొనుగోలుకు ఒప్పందం కుదిరింది. మరోవైపు యుస్‌కు చెందిన మొక్కజొన్న, సోయాబిన్ దిగుమతులకు మోడీ సర్కార్ అంగీకారం తెలిపిందని తెలుస్తోంది. అదే విధంగా ఆ దేశ పాల ఉత్పత్తులను ఇండియాలో అమ్ముకోవడానికి ద్వారాలు తెరువనుందని స్పష్టమవుతోంది. ఓ వైపున అమెరికాకు హామీలు ఇస్తూ.. దేశ ప్రయోజనాలను కట్టబెడుతూనే.. భారత రైతులు, దేశ ప్రయోజనాలే ముఖ్యమంటూ గోయల్ చేస్తోన్న వ్యాఖ్యలు విస్మయాన్ని కలిగిస్తోన్నాయని నిపుణులు అంటున్నారు.

భారత్- రష్యా సంబంధాలే అడ్డంకి : యుఎస్ అధికారి

భారత్‌తో త్వరలోనే వాణిజ్య ఒప్పంద కుదిరే అవకాశం ఉందని ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ టీంలోని నేషనల్ ఎకనామిక్ కౌన్సిల్ డైరెక్టర్ కెవిన్ హాసెట్ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఈ ఏడాది మార్చి నుంచి భారత్-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఇప్పటివరకు ఆరు దఫాల చర్చలు పూర్తయ్యాయని చెప్పారు.

అయితే భారత్, రష్యా సంబంధాలపై ఆయన విషం గక్కారు. భారత్ రష్యాతో చేసే వ్యవహారాలు, మాతో చేసే వ్యవహారాల మధ్య సంక్లిష్టత ఉందన్నారు. త్వరలోనే దీన్ని పరిష్కరించుకోగలమని హాసెట్ అన్నారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రాధాన్యత

- మంత్రి ఫరూక్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను అధికార యంత్రాంగం దృష్టిలో పెట్టుకోవాలని, అందుకు తగ్గట్టుగా సంక్షేమ ప్రణాళికలు ముందుకు తీసుకెళ్లాలని ఆ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ సూచించారు. రాష్ట్ర సచివాలయంలోని మైనార్టీ సంక్షేమశాఖ అధికారులతో సమీక్షను మంగళవారం నిర్వహించారు. ఉర్దూ అకాడమీ, కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థ వినియోగం, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, ఉపాధికి రుణాలు తదితర కార్యక్రమాల అమలుపై అధికారులను మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మైనార్టీ సంక్షేమశాఖ ద్వారా చేపట్టిన పనుల పురోగతిని, వివిధ భవన నిర్మాణ పనుల పూర్తికి నిధుల వినియోగం, ప్రధాన మంత్రి విరాసత్‌క సంవర్ధన్ (పిఎం వికాస్), ప్రధాన మంత్రి జన్ వికాస్ కార్యక్రమం (పిఎంజెవికె), జాతీయ మైనార్టీల అభివృద్ధి ఆర్థిక సంస్థ పథకాల ద్వారా రాష్ట్రానికి వచ్చే నిధుల వినియోగం, హజ్‌యాత్ర (2026)కు తీసుకుంటున్న ముందస్తు చర్యలు గురించి అధికారులు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. ఈ సమావేశంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎమ్‌డి యాకుబ్ బాషా, వక్ఫ్ బోర్డు సిఇఒ మహ్మద్ అలీ, క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎమ్‌డి ఎ శేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సిఆర్‌డిఎ పరిధిలో రూ.36,547 కోట్ల పెట్టుబడులు

25 ఎంఒయులు కుదుర్చుకున్న సంస్థలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖలో జరిగిన సిఐఐ సమ్మిట్లో సిఆర్‌డిఎ పరిధిలోకి భారీగా పెట్టుబడులు వచ్చాయి. రూ.36,547 కోట్లకు సంబంధించి ఎంఒయులను పట్టణాభివృద్ధిశాఖతో కుదుర్చుకున్నారు. సిఆర్‌డిఎ పరిధిలో వేర్వేరు ప్రాంతాల్లో ఈ పెట్టుబడులు పెట్టనున్నారు. రెసిడెన్షియల్, రియల్ ఎస్టేట్, మీడియా, ఎడ్యుకేషన్, కన్వెన్షన్ సెంటర్లు, టూరిజం, సదుపాయాల కల్పన, హోటల్స్, నిర్మాణరంగం, స్టీల్ ఫ్యాబ్రికేషన్, ఫర్నీచర్, సాఫ్ట్‌వేర్ రంగాల్లో ఈ పెట్టుబడులు రానున్నాయి. వీటిల్లో ముఖ్యంగా బెర్జయా గ్రూప్ రూ.4250 కోట్లు పెట్టుబడులు పెట్టనుంది. ఈ సంస్థ నిర్మాణం, వాణిజ్యం, పార్కులు, వేస్ట్‌మేనేజ్‌మెంట్‌లో వేర్వేరు ప్రాజెక్టులు ఏర్పాటు చేయనుంది. మలేషియా కేంద్రంగా ఈ గ్రూపు పనిచేస్తుందని ఎంఒయూలో పేర్కొన్నారు. అయితే ఈ కంపెనీ 2009లో చెన్నైలోని కంపెనీస్ ఆఫ్ రిజిస్ట్రార్‌లో(ఆర్‌ఓసి)రిజిస్టరయింది. కంపెనీ ఎమ్‌డి మునిరత్నం సత్యకుమార్ 2002లో లియోనిక్స్ సిస్టమ్స్ ప్రైవేటు లిమిటెడ్ పేరుతో చెన్నైలో అంబత్తూర్ కేంద్రంగా కంపెనీ రిజిస్ట్రేషన్ చేశారు. సత్యకుమార్ ఇండియాలోనే పలు కంపెనీలకు ఎమ్‌డిగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం మలేషియా కేంద్రంగా సిఆర్‌డిఏ పరిధిలో పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందం చేసుకుంది. మలేషియా ఆంధ్రప్రదేశ్ బిజినెస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సంస్థ రియల్ ఎస్టేట్ రంగంలో రూ.2000 కోట్లు పెట్టుబడులకు ఎంఒయు చేసుకుంది. వీటితోపాటు మీడియా రంగంలో ఫ్యాషన్ ఎంటర్‌ప్రెన్యూర్ ఫండ్ రూ.1200 కోట్లు, మణిపాల్ రూ.15 వేల కోట్లు పెట్టుబడులు పెట్టనున్నాయి. ఇ ఎఫ్ఇఎఫ్ సంజయ్ నిగమ్ గ్రూపునకు చెందినది. నెల్లూరుకు చెందిన షణ్ముకేశ్వరప్రసాదు, ఆలూరి వంశీజ్యోతికి చెందిన అమరావతి లైఫ్ సైన్సెస్ విద్యారంగంలో రూ.2000 కోట్లు పెట్టుబడులకు ఒప్పందం చేసుకున్నారు. ఆస్ట్రేలియాకు చెందిన విక్టోరియానా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అంతర్జాతీయ ఎడ్యుకేషన్ హబ్ రంగంలో రూ.2000 కోట్లు పెట్టుబడులు పెట్టనున్నారు. వీటితోపాటు అమరా టివిఈటి రూ.100 కోట్లు, జింఖానా రూ.150 కోట్లు, జెపిఓడిఎస్ రూ.800 కోట్లు పెట్టుబడులు పెట్టనున్నాయి. ఇప్పటికే విజయవాడ దగ్గర భవానీద్వీపం దగ్గర కృష్ణానదిలో బోట్లను నిర్వహిస్తున్న విజయవాడకు చెందిన ఛాంపియన్స్ యాచ్ క్లబ్ రూ.126 కోట్లు పెట్టబడుల పెట్టేందుకు ఒప్పందం చేసుకుంది. ఇది విజయవాడకు చెందిన కాకాని తరుణ్‌ది. అలాగే ఛాంపియన్స్ లగ్జరీ రిసార్ట్స్ రూ.225 కోట్లు, ఛాంపియన్స్ ఇన్ఫోమెట్రిక్స్ రూ.225 కోట్లు పెట్టుబడులకు ఒప్పందం చేసుకున్నాయి. ఈ రెండు కంపెనీలు కూడా విజయవాడకు చెందిన సూరపనేని సుభాకరరావుకు చెందినవి, ఛాంపియన్స్ యాచ్ క్లబ్ కాకాని తరుణ్ నిర్వహిస్తున్నారు.

లేక్‌వుడ్ డెంటర్ రూ.500 కోట్లు, బాసిల్‌వుడ్ స్కూలు రూ.40 కోట్లు పెట్టుబడులకు ఎంఒయు చేసుకున్నాయి. ఇప్పటికే హోటల్ నిర్మాణం కోసం రాజధాని పరిధిలో భూములు పొందిన ఓంశ్రీ భావనసాయి రూ.1200 కోట్లకు, మాలక్ష్మి గ్రూపు రూ.330 కోట్లకు ఒప్పందం చేసుకున్నాయి. ఇండో రాయల్ క్రాఫ్ట్ ప్రైవేటు లిమిటెడ్ రూ.258 కోట్లతో మల్లవల్లిలో పెట్టుబడులు పెట్టనుంది. ముఖ్యంగా క్రాస్‌కోర్ట్ స్పోర్ట్స్ క్లబ్ రూ.2600 కోట్ల పెట్టుబడులు, ఎలివేట్ ఏఐ రూ.160 కోట్లు, ఏఎస్‌సి అసెండా సూరియా కమ్యూనికేషన్స్ రూ.40 కోట్లు, ఈస్పోర్ట్స్ ఎపెక్స్ రూ.300 కోట్లు చొప్పున పెట్టుబడులు పెట్టనున్నాయి. సిఆర్‌డిఏ పరిధిలో పెట్టుబడులకు ఓంఎయు కదుర్చుకున్న పలు కంపెనీలు ఇప్పటికే ఈ ప్రాంతంలో తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి.

వైకుంఠ ద్వార దర్శనంపై తర్జనభర్జన

- మూడు రోజులు ఆన్‌లైన్ బుకింగ్ మాత్రమే
- నేరుగా వచ్చే యాత్రికులకు దర్శనం లేనట్లే..
- టిటిడి పాలకమండలి కీలక నిర్ణయాలు

ప్రజాశక్తి - తిరుమల

గతేడాది వైకుంఠ ఏకాదశి దినాల్లో తొక్కిసలాట జరిగిన నేపథ్యంలో రానున్న వైకుంఠ ద్వార దర్శనంపై తర్జనభర్జన జరిగింది. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి, జనవరి 1 తేది దర్శన టికెట్లు ఉంటేనే తిరుమలకు అనుమతించనున్నామని టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు స్పష్టం చేశారు. వైకుంఠ ఏకాదశి పది రోజుల దర్శనాలపై సమావేశంలో నిర్ణయం తీసుకొన్నామన్నారు. తిరుమల అన్నమయ్య భవనంలో మంగళవారం టిటిడి పాలకమండలి సమావేశం జరిగింది. సమావేశంలో బిఆర్ నాయుడు మాట్లాడుతూ డిసెంబర్ 30 నుంచి జనవరి ఎనిమిది వరకు వైకుంఠ ద్వార దర్శనాలలో సామాన్య యాత్రికులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. పది రోజుల్లో 182 గంటలు దర్శనం అవకాశం ఉందని, ఇందులో 164 గంటలు సామాన్యులు దర్శనం చేసుకునేలా నిర్ణయించామని తెలిపారు. పది రోజులు ఆర్జితసేవలు, ప్రత్యేక దర్శనాలు రద్దుతో పాటు వైకుంఠ ఏకాదశి, ద్వాదశి, జనవరి ఒకటో తేదీ మూడు రోజులు ఆన్‌లైన్‌లో టికెట్లకు నవంబర్ 27 నుండి డిసెంబరు 1 తేది వరకు రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు. స్థానికులకు రూ.ఐదు వేల టికెట్లు బుక్ చేసుకొనే అవకాశం ఉందని తెలిపారు. ఈ నమోదు ప్రక్రియ పూర్తి కాగానే డిసెంబరు 2న లక్కీడిప్ తీస్తామన్నారు. పది రోజులకు ఎనిమిది లక్షల టికెట్లు కేటాయిస్తామని చెప్పారు. మొదటి మూడు రోజులు 70 వేలు, 75 వేలు, 68 వేలు చొప్పున టికెట్లు ఉన్నవారికి మాత్రమే దర్శనం ఉంటుందన్నారు. దర్శనం లేని వారికి తిరుమలకు అనుమతి ఉన్నా... మాడా వీధుల్లో ప్రదర్శనకు అనుమతిస్తామని... ఆలయ పరిసరాల్లో కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకోవచ్చని వారికి ఎటువంటి ఇబ్బందులు లేవన్నారు. రోజుకు 20 గంటల్లో 17.5 గంటలు సామాన్యులకే అవకాశ కల్పనకు తీర్మానించామన్నారు. నాలుగో రోజు నుండి సర్వదర్శనం అమలు చేస్తామని తెలిపారు. వాట్సప్‌లోనూ టికెట్లు బుక్ చేసుకోవచ్చన్నారు. గోవింద మాల యాత్రికులకు ప్రత్యేక దర్శనాలు ఉండవని... వారు ఆన్ లైన్ బుక్ చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో టిటిడి ఇఒ అనిల్ కుమార్ సింఘాల్, అదనపు ఇఒ వెంకయ్య చౌదరి పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు

- 8 మందికి గాయాలు



ప్రజాశక్తి-నందిగామ (ఎన్‌టిఆర్ జిల్లా)

ఎన్‌టిఆర్ జిల్లా నందిగామ సమీపంలోని అనాసాగరం వద్ద విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. లారీని కావేరి ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. దీంతో ఎనిమిది మంది తీవ్ర గాయాలపాలయ్యారు. లారీని బస్సు ఓవర్‌టేక్ చేస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి శ్రీకాకుళం వెళ్తున్న ఈ బస్సులో మొత్తం 20 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రులను శ్రీకాకుళం, ఒడిశా ప్రాంతాలకు చెందిన వారిగా గుర్తించారు. పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వారిని నందిగామ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడకు పంపించారు. బస్సు, లారీని క్రేన్‌తో తొలగించి జాతీయ రహదారిపై ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

వాక్ స్వాతంత్ర్యాన్ని హరిస్తున్న టిడిపి కూటమి ప్రభుత్వం

- మాజీ మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్యాన్ని టిడిపి కూటమి ప్రభుత్వం హరించి వేస్తుందని మాజీ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. గుంటూరులోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసిపి అధికార ప్రతినిధి కారుమూరి వెంకటరెడ్డిని ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. ఎందుకు అరెస్టు చేస్తున్నారో కూడా కనీసం సమాచారం ఇవ్వడం లేదన్నారు. రాజకీయ పార్టీలకు ఉన్న ప్రాథమిక హక్కులను పోలీసులను అడ్డుపెట్టుకుని సిఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ హరిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం చేసే తప్పుల గురించి వైసిపి నేతలు మాట్లాడితే వెంటనే పోలీసులను పంపి ఏదో కేసు పెట్టి అరెస్టులు చేస్తున్నారని అగ్రహం వ్యక్తం చేశారు. లోకేష్ ఆదేశాలతో పోలీసు అధికారులు అతిగా ప్రవర్తిస్తున్నారని, భవిష్యత్తులో వారు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు ఉంటాయని కానీ టిడిపి కూటమి ప్రభుత్వం విమర్శలను సహించలేక కొత్త పంథాను అవలంబిస్తోందని అన్నారు. తమ హయాంలో టిడిపి వారు నిత్యం విమర్శించినా ఎప్పుడూ ఈ పద్ధతిలో అక్రమ కేసులు పెట్టలేదని తెలిపారు. తిరుమల పరకామణి కేసులో విచారణకు వెళ్తున్న సిఐ సతీష్‌కుమార్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన అంశాన్ని ప్రస్తావిస్తే తమ పార్టీ వారిని లక్ష్యం చేసుకుని వేధిస్తున్నారని విమర్శించారు. వెంకటరెడ్డిని వెంటనే కోర్టులో హాజరు పర్చాలనిక డిమాండ్ చేశారు. లేదంటే హైకోర్టు ద్వారా న్యాయపోరాటం చేస్తామని తెలిపారు.

రాష్ట్రంలో ఎయిర్ క్రాఫ్ట్ హబ్

- ఫ్లైయింగ్ వెడ్జ్ డిఫెన్స్ ఎరోస్పేస్ సంస్థతో ఒప్పందం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలోకి మరో కీలక ప్రాజెక్టు రాబోతోంది. బెంగళూరు నుంచి పనిచేస్తున్న ఫ్లైయింగ్ వెడ్జ్ డిఫెన్స్-ఏరోస్పేస్ (ఎఫ్‌డబ్ల్యుడిఏ) ఆంధ్రప్రదేశ్‌లో ఫుల్ స్పెక్ట్రమ్ అటానమస్ కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ హబ్‌ను ఏర్పాటుచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పదం చేసుకుంది. ఈ తరహా ప్రాజెక్టు దేశంలోనే తొలిసారి అని చెబుతున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా 1,169 కోట్ల రూపాయల పెట్టుబడి పెడుతున్నట్లు, దీనివల్ల వెయ్యిమందికి ఉపాధి లభిస్తుందని సంస్థ చెబుతోంది. 800 మందికి ప్రత్యక్షంగా, 200 మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. 2022లో ఈ సంస్థను స్థాపించగా, తరువాత డిజిసిఏ నుంచి ధృవీకరణ కూడా అందుకుంది. 2024లో తొలిసారి ఈ సంస్థ తన విమానాన్ని తయారుచేయడం విశేషం. ఇప్పుడు రాష్ట్రంలో ఏరోస్పేస్, రక్షణ విధానాలకు అనుగుణంగా రాష్ట్రంలో హబ్ ఏర్పాటుచేసేందుకు ఒప్పందం కుదుర్చుకోవడం విశేషం. ఈ ప్రాజెక్టు ఏర్పాటుకోసం 500 ఎకరాలను కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ భూమిని కూడా రాయితీ ధరపైనే ఇవ్వాలని నిర్ణయించారు.

గౌరవంగా భావిస్తాం

రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేయడాన్ని గౌరవంగా భావిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక సిఇఓ సుహాస్ తేజాస్కంద పేర్కొన్నారు. ఈ సంస్థద్వారా డెడికేటడ్ మాన్యుఫాక్చరింగ్, ఏఐ ఆధారిత ఎయిర్‌క్రాఫ్ట్ పరీక్షా కేంద్రం కూడా ఉంటుందని ఆయన వివరించారు. ఈ పరిశ్రమ ప్రారంభమైతే రాష్ట్రంలో వచ్చే తరానికి ఉత్తమమైన రక్షణ వ్యవస్థను అందించేందుకు ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు.



ఘనంగా జాతీయ వాటర్ అవార్డుల ప్రదానోత్సవం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రానికి మూడు జాతీయ వాటర్ అవార్డులొచ్చాయి. మంగళవారం నాడిక్కడ విజ్ఞాన్ భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా ఆరో జాతీయ వాటర్ అవార్డులు-2024 ప్రదానోత్సవం జరిగింది. మొత్తం 10 విభాగాల్లో 46 అవార్డులను అందజేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ఉత్తమ గ్రామ పంచాయతీ విభాగంలో అన్నమయ్య జిల్లా దుబ్బిగానిపల్లికి మొదటి బహుమతి వచ్చింది. ఈ అవార్డును జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ అందుకున్నారు. ఈ అవార్డు కింద రూ.2 లక్షల నగదు, ట్రోఫీ అందుకున్నారు. అలాగే ప్రకాశం జిల్లా మురుగుమ్మికి రెండో బహుమతి వచ్చింది. ఈ అవార్డును జిల్లా కలెక్టరు పి రాజబాబు అందుకున్నారు. ఈ అవార్డు కింద రూ.1.5 లక్షల నగదు, ట్రోఫీ అందుకున్నారు. సౌత్ జోన్‌లో నీటిపారుదల రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పొదిలి రాజశేఖరరాజుకు మొదటి బహుమతి వచ్చింది. ఈ అవార్డు కింద రూ.1 లక్ష నగదు, ట్రోఫీ పొదిలి రాజశేఖరరాజు అందుకున్నారు.

ఒక జెఎస్‌జెబి అవార్డు

రాష్ట్రానికి జల్ సంచయ్ జన్ భగీదారి (జెఎస్‌జెబి) అవార్డు వరించింది. కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ ఇచ్చే ఈ అవార్డును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అందజేశారు. 5,502 పనులు పూర్తి చేసిన నెల్లూరు జిల్లాకు అవార్డు వరించింది. ఈ అవార్డు కింద రూ.25 లక్షల నగదు బహుమతిని కలెక్టరు హిమాన్షు శుక్లా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంటుకు చంద్రబాబు వెన్నుపోటు

- ప్రైవేటీకరించబోమని ప్రధానితో ప్రకటన చేయించగలరా?
- మాజీ మంత్రి విడదల రజిని

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్రంతో కుమ్మక్కై విశాఖ స్టీల్ ప్లాంటును ప్రైవేటీకరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రయత్నిస్తున్నారని మాజీ మంత్రి విడదల రజిని ఆరోపించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. విశాఖ స్టీల్ ప్లాంటుకు సిఎం చంద్రబాబు వెన్నుపోటు పొడిచారని, ఉరి బిగించే పని చేస్తున్నారని విమర్శించారు. సిఐఐ సదస్సులో వైట్ ఎలిఫెంట్ వ్యాఖ్యల వెనుక అర్థం అదేనని పేర్కొన్నారు. ప్రైవేటీకరణకు అనుకూలమని చంద్రబాబు సంకేతాలు ఇస్తున్నారని వివరించారు. జగన్ వల్లే గత ఐదేళ్ల ప్లాంటు ప్రైవేటీకరణ ఆగిందని పేర్కొన్నారు. తాము ప్రైవేటీకరణకు వ్యతిరేకమన్నారు. ఇదే విషయాన్ని కేంద్రానికి, ప్రధాని నరేంద్ర మోడీకి లేఖ రూపంలో ఇచ్చామని చెప్పారు. ప్లాంటును కాపాడే మార్గాలను సూచిస్తూ మోడీకి లేఖ కూడా రాశామన్నారు. టిడిపి సపోర్టుతో కేంద్రంలో ఎన్‌డిఎ ఉన్నా.. స్టీల్ ప్లాంటును కనీసం కాపాడే ప్రయత్నం చేయడం లేదని విమర్శించారు. ప్లాంటుపై ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే ప్లాంటును ప్రైవేటీకరించబోమని ప్రధాని మోడీతో ప్రకటన చేయించాలని రజిని డిమాండ్ చేశారు.

రెడ్‌బుక్ పైశాచికత్వం : మాజీ మంత్రి పేర్ని నాని

రెడ్‌బుక్ పైశాచికత్వానికి వెంకటరెడ్డి అరెస్టు పరాకాష్ట అని మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకుని సిఎం చంద్రబాబు ప్రజల గొంతు నొక్కుతున్నారని విమర్శించారు. పార్టీ అధికార ప్రతినిధులు మాట్లాడకూడదని ఎలా ఆంక్షలు పెడతారని ప్రశ్నించారు.

ప్రశ్నిస్తే అరెస్టు చేస్తారా? : ఎమ్మెల్యే తాటిపర్తి

ప్రభుత్వ అన్యాయాలను ప్రశ్నిస్తే అరెస్టు చేయడం ఏమిటని వైసిపి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ విమర్శించారు. అక్రమ అరెస్టులతో డైవర్షన్ పాలిటిక్స్ చేయడం సిగ్గుచేటన్నారు. తక్షణమే కారుమూరి వెంకటరెడ్డిని విడుదల చేయాలన్నారు.

హత్య అని ఎలా ప్రచారం చేశారు : ఎమ్మెల్సీ

టిటిడి మాజీ ఎవిఎస్ఒ సతీష్‌కుమార్ పోస్టుమార్టం రిపోర్టు రాకుండానే హత్యగా టిడిపి నాయకులు ఎలా ప్రచారం చేశారని ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు ప్రశ్నించారు. ప్రభుత్వ వైఫల్యాలు ఎత్తి చూపినందుకే వెంకటరెడ్డిని అరెస్టు చేశారని విమర్శించారు.

వెంకటరెడ్డి అరెస్టు దుర్మార్గం : మనోహర్‌రెడ్డి

కారుమూరి వెంకట్‌రెడ్డి అరెస్టు దుర్మార్గమని వైసిపి లీగల్‌సెల్ అధ్యక్షులు ఎం మనోహర్‌రెడ్డి అన్నారు. సిఐ మృతి కేసులో నిజాయతీగా విచారణ జరపాలని కోరడమే నేరమా? అని ప్రశ్నించారు.

ఉగ్రవాదాన్ని ఉపేక్షించేది లేదు..

- షాంఘై సహకార సంస్థ సమావేశంలో జైశంకర్

మాస్కో : ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా ఉపేక్షించేది లేదని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. రష్యా రాజధాని మాస్కోలో మంగళవారం నిర్వహించిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) మండలి 24వ సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా భారత్ సహించదని స్పష్టం చేశారు. ప్రత్యేకంగా ఎస్‌సిఒ సంస్థ ఉగ్రవాదం, వేర్పాటువాదం, తీవ్రవాదంకు వ్యతిరేకంగా ఏర్పడిందని గుర్తుచేశారు. గత కొంతకాలంగా ఉగ్రవాద చర్యలు పెరిగిపోతున్నాయని, ప్రపంచం దీనిపై దృష్టి పెట్టి పనిచేయాలని కోరారు. ఉగ్రవాదం నుండి తమ పౌరులను కాపాడుకోవడానికి భారత్ కృషి చేస్తుందని తెలిపారు. అయితే ఉగ్రవాదం, వేర్పాటువాదం, తీవ్రవాదం ప్రపంచానికి శత్రువులని, వాటిని తుదముట్టించడానికి ఉమ్మడి ప్రణాళిక ఉండాలని సూచించారు. ఉగ్రవాద కార్యకలాపాలు పెరుగుతున్న సమయంలో ఈ సమావేశానికి ప్రాధాన్యత ఉందని, ఎస్‌సిఒ సంస్థకు భారత్ మద్దతు ఉంటుందని చెప్పారు. అదే సమయంలో సైబర్ భద్రత, వ్యవస్థీకృత నేరాలు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వంటి కీలక అంశాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. చైనా నాయకత్వంలోని షాంఘై సహకార సంస్థలో భారత్ 2005లో పరిశీలకుడిగా హాజరైంది. 2017లో పూర్తి సభ్యదేశంగా చేరింది. 2022, 2023 సంవత్సరాల్లో జరిగిన దేశ అధినేతల సమావేశాలకు భారత్ అధ్యక్షత వహించింది.

నిర్బంధం నడుమ నిరసనలు

- కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక ధర్నాకు పోలీసుల అనుమతి నిరాకరణ
- పలాసకు వచ్చే అన్ని మార్గాల్లో మోహరింపు
- గ్రామాల్లోనే ఆందోళనలు కొనసాగించిన ప్రజలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, పలాస, అమరావతి బ్యూరో

శ్రీకాకుళం జిల్లా మందసలో కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా ప్రజలు నిర్బంధాన్ని అధిగమించి ఉద్యమించారు. పోలీసుల హెచ్చరికలు, ప్రభుత్వ ఆంక్షలను కాదని తమ నిరసనలను కొనసాగించారు. బలవంతపు భూ సేకరణ చేయొద్దంటూ పలాస ఆర్‌డిఒ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించాలని తలపెట్టారు. కానీ ఈ ధర్నాకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో ఈ నేపథ్యంలో ప్రజలు గ్రామాల్లోనే ఆందోళనలకు దిగారు. బలవంతపు భూ సేకరణ ఆపాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. గ్రామాల్లో సభలు, ఆందోళనలను సైతం పోలీసులు అడ్డుకున్నా... వేర్వేరు మార్గాల్లో ప్రజలు ఒకే చోటుకు చేరుకుని తమ నిరసనను



పెద్ద బిడిమిలో ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

వ్యక్తం చేశారు. కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా పలాస ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తారనే సమాచారంతో సోమవారం రాత్రి నుంచే భారీగా పోలీసులు మోహరించారు. పలాసకు వచ్చే అన్ని మార్గాలను నిర్బంధించారు. అటు గ్రామాల్లో సైతం పోలీసులు ఎవరినీ కదలనీయకుండా అడ్డుకున్నారు. మరోవైపు ఉదయం ఆరు గంటల నుంచే వామపక్ష నాయకులను అరెస్టులు చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి గోవిందరావు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావును పలాస మండలం మాకన్నపల్లి వద్ద కాశీబుగ్గ ఎస్ఐ అదుపులోకి తీసుకొని సోంపేట పోలీస్‌స్టేషన్‌కి తరలించారు.

ఎయిర్‌పోర్టు ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలి

కార్గో ఎయిర్‌పోర్టు ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని ప్రజలు, రైతులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. పలాస ధర్నాకు వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకున్న తర్వాత మందస మండలం బిడిమి, రాంనురంలో, వజ్రపు కొత్తూరు మండలం బంకులూరులో పలు గ్రామాలకు చెందిన ప్రజలు సమావేశమయ్యారు. ఎయిర్‌పోర్టుకు సెంటు భూమి ఇచ్చేది లేదని తేల్చిచెప్పారు. ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను దృష్టిలో పెట్టుకుని బలవంతపు భూసేకరణ ఆపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మందస ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు కొమర వాసు, స్థానిక సర్పంచ్ పొట్టి ధర్మారావు, వైఎస్ఆర్ ఉద్యాన యూనివర్సిటీ మాజీ బోర్డు సభ్యులు బత్తిని లక్ష్మణ్, రాంపురం మాజీ సర్పంచ్ బడి సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అప్రజాస్వామికం : సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

కార్గో ఎయిర్‌పోర్టుకు బలవంతపు భూ సేకరణ చేయరాదని కోరుతూ తలపెట్టిన ధర్నాకు పోలీసులు అనుమతి నిరాకరించడాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు. నిరసన తెలిపే ప్రజాస్వామిక హక్కును నిరాకరించడం దుర్మార్గమన్నారు. అరెస్టు చేసిన వారందరినీ వెంటనే విడుదల చేయాలని, కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న వారిపై నిర్బంధాన్ని మానుకోవాలని కోరారు. ప్రజల కోరిక మేరకు కార్గోఎయిర్ పోర్టు నిర్మాణాన్ని ఆపాలని డిమాండ్ చేశారు.



సత్యసాయి బాబా రథోత్సవంలో పాల్గొన్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, మంత్రులు, సత్యసాయి ట్రస్ట్ సభ్యులు

సత్యసాయి శతజయంతి ఉత్సవాలు ఆరంభం

- బాబా రథోత్సవంతో వేడుకలు మొదలు
- పలువురు ప్రముఖులు హాజరు
- నేడు పుట్టపర్తికి ప్రధాని, ముఖ్యమంత్రి రాక

ప్రజాశక్తి- పుట్టపర్తి రూరల్

సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల సంబరం ప్రారంభమైంది. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో మంగళవారం రథోత్సవంతో వేడుకలు మొదలయ్యాయి. ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, దేశవిదేశాల నుంచి వచ్చిన బాబా భక్తుల నడుమ రథోత్సవం కనులపండువగా సాగింది. వెండి రథంపై సత్యసాయి బాబా తొమ్మిది కేజీల బంగారు విగ్రహ ఉత్సవమూర్తిని పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. సత్యమ్మ దేవాలయం నుంచి ప్రారంభమై రథోత్సవం బాబా ఉత్తర గోపురం వరకు కొనసాగింది. రథోత్సవానికి ముందుభాగాన కోలాటాలు, కళాజాతా, కీలుగుర్రాలు, డప్పు, మంగళ వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రథోత్సవ వేడుకల్లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్, సవిత, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ దంపతులు, ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, పరిటాల సునీత, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, మాజీ ఎంపీ మురళీ మోహన్, కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎస్‌పి సతీష్ కుమార్ పాల్గొన్నారు. వెంకయ్య నాయుడు, మంత్రులు... సత్యసాయి ట్రస్టు సభ్యులతో కలిసి రథాన్ని లాగి రథోత్సవాన్ని ప్రారంభించారు.

ఈ వేడుకను తిలకించేందుకు పుట్టపర్తి ప్రజలతో పాటు దేశ, విదేశాల్లోని బాబా భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. జనసందోహంతో పుట్టపర్తి కిటకిటలాడుతోంది. సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం పుట్టపర్తికి రానున్నారు. సత్యసాయిబాబా పేరుతో ఏర్పాటు చేసిన ప్రత్యేక నాణేన్ని ప్రధాని ఆవిష్కరించనున్నారు. ప్రధానికి స్వాగతం పలికేందుకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పలువురు మంగళవారం పట్టపర్తికి చేరుకున్నారు.

ప్రభుత్వ సాయం అందలేదు

- సెల్ టవర్ ఎక్కి ఆటోడ్రైవర్ నిరసన

ప్రజాశక్తి - ఎచ్చెర్ల



సెల్ టవర్‌పై ఉన్న ఆటోడ్రైవర్ కళ్యాణ్

తనకు ఆటో డ్రైవర్ల సేవ పథకం అమలు కాలేదని సెల్ టవర్ ఎక్కి ఓ ఆటోడ్రైవర్ హల్‌చల్ చేసిన ఘటన శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం కుశాలపురం పంచాయతీలో మంగళవారం చోటు చేసుకుంది. ఆటో డ్రైవర్ దాసరి కల్యాణ్ కుమార్ తనకు ఇటీవల ప్రభుత్వం అందజేసిన ఆటో డ్రైవర్ల సేవ పథకం కింద రూ.15 వేలు జమ కాలేదని పంచాయతీలోని యాతపేట వద్ద సెల్ టవర్ ఎక్కి ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలకు ఉచిత బస్సు వల్ల తమ ఆదాయం పూర్తిగా తగ్గిపోయిందని, కుటుంబాన్ని పోషించుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్లకు ఇచ్చే సాయం కూడా తనకు అందలేదని, ఆటో రుణం తీర్చే పరిస్థితి లేకుండా పోయిందని వాపోయారు. తనకు ఆత్మహత్య తప్ప వేరే ప్రత్యామ్నాయం లేదని, అందుకే సెల్ టవర్ ఎక్కానని చెప్పాడు. పోలీసులు అక్కడకు చేరుకుని, డబ్బులు జమ అయ్యేలా సంబంధిత అధికారులతో మాట్లాడతామని నచ్చజెప్పడంతో కల్యాణ్ కుమార్ టవర్ దిగివచ్చారు.



తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న ఐద్వా, ఆశా వర్కర్లు

హిందూపురంలో బాలికపై అత్యాచార యత్నం

ప్రజాశక్తి - హిందూపురం

శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలో దారుణం చోటుచేసుకుంది. తొమ్మిదేళ్ల బాలికపై 55 ఏళ్ల వ్యక్తి అత్యాచారయత్నానికి ఒడిగట్టాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన బాలిక తన పెదనాన్న ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా వరుసకు తాత అయిన గోపీ అనే వ్యక్తి పిలిచాడు. తాము తిరుపతికి వెళ్లి వచ్చామని ప్రసాదం ఇస్తానని చెప్పి ఇంటిలోకి తీసుకువెళ్లాడు. కొద్దిసేపు మాయ మాటలు చెప్పి అత్యాచారయత్నానికి పాల్పడ్డారు. బాలిక గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు బాధితను రక్షించారు. గోపిని స్తంభానికి కట్టేసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా

ఈ ఘటనను ఖండిస్తూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జడ్‌పి శ్రీనివాసులు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ, సిఐటియు పట్టణ కన్వీనర్ రాము, ఐద్వా, ఆశా వర్కర్ల నాయకులు మాట్లాడుతూ దుండగున్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటి తహశీల్దార్ మైనుద్దీన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

రెండేళ్లుగా చీకటి గదిలోనే...

కుమార్తెను నిర్బంధించిన మతిస్థిమితం లేని తల్లి

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం



తల్లి భాగ్యలక్ష్మితో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి పరీష్ కుమార్

మానసిక రోగి అయిన తల్లి రెండేళ్లుగా కుమార్తెను చీకటి గదిలోనే నిర్బంధించిన ఘటన శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం... ఇచ్ఛాపురం పట్టణం చక్రపాణి వీధి లాలాపేట కూడలి వద్ద ఊళ్ల భాగ్యలక్ష్మి తన 16 ఏళ్ల కుమార్తె మౌనికతో కలిసి నివాసముంటున్నారు. పదేళ్ల కిందట ఆమె భర్త మృతి చెందారు. దీంతో ఆమె మానసికంగా కుంగిపోయారు. మోనికను ఒక ప్రైవేటు పాఠశాలలో చదివించేవారు. కుమార్తెను బయటకు పంపిస్తే ఏమవుతుందోనన్న భయంతో 2022లో మోనికను పాఠశాల మానిపించి ఇంట్లోనే ఉంచేశారు. ఎందుకు పాఠశాల మానిపించావని ఇరుగుపొరుగు వారు అడిగితే వారిని దుర్భాషలాడేవారు. ఇంట్లో కరెంటు ఉన్నా మెయిన్ ఆపేసి చీకట్లోనే ఇద్దరూ ఉండేవారు. విషయం తెలుసుకున్న అంగన్‌వాడీ కార్యకర్త ఐసిడిఎస్ పిఒ ఎం రాజేశ్వరికి సమాచారం అందించారు. ఆమె జూనియర్ సివిల్ జడ్జి పరీష్ కుమార్‌ను సంప్రదించారు. వారు తహశీల్దార్ ఎన్ వెంకటరమణ, ఎంఇఒ కె అప్పారావు, ఐసిడిఎస్ పిఒ రాజేశ్వరి, న్యాయవాదులు భారతీదివ్య, ప్రేమలత పట్నాయక్, కోర్టు కానిస్టేబుల్‌తో కలిసి భాగ్యలక్ష్మి ఇంటికి వెళ్లారు. తలుపు ఎంతకొట్టినా తీయకపోవడంతో, సర్వే కోసం వచ్చామని చెప్పడంతో కాసేపటి తర్వాత ఆమె తలుపు తీశారు. అధికారులు లోపలకు వెళ్లేసరికి లోపలంతా చీకటిగా ఉండి బాత్‌రూమ్ దగ్గర మోనిక ఉంది. అక్కడ్నుంచి వారిని కోర్టుకు తీసుకొచ్చి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మానసికంగా ఇద్దరి పరిస్థితి బాగా లేకపోవడంతో మోనికను శ్రీకాకుళం స్టేట్ హోం, భాగ్యలక్ష్మిని విశాఖ కెజిహెచ్‌కి తరలించారు. ఇద్దరూ పూర్తిగా కోలుకున్నాక ఇంటికి చేరుస్తామని జడ్జి పరీష్ కుమార్ తెలిపారు.

తిరుమల రెండో ఘాట్‌లో ప్రమాదం

- వెండార్‌కు తీవ్రగాయాలు

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల ఘాట్ రోడ్‌పై రాయి పడి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో మంగళవారం ఘాట్ రోడ్డులో ఈ ఘటన జరిగింది. స్థానికులు, టిటిడి అధికారులు తెలిపిన వివరాల మేరకు.. తిరుమల లగేజ్ సెంటర్‌లో వెండార్‌గా పనిచేసే లోకేష్ మంగళవారం ఉదయం విధి నిర్వహణ కోసం కొండ పైకి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా రెండో ఘాట్ రోడ్డులోని హరిణి ప్రాంతం వద్ద ప్రమాదానికి గురయ్యారు. కొండ పైనుంచి వర్షం కారణంగా జాలువారిన రాయి అతడిపై పడడంతో, లోకేష్ బైక్ పైనుంచి కిందపడ్డారు.

ఆయన తల, శరీరంపై తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన తోటి యాత్రికులు, వాహనదారులు టిటిడి సిబ్బందికి, అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్‌లో ఆయనను వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నాడని వైద్యులు తెలిపారు.

ప్రభుత్వాస్పత్రుల్లో సిసిబిలు

- వైద్యారోగ్యశాఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వాస్పత్రుల్లో అత్యవసర సేవల కోసం నూతనంగా 24 క్రిటికల్ కేర్ బ్లాకులు (సిసిబి) ఏర్పాటు చేయబోతున్నట్లు వైద్యారోగ్యశాఖ వెల్లడించింది. 2026 ఆగస్టు నాటికి 11 సిసిబిలను వినియోగంలోకి తెచ్చేందుకు వైద్యారోగ్య శాఖ చర్యలు తీసుకుంటుందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. దీంతో అదనంగా 1,275 పడకలు అందుబాటులోకి వస్తాయని తెలిపింది. ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ (పిఎం ఎబిహెచ్ఐఎం)లో భాగంగా రూ.600 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సిసిబిల నిర్మాణాలను దశలవారీ వచ్చే ఏడాది ఆగస్టులోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొంది. గుంటూరు మినహా 16 బోధనాస్పత్రులు, తెనాలి, అనకాపల్లి, హిందూపురం జిల్లా ఆస్పత్రులు, నరసరావుపేట, పాలకొండ, భీమవరం, రాయచోటి, చీరాల ఏరియా ఆస్పత్రుల్లో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. 50 పడకల సిసిబి కోసం రూ.23.75 కోట్ల వ్యయం చేస్తున్నట్లు తెలిపింది. 75 పడకల సిసిబి కోసం రూ.36.35 కోట్లు, 100 పడకల సిసిబి కోసం రూ.44.50 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు, వీటిలో పరికరాల కోసం రూ.7 కోట్లు చొప్పున వ్యయం చేస్తున్నట్లు పేర్కొంది.

పత్తి రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

- మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పత్తి రైతుల సమస్యలను కేంద్ర ప్రభుత్వానికి నివేదించి పరిష్కారానికి కృషి చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇదివరకే ఈ అంశాలపై కేంద్రానికి లేఖ రాయగా అక్కడి నుంచి సానుకూల స్పందన వచ్చిందన్నారు. మొంథా తుపాను ప్రభావంతో పత్తి నాణ్యత విషయంలో భారత పత్తి సంస్థ (సిసిఐ) నిర్దేశించిన ప్రమాణాల వల్ల రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని..ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3 జిన్నింగ్ మిల్లులను ఒకేసారి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే తేమ శాతం 12 నుంచి 18 శాతానికి సడలించడం, తడిసిన లేదా రంగుమారిన పత్తిని సముచిత ధరతో కొనుగోలు చేయాలని కేంద్రాన్ని కోరామన్నారు. ఇందుకు కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా 2025-26 ఖరీఫ్ సీజన్‌లో 5.39 లక్షల హెక్టార్లలో పత్తి సాగు జరిగిందన్నారు. సుమారు 8 లక్షల టన్నుల ఉత్పత్తి నమోదయ్యే వీలుందన్నారు. రాష్ట్రంలో 11 మార్కెట్ యార్డులతోపాటు 64 జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకూ 19 జిన్నింగ్ మిల్లుల ద్వారా రూ.56.59 కోట్ల విలువైన 72,240 క్వింటాళ్ల పత్తిని 2,793 మంది రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు.

పత్తి కొనుగోళ్లలో తేమ నిబంధనలు సడలించాలి

- కాంగ్రెస్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తేమ శాతం విషయంలో షరతుల్లేకుండా భారత పత్తి సంస్థ (సిసిఐ) మద్దతు ధరలకు పత్తి కొనుగోలు చేయాలని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. అలాగే మార్క్‌ఫెడ్ ఆధ్వర్యాన మొక్కజొన్న పంటల కొనుగోళ్లు వెంటనే ప్రారంభించి మద్దతు ధర దక్కేలా చర్యలు తీసుకోవాలని మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. చంద్రబాబు ఏడాదిన్నర పాలనలో ఏ పంటకూ మద్దతు ధర లేదన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం పత్తి రైతుకు దుఃఖం తెచ్చిపెడితే, మొక్కజొన్న రైతుల రెక్కలు విరిచిందని పేర్కొన్నారు. క్వింటా పత్తికి కనీస మద్దతు ధర రూ.8,110 ఉంటే మార్కెట్లో గరిష్టంగా రూ.7 వేలకు మించి కొనుగోలు చేయడం లేదన్నారు. వర్షాలకు రంగు మారిందని, తేమ ఉందని, పురుగు సోకిందని కొర్రీలు పెట్టడం దుర్మార్గమని తెలిపారు. మొక్కజొన్నకు కనీస మద్దతు క్వింటాకు రూ.2,400 ఉంటే మార్కెట్‌లో రూ.1,400కు కూడా కొనడం లేదన్నారు. ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

బంగారం దిగుమతుల్లో 200 శాతం పెరుగుదల



ముంబయి : ధర పెరిగినప్పటికీ బంగారం దిగుమతుల్లో భారీ పెరుగుదల చోటు చేసుకుంది. ఈ ఏడాది అక్టోబర్‌లో పసిడి దిగుమతులు ఏకంగా 199.2 శాతం ఎగిసి 14.7 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. గతేడాది ఇదే నెలలో కేవలం 4.9 బిలియన్ల దిగుమతులు జరిగాయి. పండగ సీజన్ కావడంతో పసిడి దిగుమతులు పెరిగాయని పేర్కొన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి అక్టోబర్ కాలంలో 26.51 బిలియన్ డాలర్ల విలువ చేసే బంగారం దిగుమతి నమోదయ్యిందని వాణిజ్య మంత్రిత్వ శాఖ గణంకాలు తెలిపాయి. గతేడాది ఇదే సమయంలో 29.04 బిలియన్ డాలర్ల దిగుమతులు చోటు చేసుకున్నాయి. గడిచిన ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ కాలంలో దేశంలోకి ఏకంగా 299.77 టన్నుల బంగారం దిగుమతయ్యింది. కాగా.. గతేడాది ఇదే సమయంలో 401.27 టన్నులుగా ఉంది.

అభరణాల ఎగుమతుల్లో 31 శాతం పతనం

అమెరికా టారిఫ్‌లతో రత్నాలు, అభరణాల ఎగుమతులు భారీగా పడిపోయాయి. ఈ ఏడాది అక్టోబర్‌లో 31 శాతం పతనమై 2.17 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయని జెమ్స్ అండ్ జ్యువెలరీ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (జిజెఇపిసి) వెల్లడించింది. గతేడాది ఇదే నెలలో 1.28 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి అక్టోబర్ కాలంలో వీటి ఎగుమతులు 3 శాతం తగ్గి 16.26 బిలియన్లుగా చోటు చేసుకున్నాయి. ఇదే సమయంలో దిగుమతులు 3.2 శాతం పెరిగి 11.87 బిలియన్లుగా నమోదయ్యాయి. గడిచిన అక్టోబర్‌లో డైమాండ్స్ ఎగుమతులు 27 శాతం క్షీణించి 1.03 బిలియన్లుగా చోటు చేసుకున్నాయి. భారత పసిడి అభరణాల ఎగుమతులు 28 శాతం పతనమై 850.15 మిలియన్ డాలర్లుగా నమోదయ్యింది.

ఐషర్ ప్రోఎక్స్ డీజిల్ శ్రేణి విడుదల

న్యూఢిల్లీ : ప్రముఖ వాణిజ్య వాహనాల తయారీదారు ఐషర్ ట్రక్స్ అండ్ బసెస్ కొత్తగా లాజిస్టిక్ రంగం కోసం ఐషర్‌ప్రో ఎక్స్ డీజిల్‌ను విడుదల చేసినట్లు ప్రకటించింది. ఈ కొత్త వాహనాలను ప్రత్యేకంగా ఇ-కామర్స్, ఎఫ్‌ఎంసిజి, కోల్డ్ చైన్, పండ్లు, కూరగాయలు , పార్శిల్, కొరియర్ విభాగాల కోసం రూపొందించబడిందని తెలిపింది.

కొత్త ఐషర్ ఇ449 ఇంజిన్‌తో లభిస్తుందని విఇ కమర్షియల్ వెహికల్స్ లిమిటెడ్ ఎండి అండ్ సిఇఒ వినోద్ అగర్వాల్ తెలిపారు. ఐషర్ ప్రో ఎక్స్ డీజిల్ విడుదలతో భారతదేశంలో చివరి మైలు లాజిస్టిక్స్‌ను మార్చడంలో తాము మరో ముఖ్యమైన అడుగు వేస్తున్నామన్నారు.

ఎంఎస్ఎస్ఎఫ్ 25 లక్షల కార్ రుణాల జారీ

న్యూఢిల్లీ : దిగ్గజ ఆటోమొబైల్ కంపెనీ మారుతి సుజుకి ఇండియాకు చెందిన డిజిటల్ ఫైనాన్సింగ్ ప్లాట్‌ఫారమ్ అయిన మారుతి సుజుకి స్మార్ట్ ఫైనాన్స్ (ఎంఎస్ఎస్ఎఫ్) ఇప్పటి వరకు 25 లక్షల కార్లకు రుణాలను జారీ చేసి నూతన మైలురాయిని సాధించినట్లు తెలిపింది. 2020-21లో సంస్థను ప్రారంభించబడినప్పటి నుండి సాంప్రదాయ కార్ ఫైనాన్సింగ్‌లో ఉన్న అడ్డంకులను తొలగించి కస్టమర్‌లకు పారదర్శకమైన, పూర్తిగా డిజిటల్ పద్దతిలో సులభంగా రుణాలు అందించినట్లు పేర్కొంది. ఈ మొత్తం రుణాల విలువ రూ.1.7 లక్షల కోట్ల కంటే ఎక్కువని మారుతి సుజుకి ఇండియా లిమిటెడ్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బనర్జీ పేర్కొన్నారు. ఈ రోజుల్లో చాలా మంది కస్టమర్‌లు తమ కారు కొనుగోలు ప్రయాణాన్ని ఆన్‌లైన్‌లోనే ప్రారంభిస్తున్నారన్నారు.

అయ్యో... రొయ్య

- 70 వేల టన్నుల సరుకు బ్లాక్
- ఎగుమతిదారులు విలవిల



ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ జిల్లా ఆనందపురంలోని సముద్ర ఉత్పత్తుల (రొయ్య) ఎగుమతిదారీ సంస్థ స్ప్రింట్ గతంలో రోజుకు 40 టన్నులను అమెరికాకు ఎగుమతి చేసేది. ప్రస్తుతం 15 టన్నులకు అది పడిపోయింది. గతంలో నెలకు ఇక్కడి నుంచి 50 కంటైనర్ల రొయ్యలు అమెరికాకు వెళ్లేవి. ప్రస్తుతం 20కి పడిపోయాయి. మరో సంస్థ రొయ్యల ఎగుమతి టర్నోవర్ 2023-24 మధ్య కాలంలో రూ.500 కోట్లు ఉండగా 2024 సెప్టెంబర్ నుంచి ఇప్పటి వరకూ రూ.150 కోట్లకు పరిమితమైంది. రొయ్యల ఎగుమతులపై 50 శాతం అమెరికా సుంకాలు విధించడంతో ఆ దేశానికి ఎగుమతులు తగ్గించుకుంటున్నామంటూ సంబంధిత ఎక్స్‌పోర్టర్ 'ప్రజాశక్తి'కి తెలిపారు. రాష్ట్రంలోని ఏ సముద్ర ఉత్పత్తుల ఎగుమతి సంస్థను కదిపినా ఇదే ఆవేదన వ్యక్తమవుతోంది. రాష్ట్రంలోని రొయ్యల ఉత్పత్తుల ఎగుమతి సంస్థలు 40 నుంచి 45 వరకూ ఉన్నాయి. సెప్టెంబర్ నుంచి వీటికి దెబ్బమీద దెబ్బ పడుతూనే ఉంది. విశాఖ జిల్లాలో పది ఎగుమతి సంస్థలు ఉన్నాయి. వేల టన్నుల సరుకు బ్లాక్ అయిపోవడంతో టర్నోవర్‌పై తీవ్ర ప్రభావం పడిందని, కొత్త మార్కెట్లను వెతుక్కుంటున్నప్పటికీ సంక్షోభం నుంచి బయటపడే మార్గం కానరావడం లేదని ఆ సంస్థల నిర్వాహకులు వాపోతున్నారు. డిమాండ్ లేకపోవడంతో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలతోపాటు ఇతర జిల్లాల్లోనూ రొయ్యల సాగు తగ్గించుకోవడం కూడా అష్టదిగ్బంధం విధించినట్టు అయ్యిందంటూ ఓ ఎగుమతి సంస్థ ప్రతినిధి తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మన దేశ రొయ్యల ఎగుమతులపై 50 శాతం సుంకాలను విధించిన ఫలితంగా సుమారు 70 వేల టన్నుల 'వెనామి' రకం రొయ్యలు ఎగుమతి కాకుండా బ్లాక్ అయ్యాయి. సుంకాల ప్రభావంతో సుమారు రూ.30 వేల కోట్ల మేర టర్నోవర్ దెబ్బతిన్నట్లు ఎగుమతిదారులు తెలిపారు. ప్రపంచంలో 40 శాతం రొయ్యలను భారతదేశం నుంచి అమెరికాకు ఎగుమతి చేయడం ఆనవాయితీగా వస్తోంది. సెప్టెంబర్ తర్వాత అది 15 శాతానికి పడిపోయింది. ప్రపంచంలోనే టాప్ టెన్ ఇండస్ట్రీల్లో సముద్ర ఉత్పత్తులు ఒకటి. దీనిలో మన రాష్ట్రమే ఎగుమతుల్లో అగ్రగామి. అమెరికా సుంకాల వల్ల జపాన్, చైనా, ఈక్వెడార్ ప్రాంతాలకు తమ ఎగుమతుల వ్యాపారాన్ని విస్తరించేందుకు ఎగుమతి సంస్థలు చేస్తోన్న ప్రయత్నాలు ప్రస్తుతం ప్రారంభ దశలోనే ఉన్నాయి.

అమెరికాకు కాకుంటే ప్యాకేజీ మార్చాల్సిందే!

ప్యాకింగ్‌ల సమస్య తలెత్తుతోందని సీ ఫుడ్ ఎక్స్‌పోర్టర్స్ తాజాగా చెబుతున్నారు. ప్యాకింగ్ విధానాన్ని ఒక్కో దేశం ఒక్కో రీతిలో కోరుకుంటుంది. అమెరికాకు ఎగుమతి చేసే ఉద్దేశంతో ఇప్పటికే సుమారు 70 వేల టన్నుల ప్యాకింగ్ పూర్తయింది. అయితే, సుంకాల పెంపుతో ఈ సరుకంతా బ్లాక్ అయిపోయింది. దీంతో, అమెరికాకు కాకుంటే ప్యాకింగ్ మొత్తం మార్చాల్సి ఉంది. అంతేగాక ఈ దేశాల అవసరం మొత్తం కలిపినా అమెరికా ఇది వరకూ మన రాష్ట్రం నుంచి అయ్యే దిగుమతులకు చేరుకునే పరిస్థితి లేదని సముద్ర ఉత్పత్తుల ఎగుమతి సంస్థలు తలలు పట్టుకుంటున్నాయి.

ఎఐతో అన్ని కంపెనీలపై ప్రభావం

- గూగుల్ చీఫ్ సుందర్ పిచాయ్



వాషింగ్టన్ : కృత్రిమ మేధ (ఎఐ) విస్ఫోటనం చెందితే దాని ప్రభావం అన్ని కంపెనీలపై పడుతుందని గూగుల్ సంస్థకు చెందిన ఆల్ఫాబెట్ సిఇఒ సుందర్ పిచాయ్ హెచ్చరించారు. ప్రస్తుతం కొనసాగుతోన్న ఎఐ బూమ్‌లో హేతుబద్దత లేదని.. అయినప్పటికీ రంగంలో పెట్టుబడులు పెరుగుతున్నాయన్నారు.

వాస్తవానికి ఎ కంపెనీ కూడా ఎఐ ప్రభావానికి లోనుకాకుండా ఉండలేదన్నారు. ఆ జాబితాలో తాము కూడా ఉంటామన్నారు. ఎఐ ద్వార సేకరించే సమాచారాన్ని గుడ్డిగా నమ్మవద్దని పిచాయ్ సూచించారు. ఎఐ మోడల్స్‌లోనూ పొరపాట్లు జరుగుతున్నాయన్నారు. కచ్చితమైన సమాచారాన్ని ఇచ్చేందుకు చాలా వర్క్ చేస్తున్నామన్నారు. కానీ ప్రస్తుతం ఉన్న ఏఐ విధానాలతో సమస్యలు వచ్చే అవకాశాలు కూడా ఉన్నాయన్నారు. గూగుల్ ఎఐ తాజా మోడల్ జెమిని 3.0 కోసం టెకీ ప్రపంచం ఎదురు చూస్తోందన్నారు. ఎఐ సెక్యూర్టీ గురించి కూడా పెట్టుబడి పెంచినట్లు పిచాయ్ తెలిపారు. ఏదైనా ఇమేజ్ ఏఐ ద్వారా వచ్చిందా లేదా అని తెలుసుకోవడానికి ఓపెన్ సోర్స్ టెక్నాలజీ అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొన్నారు.

సంపాదకీయం

టిబిని తరిమికొడదాం

ప్రపంచవ్యాప్తంగా నమోదవుతున్న క్షయ కేసులలో 25 శాతం మన దేశంలోనే నమోదవడం తీవ్ర ఆందోళనకరం. విశ్వవ్యాప్తంగా ఈ మహమ్మారి బారినపడిన దేశాల్లో మొదటి స్థానంలో భారత్ కొనసాగుతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజా నివేదిక వెల్లడించింది. 2015-25 మధ్య 50 శాతం కేసులు తగ్గిస్తామని కేంద్రం నిర్దేశించుకున్న లక్ష్యం 28 శాతం వద్దే చతికిలపడింది. 2024లో ప్రపంచవ్యాప్తంగా 83 లక్షల కొత్త టిబి కేసులు వెలుగుచూస్తే, వాటిలో 26 లక్షల 18 వేలకు పైగా కేసులు నమోదైంది మన దేశంలోనే. ఇవి కాకుండా ఇండియాతోపాటు అభివృద్ధి చెందిన దేశాల్లో గుర్తించని కేసులు అత్యధికంగా ఉన్నాయి. మన తరువాత స్థానంలో... ఇండోనేషియాలో 10 శాతం, ఫిలిప్పైన్స్‌లో 6.8 శాతం, చైనాలో 6.5 శాతం, పాకిస్తాన్‌లో 6.3 శాతం, నైజీరియాలో 4.8 శాతం, బంగ్లాదేశ్‌లో 3.6 శాతం కేసులు నమోదవుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 12.3 లక్షల మంది ఈ మహమ్మారి వల్ల ప్రాణాలు కోల్పోతుండగా, వారిలో నాలుగోవంతు భారతీయులే. మరోవైపు ఔషధాలకు లొంగని మల్టీ డ్రగ్ రెసిస్టెంట్ టిబి కేసుల్లో 32 శాతం మనదేశంలోనే నమోదయ్యాయి. 85 శాతానికిపైగా టిబి రోగులకు చికిత్స అందుబాట్లో ఉన్నా... ఖరీదైన మందులు కొనుగోలు చేయలేక సతమతమవుతున్నారు. 20 శాతం మంది రోగులు తమ ఆదాయంలో 20 శాతానికిపైగా ఈ వైద్యానికే ఖర్చు చేయాల్సి వస్తోంది. 2015లో ప్రతి లక్ష జనాభాకు కొత్త టిబి కేసుల సంఖ్య 237 ఉండగా, ఇప్పుడు 187కి తగ్గిందని, మరణాలు ప్రతి లక్ష జనాభాకు 28 నుంచి 21కి తగ్గాయని చెబుతోంది. కేంద్ర బడ్జెట్‌లో ఈ మహమ్మారిని ఎదుర్కొనేందుకు కేటాయిస్తున్న నిధులకూ, ఆ తరువాత వినియోగిస్తున్న వాటికీ మధ్య హస్తిమసికాంతరం ఉంటోంది. 2023-24 కేంద్ర బడ్జెట్‌లో రూ.31 వేల కోట్లు కేటాయిస్తే వినియోగించింది రూ.8 వేల కోట్లే. యుఎస్ ఎయిడ్ 2024-25లో నిలిచిపోయింది. ప్రపంచబ్యాంకు నిధులు రుణంగానే అందుతున్నాయి. క్షయ నియంత్రణకు ప్రపంచవ్యాప్తంగా 22 బిలియన్ డాలర్లు అవసరం కాగా, అందుబాట్లో ఉన్నవి 5.9 బిలియన్ డాలర్లే. అంటే లక్ష్యంలో 27 శాతమే. ఈ పరిస్థితుల్లో టిబి నియంత్రణకు ఇతోధికంగా తోడ్పాటునందించాల్సిన కేంద్రం.. వాస్తవాలను విస్మరించి టిబిని నియంత్రిస్తున్నామంటూ ప్రచారం చేసుకోవడం తగని పని.

ప్రపంచం నుంచి టిబిని 2030 నాటికి తరిమివేయాలని ఐక్యరాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు నిర్దేశించగా, 2025 నాటికే తరిమివేస్తామని మన పాలకులు గతంలో ప్రకటించారు. కొత్తగా టిబి కేసుల నమోదులో బిజెపి, ఎన్‌డిఎ నేతృత్వంలోని ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, మధ్యప్రదేశ్, ఢిల్లీ తొలి ఐదుస్థానాల్లో ఉన్నాయి. అందుకు భిన్నంగా మహమ్మారిని తరిమికొట్టిన రాష్ట్రాల్లో కేరళ అగ్రస్థానంలో నిలవగా, ఆ తరువాత స్థానంలో తమిళనాడు నిలిచింది. అత్యధిక సంఖ్యలో అధునాతన ఎన్‌ఎఎటి టిబి పరీక్షలు నిర్వహించినందుకు 2022 నుంచి ఈ ఏడాది వరకూ వరుసగా జాతీయ అవార్డులను పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం సొంతం చేసుకోవడం... క్షయ నియంత్రణలో కేరళ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం.

మనదేశంలో మూడొంతుల జనాభా నేటికీ పేదరికంలో మగ్గిపోతున్నారు. ఐదేళ్లలోపు పిల్లల్లో 37 శాతం మంది పౌష్టికాహార లోపంతో ఉన్నవారే. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు, చిన్నారులు పోషకాహారం అందకపోవడంతో క్షయ లాంటి వ్యాధుల చికిత్సలో వినియోగించే మందుల ప్రభావాన్ని తట్టుకోలేక ప్రాణాలు కోల్పోతున్నారు. పెరిగిపోతున్న కాలుష్యం, డయాబెటిస్, పొగతాగడం, మద్యం సేవించడం, హెచ్‌ఐవి, క్షయ మందులు మధ్యలో మానివేయడం ఇవన్నీ క్షయ విజృంభణకు ఆజ్యం పోస్తున్నాయి. కోవిడ్ సమయంలో గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అండగా ఉన్న ఉపాధిహామీకి కేంద్రం నిధులు తెగ్గోస్తోంది. 2020-21లో 1,09,000 కోట్లుగా ఉన్న ఉపాధి హామీ నిధులు 2025-26లో 86 వేల కోట్లకే పరిమితమయ్యాయి. తీవ్ర పేదరికాన్ని తరిమికొట్టి.. సామాన్యుల సంక్షేమమే లక్ష్యంగా కృషి చేస్తున్న కేరళలోని ఎల్‌డిఎఫ్ మోడల్ దేశవ్యాప్తంగా అమలు చేసినప్పుడే క్షయ లాంటి మహమ్మారుల పీచమణచడం, దేశ ప్రజల సర్వతోముఖాభివృద్ధి సాధ్యం.

మహనీయుల మాట



భూమిని పంచడమంటే...
అధికారాన్ని పంచడమే.
- ఎస్.ఆర్. శంకరన్,
మాజీ ఐ.ఎ.ఎస్ అధికారి.

రాష్ట్ర వనరులను కొల్లగొట్టే పెట్టుబడుల సమ్మిట్ !

విశ్లేషణ



డా॥ బి. గంగారావు



పెట్టుబడిదారులను ప్రసన్నం చేసుకోడానికి ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అన్నీ ఇన్నీ కాదు. ఏకంగా రాష్ట్రంలో పెట్టుబడిదారులకు పోలీస్ ఎస్కార్టులతో రక్షణ కల్పిస్తామన్నారు. కార్మిక చట్టాలన్నీ మార్చేశామన్నారు. పెట్టుబడులకు ఆటంకంగా ఉండే విధానాలన్నింటినీ సరళతరం చేస్తున్నట్లు ప్రకటించారు. విదేశీ, స్వదేశీ పారిశ్రామికవేత్తలే రాష్ట్రాభివృద్ధికి శరణ్యమని, వీరు లేకపోతే రాష్ట్ర అభివృద్ధే ఉండదనే విధంగా వ్యవహరించారు. అంతేగాక సమాజంలో వీరిని ప్రత్యేక ఆరాధ్యులు, కరుణామయులు అనే భావనను ప్రజల్లో చిత్రీకరించటానికి ప్రయత్నం చేశారు. ఈ భావజాలంలోనే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను, అందులో పని చేసే కార్మికులను చంద్రబాబు అత్యంత దారుణంగా తూలనాడారు.

రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్నంలో ఈ నెల 14,15 తేదీలలో సిఐఐ భాగస్వామ్య సమ్మిట్‌ను ఎంతో ఆర్భాటంగా నిర్వహించింది. ఊహించిన దానికంటే 30 శాతం అదనంగా పెట్టుబడుల ఒప్పందాలు జరిగాయని, దీంతో ప్రపంచ వాణిజ్యానికి విశాఖ 'గేట్ వే' గా మారిందని ముఖ్యమంత్రి కితాబిచ్చారు. అంతేగాక ఈ ఐదేళ్లలో 50 లక్షల కోట్లు పెట్టుబడుల లక్ష్యంగా పెట్టుకున్నామని, దీని ద్వారా దేశంలో భారీ స్థూల ఉత్పత్తి (ఎస్ జిడిపి) కలిగిన మొదటి ర్యాంక్ రాష్ట్రంగా మారుతుందని ప్రకటించారు.

సమ్మిట్ కోసం చేసిన హడావుడి, ప్రచార ఆర్భాటం అంతా ఇంతా కాదు. మొత్తం రెండు రోజుల సమ్మిట్‌కు రూ.500 కోట్లు పైనే ఖర్చు చేశారు.

ఇక పెట్టుబడిదారులను ప్రసన్నం చేసుకోడానికి ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అన్నీ ఇన్నీ కాదు. ఏకంగా రాష్ట్రంలో పెట్టుబడి దారులకు పోలీస్ ఎస్కార్టులతో రక్షణ కల్పిస్తామ న్నారు. కార్మిక చట్టాలన్నీ మార్చేశామన్నారు. పెట్టుబడులకు ఆటంకంగా ఉండే విధానాల న్నింటినీ సరళతరం చేస్తున్నట్లు ప్రకటించారు. విదేశీ, స్వదేశీ పారిశ్రామికవేత్తలే రాష్ట్రాభివృద్ధికి శరణ్యమని, వీరు లేకపోతే రాష్ట్ర అభివృద్ధే ఉండదనే విధంగా వ్యవహరించారు. అంతేగాక సమాజంలో వీరిని ప్రత్యేక ఆరాధ్యులు, కరుణామయులు అనే భావనను ప్రజల్లో చిత్రీకరించటానికి ప్రయత్నం చేశారు. ఈ భావజాలంలోనే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను, అందులో పని చేసే కార్మికులను చంద్రబాబు అత్యంత దారుణంగా తూలనాడారు. స్టీల్‌ప్లాంట్ తెల్ల ఏనుగుగా మారిందని, కార్మికులు పని చేయకుండా ఇంట్లో నిద్రపోతూ జీతాలు ఇవ్వమని అడుగుతున్నారని అబద్ధ ప్రచారానికి పూనుకున్నారంటే తెలుగుదేశం కూటమి ప్రభుత్వ నాయకులు ఏ స్థాయిలో పెట్టుబడిదారులతో పెనవేసుకుపోయారో అర్థం చేసుకోవచ్చు.

మొత్తం 613 భాగస్వామ్య ఒప్పందాలు కుదిరాయని వీటి ద్వారా రూ.13.25 లక్షల కోట్లు పెట్టుబడులు వస్తాయని, 16.31 లక్షల మందికి ఉపాధి కల్పన జరుగుతుందని ముఖ్యమంత్రి ప్రకటించారు. మొత్తం పెట్టుబడిలో ఎనర్జీ రంగానికి 40.22 శాతం, పరిశ్రమలకి 21.13 శాతం, మౌలిక వసతులకు 15.16 శాతం, ఐ.టి, ఎలక్ట్రానిక్స్‌కు 11.32 శాతం పెట్టుబడుల ఒప్పందాలు జరిగాయి. మొత్తం పెట్టుబడులలో 87.83 శాతం పెట్టుబడులు, మొత్తం ఉపాధిలో 85.13 శాతం ఈ నాలుగు రంగాలలో వస్తుందని తెలిపారు. మిగిలిన 12 శాతం పెట్టుబడులు పర్యాటకం, ఆహార తయారీ, పట్టణ అభివృద్ధి, టెక్స్‌టైల్, విద్యా, వైద్య రంగాలలో వాగ్దానం చేశారు.

రాష్ట్ర విభజన తరువాత ఐదు సార్లు పెట్టుబడుల సమ్మిట్‌లు జరిగాయి. 2014-19 మధ్య చంద్రబాబు నాయుడు మూడు సమ్మిట్లు నిర్వహించగా, ఆ తరువాత వచ్చిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం 2023లో ఒక సమ్మిట్ నిర్వహించింది. ఇప్పుడు తెలుగుదేశం కూటమి ప్రభుత్వం నిర్వహించింది ఐదో సమ్మిట్. గత 4 పెట్టుబడుల సమ్మిట్లలో మొత్తం 1860 ఒప్పందాలు జరిగాయి. రూ.26.20 లక్షల కోట్లు పెట్టుబడులు పెడతారని, వీటి ద్వారా 41.56 లక్షల ఉద్యోగాలు కల్పిస్తారని ఆ ఒప్పందాల్లో పేర్కొన్నారు. కానీ గడిచిన పదేళ్లలో ఈ ఒప్పందాల్లో ఎన్ని పెట్టుబడులు, ఉద్యోగాలు వచ్చాయి? ప్రభుత్వ లెక్కలు చూస్తే ఈ పెట్టుబడుల సమ్మిట్ల బాగోతం అర్థం చేసుకోవచ్చు.

ఇప్పటి వరకు మన రాష్ట్రం లేదా ఇతర రాష్ట్రాల అనుభవం చూసినా ఈ పెట్టుబడుల సమ్మిట్లలో కుదుర్చుకున్న పెట్టుబడుల ఒప్పందాల్లో కేవలం 10 నుండి 15 శాతానికి మించి ఆచరణలోకి రావడం లేదు. దేశంలోని అన్ని రాష్ట్రాల పాలకులు కూడా పెట్టుబడుల సమ్మిట్లు నిర్వహిస్తారు. దేశదేశాలు తిరుగుతారు. పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థల అధిపతులను కలిసి ఆ రాష్ట్రాల్లో పెట్టుబడులు పెట్టమని ఆహ్వానిస్తారు. కనుక ఎక్కువ భాగం ఈ సంస్థలే సర్కస్ కంపెనీల్లా హాజరౌతాయి.

ఈ ఏడాదిలోనే ఇటీవల మధ్యప్రదేశ్, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, అస్సాం, ఒరిస్సా, రాజస్థాన్ రాష్ట్రాలు పెట్టుబడుల సమ్మిట్లు నిర్వహించాయి. ఒక్క మధ్యప్రదేశ్ రాష్ట్రంలో నిర్వహించిన సమ్మిట్‌లో రూ.30.77 లక్షల కోట్లు పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయి. ఆ రాష్ట్ర స్థూల ఉత్పత్తి (ఎస్ జిడిపి) కంటే ఈ పెట్టుబడులు రెండున్నర రెట్లు ఎక్కువ. మొత్తం ఈ ఆరు రాష్ట్రాల్లో రూ.60.23 లక్షల కోట్లు విలువ గల పెట్టుబడుల ఒప్పందాలు జరిగాయి. అలాగే ఆంధ్ర ప్రదేశ్‌లో కూడా రాష్ట్ర జిడిపి కి సమానంగా భారీగా ఒప్పందాలు చేశారు.

వాస్తవంగా వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న పెట్టుబడుల సమ్మిట్ ఒప్పందాలు ఎన్ని ఆచరణలోకి వచ్చాయి? ఎంత పెట్టుబడి వచ్చింది? ఎన్ని ఉద్యోగాలు వచ్చాయి? అనే వాటిపై సవివరమైన వార్షిక నివేదికలు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించదు. కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) లేదా రాష్ట్ర శాసనసభ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పి.ఎ.సి)ల చేత ఆడిట్ కూడా ఉండదు. చేసుకున్న ఒప్పందాల అమలుకు సంస్థలు చట్టబద్ధంగా కట్టుబడి ఉండవు. ఒప్పందాలు అమలు చేయని సంస్థలపై ప్రభుత్వ చర్యలు ఉండవు. ఆ సంస్థల వివరాలు కూడా ప్రకటించరు.

మొత్తం ఒప్పందాల్లో 40 శాతం పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులైనా సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్ వంటి వాటిల్లో పెట్టనున్నాయి. ఈ రంగంలో ప్రైవేట్ సంస్థలు తక్కువ పెట్టుబడితో విపరీతమైన లాభాలు సంపాదిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఎక్కువ ధరకు ఈ సంస్థలతో విద్యుత్ కొనుగోళ్ళ ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాయి. గతంలో వైసిపి ప్రభుత్వం కేంద్ర బిజెపి కి లొంగిపోయి అదానీ నుండి సోలార్ విద్యుత్‌ను ఎక్కువ ధరకు 25 ఏళ్లపాటు కొనుగోలు ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తెలుగుదేశం ఈ ఒప్పందాన్ని తీవ్రంగా వ్యతిరేకించి అధికారంలోకి వచ్చిన తరువాత ఆ ఒప్పందాన్నే అమలు చేస్తున్నది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం 2030 నాటికి 500 గిగావాట్ల (ఒక గిగావాట్ అంటే 1000 మెగావాట్లు) స్థాపిత పునరుత్పాదక విద్యుత్‌ను సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా 160 గిగావాట్లను, 10 లక్షల కోట్ల పెట్టుబడులను 2030కి సాధించాలని నిర్ణయించుకుంది. ఈ రంగంలో పెట్టుబడి పెట్టేవారికి ప్రభుత్వం భారీ రాయితీలిస్తున్నది. పెట్టిన పెట్టుబడిలో 25 శాతం పెట్టుబడి రాయితీగా చెల్లిస్తున్నది. రాష్ట్ర జిఎస్టీ పదేళ్ళ చెల్లించాల్సిన అవసరం లేదు. ట్రాన్స్‌మిషన్, వీలింగ్ చార్జీలు ప్రభుత్వమే చెల్లిస్తుంది. ఎంత భూమి కావాలంటే అంత భూమి చౌకగా ఇస్తుంది. ఇలా ప్రైవేట్ సంస్థ పెట్టే మొత్తం పెట్టుబడిని తిరిగి రాష్ట్ర ప్రభుత్వం వివిధ రాయితీలు రూపంలో చెల్లిస్తుంది. పైపెచ్చు కేంద్ర ప్రభుత్వం తీసుకు రాబోతున్న నూతన విద్యుత్ బిల్లు ఈ సంస్థలకు లాభాల పంట పండిస్తోంది. విద్యుత్ రంగాన్ని, డిస్కమ్‌లను ప్రైవేటీకరించి విద్యుత్ పంపిణీ వ్యవస్థను ప్రైవేట్‌పరం చేయబోతున్నారు. దీంతో రాష్ట్రంలో ఈ రంగంలో బడా సంస్థలు భారీగా పెట్టుబడులు పెట్టటానికి ముందుకొస్తున్నాయి.

వాస్తవంగా ఎ.పి లో విద్యుత్ కొరత లేదు. ప్రస్తుతం 20 గిగావాట్ల విద్యుత్ స్థాపిత శక్తి ఉంది. ఇందులో 30 శాతం అనగా 9.6 గిగావాట్లు పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల నుండి వస్తుంది. ఈ నేపథ్యంలో 160 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ అవసరమేమిటి? ఎవరి ప్రయోజనం కోసమో అర్థంచేసుకోవచ్చు. అలాగే ఈ సంస్థల కోసం వేలకొలది వ్యవసాయ భూములను రైతుల నుండి బలవంతంగా సేకరిస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి కర్నూలు, అనంతపురం, కడప జిల్లాల్లో లక్షల ఎకరాల భూమిని అనేక సంస్థలకు ధారాదత్తం చేశారు. నెల్లూరు జిల్లాలో వేలాది ఎకరాల భూసేకరణకు పాల్పడుతున్నారు. పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ఉత్పత్తి సంస్థల కోసం ఉత్తరాంధ్రాలో వేలకొలది ఎకరాల భూసేకరణకు ప్రయత్నం చేస్తున్నారు. ఆదివాసుల ప్రత్యేక చట్టాలను కూడా ధిక్కరించి బలవంతపు చర్యలకు పాల్పడుతున్నారు. ఉపాధి అవకాశాలు చూస్తే ఈ రంగంలో చాలా నామమాత్రం. అది కూడా స్థానికులకు ఇవ్వడం లేదు. ఫలితంగా ప్రజలు వలసలు వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

సమ్మిట్‌లో 193 పరిశ్రమలలో రూ.2.80 లక్షల కోట్ల పెట్టుబడికి, 5.19 లక్షల ఉద్యోగాల కల్పనకు ఒప్పందాలు జరిగాయి. వీటిల్లో ఎక్కువ భాగం రాష్ట్రంలో ఉన్న అపారమైన ఖనిజ వనరులను ఉపయోగించుకొని లాభపడటానికి వచ్చేవి కొన్నయితే, మరి కొన్ని పర్యావరణాన్ని విధ్వంసం చేసే కాలుష్య కారక రసాయన పరిశ్రమలు ఉన్నాయి. వీటన్నిటికి రాష్ట్రం అడ్డాగా మారింది. పర్యాటక రంగంలో భారీగా ఒప్పందాలు జరిగాయి. సముద్ర తీర ప్రాంతం ఎక్కువ భాగం ఈ సంస్థల పరం కాబోతున్నది. ఇలా అన్ని రంగాల్లో పెట్టుబడుల ఒప్పందాల పరిస్థితి ఇదే. పరిశ్రమ వచ్చినా రాకపోయినా భూములు, ఇతర వనరులు పెద్ద ఎత్తున పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళ్లనున్నాయి.


ఇక ఉపాధి కల్పన అనేది అంతా ఒక మాయాజాలం. నిరుద్యోగాన్ని అడ్డం పెట్టుకొని వనరులను లూటీ చేస్తున్నారు. మొత్తం 16.31 లక్షల ఉద్యోగాలు వస్తాయని ప్రకటించారు. ఇందులో ఒక్క జి.ఎం.ఆర్ సంస్థే విమానయాన మౌలిక సదుపాయాల రంగంలో రూ.20 వేల కోట్లు పెట్టుబడి పెట్టి లక్షా 80 వేల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చింది. దీనినిబట్టి ఉపాధి కల్పన హామీలు ఎంత మోసకారితనంగా ఉన్నాయో తెలుస్తుంది. రాష్ట్ర విభజన అంతరం పదేళ్లలో వచ్చిన ఉపాధి కేవలం 2.54 లక్షలు కాగా పెట్టిన పెట్టుబడి రూ.1.4 లక్షల కోట్లు మాత్రమేనని ప్రభుత్వ గణాంకాలే తెలియజేస్తున్నాయి. వస్తున్న ఉపాధి కూడా అతి తక్కువ వేతనాలతో కూడిన అస్థిరమైనది. పైగా అంతులేని శ్రమ దోపిడీ. కార్మిక చట్టాలకు తావేలేదు.

మొత్తంగా చూస్తే పెట్టుబడుల సమ్మిట్ పేర రాష్ట్రంలో ఉన్న అపారమైన వనరులను కొల్లగొడుతున్నారు. క్వాంటమ్ వ్యాలీ, డేటా సెంటర్, స్పేస్ సిటీ, గ్రీన్ హైడ్రోజన్ హబ్, డ్రోన్ సిటీ, సైబర్ సిటీ, ఐ.టి-ఎ.ఐ హబ్ ఇలా రకరకాల ఆకర్షణీయమైన పేర్ల ముసుగులో ఈ దోపిడీ సాగిస్తున్నారు. బాగా వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ, ఆదివాసీ గిరిజన ప్రాంతం, సముద్రతీరం వీరి దోపిడీకి కేంద్రాలుగా మారాయి. ఉద్యోగ కల్పన కన్నా యువతను బానిస శ్రమ దోపిడీ వ్యవస్థలోకి దించనున్నారు. ఆర్థిక అసమానతలు, వలసలు పెరుగుతాయి. రాష్ట్ర సంపద కొద్ది మంది సంపన్నుల చేతుల్లో మరింత కేంద్రీకరణకు దారితీస్తుంది. కనుక ఈ దోపిడీ విధానాలను ప్రతిఘటించడమే రాష్ట్ర ప్రజల ముందున్న కర్తవ్యం.


/ వ్యాసకర్త సెల్ : 9490098792 /

కార్మికులపై అంత అక్కసేల?

విమర్శ



సి.హెచ్.నరసింగరావు



దేశంలో అన్ని స్టీల్‌ప్లాంట్ల కోసం సొంత గనులున్నా విశాఖ స్టీల్‌కు స్వంత గనులు ఎందుకు లేవు? గత 30 సంవత్సరాల నుంచి కార్మిక వర్గం దీనిపై పోరాడుతున్నది. 2009 ఫిబ్రవరి 19న ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర గనుల కోసం జరిగిన ధర్నాకు చంద్రబాబు స్వయంగా వచ్చి పాల్గొన్నారు. విశాఖ స్టీలు ఏకైక సమస్య స్వంత గనులు లేకపోవడం. కేంద్రాన్ని ఈ విషయం అడగడానికి చంద్రబాబు నోరు మూగబోయింది. కానీ అశేష త్యాగాలు చేస్తున్న కార్మిక వర్గంపై దుమ్మెత్తిపోస్తున్నారు. కార్మికులను ఘోరంగా అవమానిస్తున్నారు. బోనులో ముద్దాయిలుగా చిత్రిస్తున్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను చంద్రబాబు తెల్ల ఏనుగుతో పోల్చారు. కార్మికులు ఇళ్లల్లో పడుకొని జీతాలు తీసుకుంటున్నారని, అన్ని స్టీల్ ప్లాంట్లకు లాభాలు వస్తుంటే విశాఖ స్టీల్‌కు నష్టాలు ఎందుకు వస్తున్నాయని కార్మికులను బలిపశువులు చేశారు. విశాఖ స్టీల్ పోరాటాలు చేసే వారిపైన, సమర్థించే వారిపైన నిర్బంధం ప్రయోగిస్తామని హెచ్చరించారు. ప్యాకేజీ పేరు చెప్పి నిందలు వేశారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్ ఎలా తెల్ల ఏనుగో చంద్రబాబు రుజువు చేయాలి. విశాఖ స్టీల్ దేశంలోనే నెంబర్ వన్ స్టీల్‌ప్లాంట్‌గా నైపుణ్యతలో స్టీల్ మార్కెట్‌లో అగ్ర భాగాన ఉంది. వందల అవార్డులు పొందింది. 2009లో కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్‌ను నవరత్న కంపెనీగా గుర్తించింది. విశాఖ స్టీల్ పుట్టినప్పటి నుంచి కేంద్ర ప్రభుత్వం వెచ్చించిన పెట్టుబడి అంతా రూ.5 వేల కోట్ల లోపుగానే ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నులు, డివిడెంట్లు కలిపి రూ.58 వేల కోట్లు విశాఖ స్టీల్ చెల్లించింది. సముద్ర తీరాన 20 వేల ఎకరాల భూమి రూ.2 లక్షల కోట్ల విలువ చేస్తుంది. స్వంత టౌన్‌షిప్, అన్ని విభాగాల్లో ఆధునిక యంత్రాలున్నాయి. స్వంత థర్మల్ ప్లాంట్లు-2, ఆక్సిజన్ ప్లాంట్లు ఉన్నాయి. విశాఖ స్టీల్‌ప్లాంట్ సుమారు రూ.4 లక్షల కోట్లు విలువ చేస్తుంది. ఇది దేశ సంపద. దీన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టాలనే బిజెపి కుట్రకు టిడిపి, జనసేనలు నేడు వంత పాడుతున్నాయి. అదానీ గూగుల్ సెంటర్‌కు రూ.22 వేల కోట్లు రాయితీలివ్వడం, రుషికొండలో టిసిఎస్‌కు ఎకరా 99 పైసలకు, లూలూ మాల్‌కు వందల కోట్లు ప్రజాధనాన్ని ధారపోయడాన్ని చంద్రబాబు గొప్పగా చెప్పుకుంటున్నారు. ఇది దేశ సంపదను లూటింగ్ చేయడం కాదా? కాని విశాఖ స్టీల్‌కు ఇచ్చిన ప్యాకేజి స్టీల్‌ప్లాంట్ నడపడానికి కాదు. విశాఖ స్టీల్‌ను కొనే కార్పొరేట్ కంపెనీకి అప్పుల భారం లేకుండా చేయడానికే.

విశాఖ స్టీల్‌కు నష్టాలు వస్తున్నాయని చంద్రబాబు గుండెలు బాదుకొంటున్నారు. దేశంలో అన్ని స్టీల్‌ప్లాంట్ల కోసం సొంత గనులున్నా విశాఖ స్టీల్‌కు స్వంత గనులు ఎందుకు లేవు? గత 30 సంవత్సరాల నుంచి కార్మిక వర్గం దీనిపై పోరాడుతున్నది. 2009 ఫిబ్రవరి 19న ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర గనుల కోసం జరిగిన ధర్నాకు చంద్రబాబు స్వయంగా వచ్చి పాల్గొన్నారు. విశాఖ స్టీలు ఏకైక సమస్య స్వంత గనులు లేకపోవడం. కేంద్రాన్ని ఈ విషయం అడగడానికి చంద్రబాబు నోరు మూగబోయింది. కానీ అశేష త్యాగాలు చేస్తున్న కార్మిక వర్గంపై దుమ్మెత్తిపోస్తున్నారు. కార్మికులను ఘోరంగా అవమానిస్తు న్నారు. బోనులో ముద్దాయిలుగా చిత్రిస్తున్నారు. దేశంలోనే "సెయిల్"లో తలసరి స్టీల్ ఉత్పత్తి సాలీనా 625 టన్నులు. విశాఖ స్టీల్‌లో 785 టన్నులు. విశాఖ స్టీల్ కార్మికులు ఇళ్లల్లో పడుకొని పని చేయకపోతే ప్రతి సంవత్సరం 50-60 లక్షల టన్నుల ఉత్పత్తి ఎవరు చేస్తున్నారు? గత ఒక్క సంవత్సరంలో 10 వేల మంది పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులను తొలగించారు. 8 సంవత్సరాల నుంచి రిక్రూట్‌మెంట్ లేదు. ముగ్గురు పనిని ఒక కార్మికుడు చేస్తున్నాడు. ప్రాణాలను పణంగా పెట్టి కార్మికులు శ్రమిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్‌లో 32 లక్షల టన్నులకే పెట్టుబడి పెట్టింది. కార్మికులు చెమటోడ్చి వచ్చిన లాభాలతో సాలీనా 73 లక్షల టన్నుల సామర్థ్యానికి విశాఖ స్టీల్ ఎగబాకడానికి కార్మికులే మూలం. కార్మికులను ప్రోత్సహించవలసిన ముఖ్యమంత్రి కార్మికులను నిరుత్సాహపర్చి పొగపెట్టి వారిని బయటకు నెడుతున్నారు.

విశాఖ స్టీల్‌కు నష్టాలు రావడానికి కేంద్ర ప్రభుత్వ విధానాలే ప్రధానం. స్వంత గనులు లేకున్నా 2021-22 సంవత్సరంలో కూడా రూ.928 కోట్లు నికర లాభాలార్జించింది. బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నూరు శాతం వాటాలు అమ్మాలని నిర్ణయించినప్పటి నుంచి ముడి ఖనిజం దిగుమతులు చేయకుండా ఉత్పత్తిని ఆపింది. 3 బ్లాస్ట్ ఫర్నేస్‌లలో రెండిట్లో 2 సంవత్సరాలు పైగా ఉత్పత్తిని నిలిపివేసింది. నాసిరకం ముడి ఖనిజం తెప్పించి నాణ్యతను దెబ్బతీస్తున్నది. క్వాలిటీ ఇన్‌స్పెక్షన్ ఎత్తివేసింది. ఇన్‌చార్జి సి.ఎం.డి, విశాఖ స్టీల్ డైరెక్టర్లు సగం మంది, ఇ.డి లు పూర్తిగా లేకుండా స్టీల్‌ప్లాంట్ నడుపుతున్నారు. 30 సంవత్సరాల నుంచి పని చేస్తున్న కార్మికులను బలవంతంగా తొలగిస్తున్నారు. విశాఖ స్టీల్‌ను 46 విభాగాలుగా చేసి కొత్త కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్నారు. కార్పొరేట్ కంపెనీకి అప్పగించడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. దీన్ని అడ్డుకున్న కార్మికులు, యూనియన్లపై చంద్రబాబు కావాలనే అభాండాలు వేస్తున్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రెస్‌మీట్‌లో ఒక విలేకరి విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్ కాదని ప్రకటిస్తారా? అని అడిగినందుకు ఆ విలేకరిపై చంద్రబాబు విరుచుకుపడ్డారు. "బుద్ధుండాలి. తమాషానా?" అని గద్దించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కావాలని కొందరు పనిగట్టుకొని కలెబెడుతున్నారని, వారి సంగతి చూస్తానని బెదిరింపు ధోరణికి దిగారు. ఈ సందర్భంగా చంద్రబాబు విశాఖ స్టీల్‌పై విషాన్ని కక్కారు. పచ్చి అవాస్తవాలు పలికారు. ఆయన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను విమర్శించడం, బిజెపి వాదనలను బలపర్చడమే ధ్యేయంగా మాట్లాడారు. 2024 పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల వరకూ చెప్పినవన్నీ నేడు నీటి మూటలయ్యాయి. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర బిజెపి ప్రభుత్వం 2001 జనవరి 27న నూరు శాతం ప్రైవేట్ చేస్తామని ప్రకటించింది. లాభనష్టాలతో నిమిత్తం లేకుండా అన్ని కేంద్ర ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేట్ చేయడమే బిజెపి విధానం. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడతామని ఎన్నికల వరకూ చంద్రబాబు పలుసార్లు నొక్కి ఒక్కాణించారు. మా పోరాటాన్ని సంపూర్ణంగా బలపరుస్తూ 2021 జులై 23న విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీకి స్వయంగా లేఖ రాశారు. ఎన్నికల అనంతరం బిజెపిని విశాఖ స్టీల్‌కు స్వంత గనుల కోసం ఒత్తిడి చేయడం మాని ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ కంపెనీకి స్వంత గనులు ఇవ్వాలని మోడీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గత ఆరు మాసాల నుంచి చంద్రబాబు, ఆయన అనుయాయులు పోరాటాన్ని అణచాలని, నీరుగార్చాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. నాలుగున్నర సంవత్సరాల నుంచి విశాఖ స్టీల్‌ప్లాంట్ గేట్ దగ్గర ఉన్న నిరాహారదీక్ష టెంట్ పీకివేయించారు. కార్మికులపై ఎమర్జెన్సీ విధించారు. కేంద్ర బిజెపి ప్రభుత్వంపై ఒత్తిడి చేయలేక కార్మికులపై అభాండాలు వేస్తున్నారు. ఈ ప్రకటనలకు పరాకాష్ట ప్రెస్‌మీట్‌లో విశాఖ స్టీల్‌పై చంద్రబాబు చేసిన విమర్శలు.

విశాఖ స్టీల్ తెలుగు ప్రజల ఆత్మగౌరవం. 32 మంది ప్రాణ బలిదానంతో ఏర్పడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లకు అమ్ముడుపోవడంతో విశాఖ స్టీల్‌ను కాపాడుకోవడం తెలుగు ప్రజల నేటి కర్తవ్యం.

/వ్యాసకర్త 'విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ' చైర్మన్/

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @gmail.com

మెతుకుకై పోరాటం...!

కవిత్వం

ఆరిపోయిన బతుకుల కోసం
జల్లెడ పడుతూ కూర్చున్నావా
విరిగిపోయిన ఆశల జీవితాన్ని
తిరిగి అతికించే పనిలో పడ్డావా
గొయ్యి అంచు వరకూ వెళ్ళామని
బాధగా నిట్టూర్చే పని చేయవద్దు

గాలికి పోయిన గుడ్డ ముక్క
ఏ కొమ్మకో తగులుకుని జీవిస్తుంది
నమ్మకాలన్నీ శూలాలై తిరగబడితే
తప్పించుకునే విద్య మాకాడ లేదు
అవసరానికి వచ్చి బాగా వాడుకో
ముద్దర కాలం అయిపోగానే మర్చిపో

ఇక ఆఖరి మెతుకు మా కోసం
అడుగంటిన కుండలో దాక్కుంది
వెతుకులాట మాకు కొత్తేమీ కాదు
గింజులాట మాకు వింతేమీ కాదు
ఆ మెతుకుతోనే కాలం గడపాలి
ఆ మెతుకు కోసమే పోరాడాలి
అందరం బాగున్నామని రాతలు
కడుపు కోతలు చూడని గీతలు

విధి రాతలో లోతును చూసినాం
తల రాతలో అర్థాన్ని వెతికినాం
బతుకు గీతపై ఒంటరిగా కదిలినాం
అతుకుల జీవనానికి కుట్లేసినాం
మా రాతకు తగ్గట్టుగా జీవిస్తున్నాం

ఆశల దీపం ఆరిపోయినాక
జీవన సంద్రంలో కెరటాలై ఎగసినాం
పడుతూ లేస్తూ తిరిగి సంద్రంలోకి
మెల్లగా జారుకుంటున్నాం
ఇక ఆఖరి మెతుకులదే రాజ్యం
ప్రాణం నిలిపిన, తీసిన వాటికే అంకితం.

- నరెద్దుల రాజారెడ్డి
సెల్ : 9666016636

హసీనాకు మరణశిక్షను నిరసిస్తూ

బంగ్లాదేశ్‌లో ఆందోళనలు

● ఇద్దరు మృతి

ఢాకా : బంగ్లాదేశ్‌లో మళ్లీ ఆందోళనలు ప్రారంభమయ్యాయి. మాజీ ప్రధాని షేక్ హసీనాకు స్థానిక 'అంతర్జాతీయ నేర ట్రిబ్యునల్' మరణశిక్ష విధించడాన్ని నిరసిస్తూ హసీనా మద్దతుదారులు బంగ్లాదేశ్ అంతటా నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఈ అల్లర్లలో ఇద్దరు మరణించగా, పలువురు గాయపడ్డారు. రాజధాని ఢాకా సహా దేశంలోని పలు ప్రాంతాల్లో ఆందోళనలు జరిగాయి. దేశవ్యాప్తంగా రెండు రోజులపాటు బంద్ ప్రకటిస్తున్నట్లు అవామీ లీగ్ ప్రకటించింది. దీంతో యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం ఆయా ప్రాంతాల్లో పోలీసులను మోహరించింది. షేక్ హసీనా తండ్రి ముజిబుర్ రెహమాన్ ఇల్లు ఉన్న ధన్మొండి సహా పలు ప్రాంతాల్లో హసీనా మద్దతుదారులు రహదారులను దిగ్బంధించి, ఇతర నివాసాలను, దుకాణాల పైకి రాళ్లు రువ్వడంతో వారిని చెదరగొట్టడానికి పోలీసులు సౌండ్ గ్రెనేడ్లు, టియర్ గ్యాస్‌ను ఉపయోగించాల్సి వచ్చిందని అధికారులు పేర్కొన్నారు. పోలీసులు నిరసనకారులపై లాఠీఛార్జి చేయడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.



హసీనాకు మద్దతుగా ఢాకాలో ఆందోళన చేస్తున్న ఆమె మద్దతుదారులు

79మంది బంగ్లాదేశ్ మత్స్యకారుల అరెస్ట్

న్యూఢిల్లీ : భారత తీర రక్షక దళం (ఐసిజి) మంగళవారం 79 మంది సిబ్బంది సహా మూడు బంగ్లాదేశ్ ఫిషింగ్ బోట్లను స్వాధీనం చేసుకుంది. ఉత్తర బంగాళాఖాతంలో భారతదేశ ఎక్స్‌క్లూజివ్ ఎకనామిక్ జోన్ (ఇఇజెడ్) లోపల అక్రమంగా చేపలు పడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 15, 16 తేదీల మధ్య అంతర్జాతీయ సముద్ర సరిహద్దు రేఖ (ఐఎంబిఎల్) వెంబడి నిఘా నిర్వహిస్తుండగా వారు పట్టుబడ్డారు. ఐసిజి అందించిన వివరాల ప్రకారం.. గస్తీ బృందాలు భారత జలాల్లో బోట్లను గుర్తించాయని, ఇవి భారతదేశ సముద్ర మండలాలు (విదేశీ నౌకల ద్వారా చేపలు పట్టడం నియంత్రణ) చట్టం, 1981ని ఉల్లంఘించాయి. బోట్లను అడ్డగించి తనిఖీ చేయగా, సిబ్బంది చెల్లుబాటు అయ్యే పత్రాలు చూపలేకపోయారు. మూడు బోట్లను, సిబ్బందిని ఫ్రేజర్ గంజ్‌కు తరలించి, తదుపరి చర్యల కోసం మెరైన్ పోలీసులకు అప్పగించారు.

కాశ్మీరీ ముస్లిములందరినీ అనుమానించొద్దు

● సిఎం ఒమర్ అబ్దుల్లా




శ్రీనగర్ : ప్రతి కాశ్మీరీ ముస్లిమునూ అనుమానించవద్దని జమ్ముకాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ 'పేలుళ్ల' కేసులో, వైట్ కాలర్ ఉగ్రవాదానికి పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని కోరారు. అదే సమయంలో అమాయకులైన ప్రజలను హాని కలిగించకూడదని పేర్కొన్నారు. గత శుక్రవారం నౌగామ్ పోలీస్‌స్టేషన్‌లో ప్రమాదవశాత్తు జరిగిన పేలుడులో గాయపడిన వారిని చేర్పించిన శ్రీనగర్ ఆస్పత్రిని మంగళవారం ఆయన సందర్శించి, బాధితులను పరామర్శించారు. అనంతరం ఆస్పత్రి వెలుపల మీడియాతో మాట్లాడారు. ఈ అంశాన్ని కేంద్ర హోం మంత్రి, హోం శాఖ కార్యదర్శి, గవర్నర్, ఎల్‌జి సమక్షంలో లేవనెత్తినట్లు తెలిపారు. జమ్ముకాశ్మీర్ జనాభా మొత్తాన్ని ఉగ్రవాద సానుభూతిపరులుగా ముద్ర వేయలేమని ఆయన పునరుద్ఘాటించారు. నిందితులను శిక్షించాలని, దాంతో సంబంధం లేకుండా, హింసకు వ్యతిరేకంగా తమ స్వరాన్ని వినిపించిన అమాయకులను ఈ పరిధిలోకి తీసుకురాకూడదని అన్నారు. కేంద్రం ఈ అంశంపై శ్రద్ధ వహిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. నౌగామ్ పోలీస్‌స్టేషన్‌లో పేలుడు ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని, త్వరలోనే ప్రజలు తగిన వివరాలను పొందుతారని ఆశిస్తున్నానని చెప్పారు. ఇంత పెద్ద మొత్తంలో పేలుడు పదార్థాలను ఇక్కడికి ఎలా తీసుకువచ్చారు? వాటిని ఏవిధంగా రవాణా చేసి, నిల్వ చేశారు? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానాలు లభిస్తాయని అన్నారు.

నేటి నుంచి ఆఫ్ఘనిస్తాన్ మంత్రి పర్యటన

న్యూఢిల్లీ : ఆఫ్ఘనిస్తాన్ వాణిజ్య శాఖ మంత్రి నూరుద్దీన్ భారత్‌లో పర్యటించనున్నారు. ఐదు రోజుల పర్యటనలో భాగంగా ఆయన బుధవారం భారత్ చేరుకోనున్నారు. గత నెలలో ఆ దేశ విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ పర్యటించిన సంగతి తెలిసిందే. ఇరుదేశాల వాణిజ్య చర్చల అనంతరం ఢిల్లీ నుండి కాబూల్‌కు విమాన సంస్థలు కార్గో ఛార్జీలను తగ్గించాయి. దీంతోపాటు కాబూల్, కాందహార్‌లకు విమాన సర్వీసులను పెంచామని ఎయిర్‌లైన్స్ జనరల్ డైరెక్టర్ మౌలావి రెహ్మన్ తెలిపారు. పాకిస్తాన్‌తో ఘర్షణ నేపథ్యంలో ఆఫ్ఘనిస్తాన్ వాణిజ్య లోటును భర్తీ చేసుకోవడానికి భారత్‌తో సంబంధాలు పెంచుకుంటుంది. ఇరాన్‌లోని చాబహార్ పోర్టు ద్వారా వాణిజ్యాన్ని విస్తరించుకుంటుంది. ప్రస్తుతం వరకు ఈ దేశంతో 1.6 బిలియన్ డాలర్ల వ్యాపారాన్ని ఆఫ్ఘన్ చేసింది. దీన్ని మరింత విస్తరించడం కోసం ఇరాన్ వాణిజ్య చర్చలు జరుపుతున్నారు. భారత అధికారికంగా తాలిబన్ ప్రభుత్వాన్ని గుర్తించకపోయినా పర్యటనలు కొనసాగుతుండటం గమనార్హం.

గాంధీ విగ్రహానికి అవమానం

ప్రజాశక్తి- మెంటాడ (విజయనగరం జిల్లా)



స్వాతంత్య్ర సమర యోధుల విగ్రహాలకు రక్షణ కరువైంది. ఆకతాయిల ఆగడాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. గాంధీ విగ్రహానికి రంగులు పూసి అవమానకరంగా మార్చిన ఘటన మెంటాడ మండలం ఆండ్ర హైస్కూల్లో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. కొంతమంది ఆకతాయిలు హైస్కూల్ ప్రహరీ పైనుంచి లోనికి ప్రవేశించి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడ్డారు. గాంధీ విగ్రహంపై రంగులు చల్లి, అంధ వికారంగా చేయడం అమానుషమని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడిన వారిని కఠిన చర్యలు తీసుకోవాలని ఆండ్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.సీతారాం తెలిపారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో ఛాంపియన్ షిప్‌లో కానిస్టేబుల్ మూర్తికి బంగారు పతకం

ప్రజాశక్తి- కంటోన్మెంట్ (విజయనగరం)

జిల్లా పోలీస్ శాఖలో ట్రాఫిక్ కానిస్టేబులుగా పని చేస్తున్న బివిఎస్‌ఎన్ మూర్తి ఇటీవల కాకినాడలో జరిగిన 14వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి టైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీల్లో బంగారు పతకం సాధించడంతోపాటు, త్వరలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎస్‌పి ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మూర్తిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ స్పోర్ట్స్‌లో రాణించాలంటే శారీరక దృఢత్వం ఎంతో ముఖ్యమని, ఆరోగ్యం కాపాడుకుంటూ రానున్న రోజుల్లో జాతీయ స్థాయిలో మరిన్ని పతకాలు సాధించి జిల్లా పేరును, జిల్లా పోలీసు శాఖ ప్రతిష్టను జాతీయ స్థాయిలో నిలిపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ సూరినాయుడు, ఎస్‌బి సిఐ ఎవి లీలారావు తదితరులు పాల్గొన్నారు.



డేవిస్ కప్ ఫైనల్స్‌కు అల్కరాజ్ దూరం

● స్పెయిన్ జట్టుకు ఎదురుదెబ్బ

మాడ్రిడ్: డేవిస్ కప్ ఫైనల్స్‌కు స్పెయిన్ యువ సంచలనం, టాప్‌సీడ్ కార్లోస్ అల్కరాజ్ దూరమయ్యాడు. గాయం కారణంగా అతడు డేవిస్ కప్ మ్యాచ్‌లకు దూరమైనట్లు స్పెయిన్ ఆటగాడు మంగళవారం సోషల్ మీడియా వేదికగా ప్రకటించాడు. 'బొలోగ్నా వేదికగా జరిగే డేవిస్ కప్ క్వార్టర్‌ఫైనల్లో ఆడలేనని ప్రకటించడానికి బాధగా ఉంది. కుడికాలు గాయం తీవ్రత తగ్గని కారణంగా వైద్యులు టోర్నీలకు దూరంగా ఉండాలని సూచించారు. డేవిస్‌కప్ అనేది పెద్ద టోర్నీ అని తెలిసినా.. వైదొలుగుతున్నందుకు చింతిస్తూ గుండె పగిలి ఇంటికి వెళ్తున్నాను..' అని అల్కరాజ్ తన పోస్ట్‌లో పేర్కొన్నాడు. ఈనెల 18 నుంచి 23వరకు ఇటలీలోని బొలోగ్నా వేదికగా స్పెయిన్ జట్టు చెక్ రిపబ్లిక్‌తో క్వార్టర్‌ఫైనల్లో తలపడనుంది. నాన్ ప్లేయింగ్ కెప్టెన్ డేవిడ్ ఫెర్రర్ సారథ్యంలోని స్పెయిన్ జట్టులో జౌమ్ మునార్, పాబ్లో కరెనో బూస్టా, ఫెడ్రో మార్టినేజ్, మార్సెల్ గ్రానోలర్స్ ఇతర ఆటగాళ్లు. అల్కరాజ్ స్థానంలో ప్రపంచ 14వ ర్యాంకర్ అలెగ్జాండ్రో డేవిడోవిచ్‌ను ఎంపికయ్యే ఛాన్స్ ఉంది.

ఇన్ఫోసిస్‌కు ఆర్‌జియుకెటి విద్యార్థినులు ఎంపిక

ప్రజాశక్తి- నూజివీడు టౌన్

నూజివీడు ఆర్‌జియుకెటి ఇటీవల ఎపిఐటిఎతో కలిసి నిర్వహించిన నియామక డ్రైవ్‌లో 66 మంది విద్యార్థులు ఇన్ఫోసిస్‌కు ఎంపికయ్యారు. వారిలో 50 మంది సిఎస్‌ఇ విభాగం నుండి, 9 మంది ఇసిఇ నుండి, ఏడుగురు ఇఇఇ నుంచి ఉన్నారు. ఈ సందర్భంగా ఆర్‌జియుకెటి రిజిస్ట్రార్, నూజివీడు క్యాంపస్ డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్, పాలనాధికారి డాక్టర్ బి.లక్ష్మణరావు విద్యార్థులందరినీ అభినందించారు.

ప్రతినెలా మూడో శనివారం సమావేశం

- అమరావతి రైతులతో కమిషనర్ కన్నబాబు
- ప్లాట్ల సరిహద్దు రాళ్లు కనిపించడం లేదు : రైతులు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతి రాజధాని పరిధిలో రైతుల సమస్యల పరిష్కారానికి ప్రతినెలా మూడో శనివారం రైతుల జెఎసితో సమావేశం నిర్వహిస్తామని కమిషనర్ కన్నబాబు తెలిపారు. రాజధాని సమగ్ర ప్లాను అమలు, నోటిఫై చేసిన డ్రాఫ్ట్ ప్లాను, గైడ్‌లైన్స్ అంశాలను వివరించేందుకు మంగళవారం సాయంత్రం సిఆర్‌డిఏ కార్యాలయంలో రైతు ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. దీనికి కమిషనర్ కన్నబాబు, అదనపు కమిషనర్ భార్గవతేజ హాజరయ్యారు. ప్రస్తుతం అమరావతి బ్లూప్లాను, రోడ్లు, కాలువలు, రిజర్వాయర్లు, రోడ్ల వెంట గ్రీనరీ, నడక, సైకిల ట్రాక్, విద్యుత్ లైన్లు, మంచినీటిపైపులైన్లు వంటివి ఎలా ఉంటాయి. వాటిని ఎలా వినియోగిస్తామనే అంశాలను అధికారులు, కమిషనర్ రైతులకు వివరించారు. అనంతరం రైతులు జెఎసి తరుపున సమర్పించిన 14 డిమాండ్లను లేవనెత్తారు. గ్రామ కంఠాలు, అబ్బురాజుపాలెం, దొండపాడు, బోరుపాలెం గ్రామాల పరిధిలో సుమారు 150 ఎకరాలకు సంబంధించిన జరీబు భూముల అంశంతోపాటు ఫ్లోర్‌స్పేస్ ఇండెక్స్(ఎఫ్ఎస్ఐ) పెంపుదల అంశాలను ప్రస్తావించారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ కొన్నిటిని పరిష్కరించామని, గ్రామ కంఠాలు, జరీబు భూముల అంశాల సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ త్రీమెన్ కమిటీ ఇటీవల దీనిపై సమావేశం అయిందని, కొన్ని అంశాలు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఈనెల 21, 22 తేదీల్లో మరోసారి సమావేశం అవుతుందని, అప్పుడు కొన్ని సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఆ సమావేశానికి అవసరమైతే జెఎసి ప్రతినిధులను ఆహ్వానిస్తామని తెలిపారు. దీంతోపాటు ప్రతి నెలా మూడో శనివారం రైతుల జెఎసితో సమావేశం అవుతామని, అన్ని సమస్యలూ పరిష్కరిస్తామని చెప్పారు. అయితే గ్రీవెన్స్ పెడుతున్నారని, రైతులు ఇచ్చిన వినతిపత్రాలు చెత్తబుట్టలో వేస్తున్నారని పట్టించుకోవడం లేదని జెఎసి సభ్యులు తెలిపారు. దీనికి కమిషనర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని, స్వయంగా తానే గ్రామాల్లోకి వచ్చి రైతుల వద్ద సమస్యలు తెలుసుకున్నాని, అటువంటప్పుడు పరిష్కారం చేయడానికి ఇబ్బందులు ఏమి ఉంటాయని ప్రశ్నించారు. ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ ప్రస్తుతం 2.8 ఇచ్చారని, దీన్ని 5కు పెంచాలని రైతులు కోరారు. కనీసం 3.5 అన్నా ఇవ్వాలని కోరారు. దీనికి కమిషనర్ కన్నబాబు మాట్లాడుతూ ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ పెంచితే ఇబ్బందులు పడతారని, బిల్డర్లతో సమస్యలు వస్తాయని తెలిపారు. వాటికి సంబంధించిన సమగ్ర సమాచారం తరువాత సమావేశంలో వివరిస్తానని అన్నారు.

డిసెంబర్‌లో అమరావతి బిల్లు

అలాగే రాజధానిని గుర్తిస్తూ గెజిట్ ఇచ్చే అంశం ఇంతకాలం ఎందుకు పెండింగ్లో ఉందని రైతులు అడిగారు. దీనికి కమిషనర్ స్పందిస్తూ ఇప్పటి వరకూ దేశంలో ఏ రాజధానికి గెజిట్ లేదని అమరావతికి అవసరం ఏముందని అన్నారు. హైదరాబాద్ నగరానికి కూడా గెజిట్ లేదని చెప్పారు. దీనిపై రైతులు మాట్లాడుతూ విభజన చట్టంలోనే హైదరాబాద్ పది సంవత్సరాలు రాజధానిగా ఉంటుందని పేర్కొన్నారని, అందువల్లే గెజిట్ అని అడిగామని తెలిపారు. ఇదే అంశంపై తాము కేంద్ర హోమ్‌మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకెళితే గెజిట్ ఇచ్చేందుకు అంగీకరించారని, అయితే న్యాయ విభాగం అధికారులు కొన్ని అభ్యంతరాలు లేవనెత్తారని తెలిపారు. వాటిని కూడా క్లియర్ చేస్తున్నామని, డిసెంబర్లో జరిగే పార్లమెంటు సమావేశాల్లో అమరావతికి సంబంధించిన బిల్లు పెట్టే అవకాశం ఉందని కమిషనర్ రైతులకు తెలిపారు. గ్రామాల్లో నుండి రోడ్లు వేసేందుకు తీసుకున్న ప్లానులో కొన్నిచోట్ల కొద్దిస్థలాన్ని వదిలేస్తున్నారని తెలిపారు. వాటిని దుకాణాలు నిర్మించుకుని వినియోగించుకునేలా ప్లాను చేస్తున్నామని కమిషనర్ రైతులకు తెలిపారు. ప్రస్తుతం రైతులకు ఇచ్చిన ప్లాట్లకు సంబంధించి సరిహద్దు రాళ్లు కనిపించడం లేదని, ఆందోళనలో ఉన్నారని రైతులు తెలపగా పనులు జరుగుతున్న నేపథ్యంలో పగ్‌మార్కు చూపిస్తామని అక్కడ నుండి డెవలపర్ అభివృద్ధి చేసిన తరువాత రైతులకు ఇచ్చే సమయంలో రాళ్లు వేసి ఇస్తామని కమిషనర్ అన్నారు. ఇప్పుడు సరిహద్దు రాళ్లు పెట్టినా మెరకతోలాల్సి ఉంటుందని, అనంతరం కనిపించకుండా పోయే అవకాశం ఉన్న నేపథ్యంలో లేఅవుట్లు అభివృద్ధి తరువాత సరిహద్దు రాళ్లను పెట్టి ఇస్తామని కమిషనర్ వివరించారు.

వడ్డీ వ్యాపారి దాడిలో మహిళ మృతి

ప్రజాశక్తి - ముదిగుబ్బ (శ్రీసత్యసాయి జిల్లా)

మండల కేంద్రానికి చెందిన మహిళ వడ్డీ వ్యాపారి మనుషుల దాడిలో మృతి చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... శాంతమ్మ అనే మహిళ మండల కేంద్రంలో టీ స్టాల్ నడుపుతున్నారు. ఆమె అనంతపురానికి చెందిన రామకృష్ణ దగ్గర రూ. 30 వేలు వడ్డీకి తీసుకున్నారు. అప్పు చెల్లింపు విషయంపై శాంతమ్మను, ఆమె భర్తను రామకృష్ణ మనుషులు నిలదీశారు. ఈ విషయంలో వారి మధ్య తోపులాట జరిగి ఘర్షణకు దారితీసింది. ఈ దాడిలో శాంతమ్మ మృతి చెందారు. ఆమె భర్తకు తీవ్రగాయాలయ్యాయి.

రూ.100 కోట్లతో ఏవియేషన్ అకాడమీ

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం సిటీ

రూ.100 కోట్లతో రాజమహేంద్రవరంలో పైలెట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేయనున్నట్లు ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి వాసు తెలిపారు. మంగళవారం హోటల్ లాహాస్పిన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దీనివల్ల 500 మంది వరకూ ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. ఏప్రిల్, మే నాటికి 40 మందితో మొదటి బ్యాచ్ ప్రారంభమవుతుందని తెలిపారు. జార్విస్ ఏవియోషన్ అకాడమీ ప్రతినిధి ఫణింద్ర అరుమిల్లి మాట్లాడుతూ 17 ఏళ్లుగా హైదరాబాద్ కేంద్రంగా జార్విన్ సొల్యూషన్స్ నిర్వహిస్తున్నామన్నారు. 800 మంది పని చేస్తున్నారని చెప్పారు. 14 నెలల శిక్షణతో పైలెట్లను తీర్చిదిద్దుతామన్నారు. దేశంలో 25 వేల మంది పైలెట్ల అవసరం ఉందన్నారు. త్వరలో ఏవియేషన్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి కోర్సులు కూడా నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో ఛాంబర్ కామర్స్ అధ్యక్షుడు తవ్వా రాజా పాల్గొన్నారు.

కర్నూలులో లారీ ఢీకొని ముగ్గురు దుర్మరణం

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

లారీ ఢీకొనడంతో ముగ్గురు దుర్మరణం చెందారు. కర్నూలు నగర శివారులోని హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... కర్నూలు జిల్లా కల్లూరు మండల కేంద్ర పరిధిలోని కేశవ గ్రాండ్ హోటల్ వద్ద రోడ్డు దాటుతున్న నలుగురు పాదచారులను లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో, వెల్దుర్తి మండలం రత్నపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ (65), కల్లూరు మండలం ఎ.గోకులపాడుకు గ్రామానికి చెందిన శ్రీనివాసులు (50), కల్లూరుకు చెందిన వెంకట రామిరెడ్డి (40) మృతి చెందారు. శ్రీనివాసులుకు చెందిన లారీ రిపేరు కావడంతో పక్కకు ఆపి నలుగురూ రోడ్డు దాటుతుండగా ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైతులపై వరి కోతల భారం

- చైన్ ట్రాక్ యంత్రాలకు భారీ డిమాండ్
- అమాంతం పెరిగిన అద్దెలు


ప్రజాశక్తి - రాజోలు

అన్నదాతలకు మరో కష్టం వచ్చిపడింది. ప్రకృతి విపత్తులు ఈసారి వరి రైతులను బాగా దెబ్బతీశాయి. చేతికి వచ్చిన పంట ఇంటికి వచ్చే పరిస్థితి లేకుండా పోతోంది. వరి కోతల విషయంలోనూ ఈసారి ఎప్పుడూ లేనంత కష్టం వచ్చింది. వరదకు పొలాల్లో నీరు చేరడం, తేమ ఇప్పటికీ ఆరకపోవడం, చేను ఒరిగిపోవడంతో వడ్లు అలాగే ఉంటే మొలకెత్తే పరిస్థితి ఉంది. ప్రతిసారీ టైర్ల మెషిన్లతో కోతలు పూర్తయ్యేవి. ఎక్కడో బాగా తేమ ఉండే ప్రాంతాల్లోనే వరి కోతలకు చైన్ ట్రాక్ మెషిన్లు అవసరమయ్యేవి. వరుస వానలతో ఈసారి పంట పొలాల్లో నీరు ఇంకా నిలిచే ఉంది. కొన్ని ప్రాంతాల్లో వారంలోపు కచ్చితంగా వరి కోతలు పూర్తి చేయాల్సిన పరిస్థితి ఉంది. వరి విస్తీర్ణానికి అవసరమైన చైన్ ట్రాక్ మెషిన్లు లేకపోవడంతో కోతలకు ఇబ్బంది కలుగుతోంది. ప్రతి ఊర్లోనూ ఇప్పుడు వరి కోత మెషిన్లకు బాగా డిమాండ్ ఉన్నది. చైన్ ట్రాక్ మెషిన్ల యజమానుల దగ్గరికి రైతులు వెళ్లి బతిమాలుతున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, వడ్లు మొలకలు వచ్చే పరిస్థితి ఉండడంతో ట్రాక్ మెషిన్లకు డిమాండ్ పెరిగింది. ఇదే ఇప్పుడు రైతులకు మరిత భారంగా మారింది. వరి కోతల ఖర్చులు ఇప్పుడు రెట్టింపు అవుతోంది. కింద పడిన వరిని కోత కోయడానికి సమయం ఎక్కువ పడుతుంది. ఎకరాకు కనీసం గంటన్నర కన్నా ఎక్కువ సమయం పడుతుంది. ఈ లెక్కన ఎకరాకు రూ.5,000 నుంచి రూ.5,500 వరకు ఖర్చువుతోందని రైతులు వాపోతున్నారు.

పెరిగిన చైన్ ట్రాక్ యంత్రాల అద్దె..


ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా చైన్ ట్రాక్ మెషిన్లకు డిమాండ్ వచ్చింది. ఇదే అదునుగా వాటి యజమానులు వరి కోతల ఛార్జీలను పెంచారు. గతంలో గంటకు ధర రూ.2,200 నుంచి రూ.2,500 ఉండగా, ఇప్పుడు ఏకంగా రూ.3,500 నుంచి రూ.4,500 వరకు పెంచేశారు. నేలవాలిన ఎకరం వరి కోతకు రూ.7 వేల నుంచి రూ.8 వేలు అవుతోంది. చైన్ ట్రాక్ మిషిన్ల కొరతతో ఈసారి వరి కోతలు నెలల తరబడి కొనసాగే పరిస్థితి ఉంది. కొనుగోలు కేంద్రాలకు వడ్లు ఆలస్యంగా వస్తున్నాయి. కోతల సమయంలో వచ్చిన వానలకు వడ్లు తడపడంతో నూకలు ఎక్కువ అయ్యే పరిస్థితి ఉంది. గిట్టుబాటు ధర వస్తుందో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాగా ముమ్మిడివరం మండలంలో టైర్ మెషిన్ గంటకు రూ.1,700 తీసుకుంటే, చైన్ మెషిన్‌కు రూ.3,500 తీసుకుంటున్నారు. ఎకరం పొలం కోసేందుకు రైతులు రూ.7 వేలకు పైగా ఖర్చవుతుందని వాపోతున్నారు.

'ఎన్‌బికె 111' మహారాణి నయనతార



బాలకృష్ణ హీరోగా గోపీచంద్ మలినేని ఓ చిత్రం తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. 'ఎన్‌బికె 111' వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. తాజాగా ఇందులో హీరోయిన్‌గా నటిస్తున్న నయనతార లుక్‌ని విడుదల చేశారు. మంగళవారం ఆమె పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు చెబుతూ చిత్రబృందం ఈ ఫస్ట్ లుక్‌ని విడుదల చేసింది. ఇందులో నయనతార మహారాణి పాత్రలో కనిపించనున్నట్లు నిర్మాణ సంస్థ పేర్కొంది. 'సముద్రమంత ప్రశాంతతను, తుపాను అంత బీభత్సాన్ని తనలో మోసే రాణి మా సామ్రాజ్యంలోకి అడుగుపెట్టనుంది' అంటూ ఓ వీడియోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. నవంబర్ 26న ఈ సినిమా ప్రారంభం కానుంది.

20న గోవాలో బాలకృష్ణకు సత్కారం



కథానాయకుడు నందమూరి బాలకృష్ణకు మరో అరుదైన గౌరవం దక్కనుంది. నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎఫ్‌డిసి), గోవా ప్రభుత్వంతో కలిసి ఎంటర్‌టైన్‌మెంట్ సొసైటీ ఆఫ్ గోవా సంయుక్తంగా 56వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం (ఇఫీ)ని ఈనెల 20న నిర్వహిస్తున్నాయి. ఇఫీ ఆరంభ వేడుకలో బాలకృష్ణని సత్కరించనున్నారు. భారతీయ సినీరంగంలో అర్ధ శతాబ్ద కాలం పాటు తన అపూర్వమైన నటనతో, దాదాపు 100కిపైగా చిత్రాల్లో వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను అలరించిన బాలయ్య 50 ఏళ్ల సినీ ప్రస్థానాన్ని ఇఫీ- 2025 ప్రత్యేకంగా జరుపుకోనుంది. సినీ ప్రముఖులు, కళాకారులు, ప్రతినిధుల సమక్షంలో ఆయనకు ఈ గౌరవాన్ని అందించనున్నారు.



'టార్టాయిస్' షూటింగ్ ప్రారంభం

రాజ్ తరుణ్, అమృత చౌదరి జంటగా, అవసరాల శ్రీనివాస్, ధన్యా బాలకృష్ణ ప్రధాన పాత్రల్లో తెరకెక్కు తున్న 'టార్టాయిస్' సినిమా షూటింగ్ ప్రారంభమైంది. రిత్విక్‌కుమార్ దర్శకత్వంలో ప్రశ్విత ఎంటర్‌టైన్మెంట్, ఎస్‌కే గోల్డెన్ ఆర్ట్స్, చందమామ క్రియే షన్స్, ఎన్‌వీఎల్ క్రియేషన్స్‌పై శశిధర్ నల్ల, విజయ్‌కుమార్, ఇమ్మడి సంతోష్, రామిశెట్టి రాంబాబు నిర్మిస్తున్నారు. షూటింగ్ ప్రారంభోత్సవం సందర్భంగా సినిమా మోషన్ పోస్టర్‌ను చిత్ర యూనిట్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా రాజ్‌తరుణ్ మాట్లాడుతూ 'టార్టాయిస్' చిత్రం చాలా కొత్తగా, వైవిధ్యంగా ఉంటుంది. నా కెరీర్‌కు కిక్ ఇచ్చే చిత్రం ఇది' అని తెలిపారు. 'త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం' అని నిర్మాతలు పేర్కొన్నారు. ఈ చిత్రానికి చంద్రబోస్ సాహిత్యం, అనూప్ రూబెన్స్ సంగీతం.

నటనకి గుడ్ బై : తులసి



సీనియర్ నటి తులసి ఈ ఏడాది డిసెంబర్ 31తో నటనకు రిటైర్మెంట్ ఇస్తున్నా నంటూ సోషల్ మీడియాలో ఓ ప్రకటన చేశారు. ఆమెకు మూడున్నర నెలల వయసు ఉన్నప్పుడే నటన రంగంలోకి అడుగు పెట్టారు. తులసి తల్లి అలనాటి సావిత్రి స్నేహితురాలు కావడంతో, 'జీవన తరంగాలు' అనే సినిమాలో ఉయ్యాలలో వేసే పాపాయి పాత్రతో తులసి సినీ రంగ ప్రవేశం చేశారు. నాలుగేళ్ల నుంచి బాల నటిగా మారి తెలుగు, తమిళ, కన్నడ, భోజ్‌పురి సినిమాల్లో నటించారు. కొన్ని సినిమాల్లో హీరోయిన్‌గా కూడా చేశారు. కన్నడ డైరెక్టర్ శివమణిని వివాహం చేసుకున్న ఆమె చాలాకాలం నటనకు బ్రేక్ ఇచ్చారు. ఆ తరువాత తల్లి పాత్రలు రావడంతో మళ్ళీ నటించడం మొదలుపెట్టారు.

12న 'నా తెలుగోడు' విడుదల



రినాథ్ పోలిచర్ల రచన, దర్శకత్వ, నిర్మాణంలో డ్రీం టీం ప్రొడక్షన్స్ పై రూపొందించిన చిత్రం 'నా తెలుగోడు'. హరినాథ్ పోలిచర్ల కథానాయకుడు. తనికెళ్ళ భరణి, రఘు బాబు, జరీనా వహాబ్, నిధి పాల్, రోనీ కౌలా, సోఫియా తన్వీర్ ముఖ్య పాత్రధారులుగా నటించారు. డిసెంబర్ 12న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

జనవరి-అక్టోబరు మధ్య కాలంలో

మరాఠ్వాడాలో 899 మంది రైతుల ఆత్మహత్య

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబరు వరకు మహారాష్ట్రలోని మరాఠ్వాడా ప్రాంతంలో 899 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఆరు నెలల్లో పంటలకు భారీ నష్టంతో 537 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని అధికారిక డేటా స్పష్టం చేస్తుంది. ఛత్రపతి శంభాజీనగర్ డివిజనల్ కమిషనర్ కార్యాలయం అందించిన డేటా ప్రకారం.. ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబరు వరకు 10 నెలల్లో మరాఠ్వాడాలో 899 మంది రైతుల ఆత్మహత్యలు నమోదయ్యాయి. వీటిలో వర్షాలు, వరదల విధ్వంసంతో ఆరు నెలల్లో (మే 1 నుంచి అక్టోబరు 31 వరకు) 537 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. బీడ్, ఛత్రపతి శంభాజీనగర్ జిల్లాల్లో అత్యధిక సంఖ్యలో రైతుల ఆత్మహత్యలు నమోదయ్యాయి. జిల్లాల వారీ చూస్తే ఈ 6 జిల్లాల్లో ఛత్రపతి సంభాజీనగర్‌లో 112, జల్నా-32, పర్భానీ-45, హింగోలి-33, నాందేడ్-90, బీడ్-108, లాతూర్-47, ధరాశివ్-70 మంది చొప్పున రైతుల ఆత్మహత్యలు చోటుచేసుకున్నాయి. రైతుల ఆత్మహత్యల పట్ల రైతు సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశాయి. ప్రభుత్వం ఈ సమస్యను తీవ్రంగా పరిగణించి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తుందని వ్యవసాయశాఖ సహాయ మంత్రి ఆశిష్ జైస్వాల్ తెలిపారు.

పరిస్థితుల్లో మార్పు లేనందున పునస్సమీక్ష అవసరం లేదు

- ఉమర్ ఖలీద్ ప్రభృతుల బెయిల్‌పై ఢిల్లీ పోలీసుల వాదన

న్యూఢిల్లీ : ఈశాన్య ఢిల్లీ అల్లర్ల కేసులో నిందితులైన ఉమర్ ఖలీద్, షార్జిల్ ఇమామ్ ప్రభృతుల బెయిల్ పిటిషన్లపై సుప్రీంకోర్టు మంగళవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా ఉమర్ ఖలీద్‌కు బెయిల్‌ను నిరాకరించాలన్న తమ గత నిర్ణయాన్ని సమీక్షించుకోవాల్సిన అవసరం లేదని, పరిస్థితుల్లో ఎలాంటి మార్పు లేదని ఢిల్లీ పోలీసులు సుప్రీం కోర్టుకు తెలియజేశారు. ఢిల్లీ అల్లర్లు అప్పటికప్పుడు తలెత్తినవి కావని, ముందస్తు ప్రణాళిక ప్రకారం, కుట్ర పన్ని మరీ జరిగినవేనని ఢిల్లీ పోలీసుల తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వి రాజు వాదించారు. దీర్ఘకాలం కస్టడీలో వున్నారన్న కారణంతో ఖలీద్ ప్రభృతులు బెయిల్ కోరలేరని పేర్కొన్నారు. ఈ వాదనలను ఖలీద్ తరపు న్యాయవాదులు తోసిపుచ్చారు. ఆనాటి హింస, అల్లర్లకు ఖలీద్‌కు సంబంధం వుందనడానికి ప్రత్యక్షంగా ఎలాంటి సాక్ష్యాధారాలు లేవని చెప్పారు. ఒకే ఒక ఎఫ్ఐఆర్‌లో ఆయన పేరు పేర్కొన్నారని, ఆయన దగ్గర నుండి ఎలాంటి ఆయుధాలు, ఇతరత్రా సామాగ్రి స్వాధీనం చేసుకోలేదని చెప్పారు. వచ్చే గురువారానికి (20వ తేదీ) ఈ కేసును వాయిదా వేశారు. ఈ అల్లర్లపై దర్యాప్తు స్థితిగతులపై తాజా నివేదికను అందజేయాల్సిందిగా మంగళవారం పోలీసులను ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. జస్టిస్ వివేక్ చౌదరి, జస్టిస్ మనోజ్ జైన్‌లతో కూడిన బెంచ్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. విద్వేష ప్రసంగాలు చేసిన పలువురు రాజకీయ నేతలపై ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేయాలని కోరుతూ వచ్చిన పిటిషన్లను కూడా బెంచ్ విచారించింది.

హసీనాకు మరణశిక్షను వ్యతిరేకిస్తున్నాం

- ఐక్యరాజ్య సమితి

న్యూయార్క్, ఢాకా : పదవీచ్యుతురాలైన బంగ్లా ప్రధాని హసీనాపై బంగ్లాదేశ్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పు బాధితులకు న్యాయం అందించే దిశగా కీలకమైన అడుగు అని ఐక్యరాజ్య సమితి వ్యాఖ్యానించింది. అయితే ఆమెకు మరణశిక్ష విధించడంపై విచారం వ్యక్తం చేసింది. పరిస్థితులేవైనా మరణశిక్ష విధించడాన్ని వ్యతిరేకించాలన్న వైఖరికి కట్టుబడి వుండాలని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కమిషనర్ వోల్కర్ టర్క్ అభిప్రాయపడ్డారు. ఆ అభిప్రాయంతో పూర్తిగా ఏకీభవిస్తున్నట్లు ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ చెప్పారు. జవాబుదారీతనమనేది చాలా కీలకమని యుఎన్ చీఫ్ ముఖ్య ప్రతినిధి స్టీఫెన్ డుజారిక్ వ్యాఖ్యానించారు. ఈ తీర్పు వెలువడిన తర్వాత ప్రజలు శాంతి, సంయమనం పాటించడం కూడా అంతే కీలకమని అన్నారు. అన్ని పరిస్థితుల్లోనూ మరణశిక్ష విధింపును తాము తీవ్రంగా వ్యతిరేకిస్తామని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల ప్రతినిధి రవీనా షామ్‌దాసాని స్పష్టం చేశారు.

మీడియాకు బంగ్లాదేశ్ హెచ్చరికలు

మాజీ ప్రధాని షేక్ హసీనా చేసే వ్యాఖ్యలు, స్టేట్‌మెంట్‌లపై ఎలాంటి వార్తలు ఇవ్వరాదంటూ అన్ని ప్రింట్, ఎలక్ట్రానిక్, ఆన్‌లైన్ మీడియా సంస్థలను బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం హెచ్చరించింది.

విద్యార్థులు, కార్మికులపై వేధింపులు వద్దు

- వారిలో భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే
- సిపిఎం నేత తరిగామి



శ్రీనగర్ : దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో చదువుకుంటున్న విద్యార్థులు, కార్మికులు ఎదుర్కొంటున్న వేధింపులపై సిపిఎం నేత ఎం.వై.తరిగామి తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో చదువుకుంటున్న యువతరంలో ఈ వేధింపుల పరిస్థితులు తీవ్రమైన భయాందోళనలను సృష్టించాయని అన్నారు. విద్యార్థులను ఈ వాతావరణంలోకి లాగవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. వారిని బెదిరింపులు లేదా అనుమానాలకు గురి చేయడానికి బదులుగా వారిలో ఒక రకమైన భద్రతా భావాన్ని కలిగించేలా ఈ దేశం హామీ కల్పించాలని కోరారు. విద్యార్థులు తమ చదువును, పనిని కొనసాగించడానికి భరోసా, సుస్థిరత, విశ్వాసం వంటివి అవసరమైన పరిస్థితుల్లో ప్రస్తుతమున్న ఇటువంటి వేధింపుల వాతావరణం వారికి అనువైన, సక్రమమైన వాతావరణాన్ని కల్పించలేదని తరిగామి పేర్కొన్నారు. ఇటువంటి హేయమైన ఉగ్రవాద కార్యకలాపాలకు బాధ్యులైన వారికి ఇక్కడ స్థానం లేకుండా చేస్తూనే మరోపక్క అమాయకులైన పౌరులు ఆందోళన చెందకుండా, అవమానాలకు గురి కాకుండా చూసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సి వుందని ఆయన స్పష్టం చేశారు.

ప్రజల ముఖ్యంగా యువత హృదయాలను, మనస్సులను గెలుచుకునే ప్రయత్నాలు చాలా కీలకమని ఆయన వ్యాఖ్యానించారు. అలా కాకుండా అమాయకులను వెనక్కి నెట్టివేయడం వల్ల అర్థవంతమైనదేమీ సాధించడానికి దోహదపడదని అన్నారు. నిరాశా నిస్పృహల వల్ల ఎప్పుడూ ప్రతికూల ఫలితాలే వస్తాయన్నారు. వివక్షపూరితమైన చర్యల వల్ల ఎప్పుడూ ఒంటరి, వేరు అనే భావన మరింత పెరుగుతుందని అన్నారు. ఘర్షణల సమయంలో గత అనుభవాలను పరిశీలిస్తే ఈ విషయం బోధపడుతుందన్నారు. ఢిల్లీలో తీవ్రవాద కార్యకలాపాల నేపథ్యంలో ఎలాంటి విచక్షణారహిత అరెస్టులు జరగకుండా చూడాలని సిపిఎం డిమాండ్ చేసింది. విద్యార్థులు, కార్మికులు, లేదా సాధారణ పౌరులు ఎవరైనా సరే అమాయకులు భయానికి లేదా అనుమానాలకు బాధితులుగా మారకుండా చూడాల్సిన బాధ్యత లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థలదేనని తరిగామి పేర్కొన్నారు.



వివిధ రాష్ట్రాల కాంగ్రెస్ నాయకులతో సమావేశమైన ఖర్గే, రాహుల్ గాంధీ, వేణుగోపాల్

ఎన్నికల కమిషన్ తీరును నిరసిస్తూ ఢిల్లీలో వచ్చే నెల భారీ ర్యాలీ

- కాంగ్రెస్ నిర్ణయం

న్యూఢిల్లీ : ప్రస్తుతం 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో కొనసాగుతున్న ఓటర్ జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ద్వారా ప్రజాస్వామ్యాన్ని, ప్రతిపక్ష పార్టీలను నాశనం చేయడానికి ఎన్నికల కమిషన్ కుటిల పన్నాగం పన్నిందని కాంగ్రెస్ మంగళవారం విమర్శించింది. ఎన్నికల కమిషన్‌కు వ్యతిరేకంగా డిసెంబర్ మొదటివారంలో ఢిల్లీలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు ప్రకటించింది.

ఎస్ఐఆర్ ప్రక్రియ జరుగుతున్న రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పిసిసి) అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ఎఐసిసి ఇన్‌ఛార్జీలతో పార్టీ అగ్రనాయకత్వం మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు తీసుకున్నారు. ఈ సమావేశంలో పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజేషన్) కెసి వేణుగోపాల్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఖర్గే ప్రారంభోపన్యాసం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ సమయంలో బూత్ లెవల్ ఏజెంట్ల (బిఎల్ఎ) నెట్‌వర్క్ బలంగా ఉండాలని వివరించారు. బిజెపి తన ఓటు చోరీకి ఎస్ఐఆర్‌ను ఒక ఆయుధంగా ఉపయోగించుకుంటుందని ఖర్గే విమర్శించారు. ఎన్నికల కమిషన్ తన బాధ్యతలకు విరుద్ధంగా ప్రవర్తిస్తుంటే మౌనంగా చూస్తూ కూర్చోకూడదని తెలిపారు.

బాధ్యతల నుంచి ఇసి తప్పుకుంది : రాహుల్‌గాంధీ

అనంతరం రాహుల్‌గాంధీ మాట్లాడుతూ 'న్యాయమైన, పారదర్శక ఓటర్ల జాబితాను అందించడమే ఎన్నికల కమిషన్ బాధ్యత, కానీ దీని నుంచి సంస్థ తప్పుకుంది' అని విమర్శించారు. ఈ సమస్యను రాజకీయంగా, చట్టపరంగా, సంస్థాగతంగా ఎదుర్కొనాలని పేర్కొన్నారు.

ఉద్దేశపూర్వకంగా ఓట్ల తొలగింపునకు ఇసి యత్నం : వేణుగోపాల్

ఒక వర్గం ఓట్లను తొలగించడానికి ఇసి ఉద్దేశపూర్వకంగా ఎన్నికల కమిషన్ ప్రయత్నిస్తోందని వేణుగోపాల్ విమర్శించారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇసి తాను లక్ష్యంగా చేసుకున్న ఓట్లను తొలగించడానికే ఎస్ఐఆర్‌ను రూపొందించిందని, బీహార్‌లో ఇదే అనుభవమైందని తెలిపారు. ఎస్ఐఆర్ ఎన్నికల కమిషన్ చేసిన దుర్మార్గపు ప్రయత్నమని, పూర్తిగా అనైతికమని, అప్రజాస్వామికమని అన్నారు. 'మేం వీధుల్లోకి వెళుతున్నాం. డిసెంబర్ మొదటివారంలో ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో లక్షలాది మందితో భారీ ర్యాలీని కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తుంది' అని ప్రకటించారు. ఈ నెల 4 నుంచి ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరి, అండమాన్-నికోబార్ దీవులు, లక్షద్వీప్‌ల్లో ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, పశ్చిమ బెంగాల్‌లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.


ఢిల్లీ బాంబు పేలుడు ఘటనలో

10 రోజుల ఎన్ఐఎ కస్టడీకి కీలక కుట్రదారుడు

న్యూఢిల్లీ : ఎర్రకోట సమీపంలో జరిగిన బాంబు పేలుడు ఘటనలో కీలక కుట్రదారుడుగా భావిస్తున్న జాసిర్ బిలాల్ వనీ అలియాస్ డానిష్‌కు ఢిల్లీ కోర్టు మంగళవారం 10 రోజుల కస్టడీ విధించింది. డానిష్‌ను విచారణ నిమిత్తం తమకు అప్పగించాలంటూ జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) అభ్యర్థన మేరకు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి అంజు బజాజ్ చంద్నా ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. డానిష్‌ను జమ్మూకాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో అరెస్టు చేసినట్లు ఎన్ఐఎ సోమవారం ప్రకటించిన సంగతి తెలిసిందే. మంగళవారం ఢిల్లీ కోర్టులో ప్రవేశపెట్టిన సందర్భంగా కోర్టు వద్ద భారీ భద్రతను ఏర్పాటు చేశారు. కోర్టు ప్రాంగణంలో భారీ ఎత్తున పోలీసులు, సత్వర కార్యాచరణ బలగాలను మోహరించారు. మీడియా ప్రతినిధులను కూడా కోర్టు ఆవరణలోకి ప్రవేశించకుండా నిషేధించారు. ఎర్రకోట వద్ద కారు బాంబుతో ఆత్మహుతికి పాల్పడ్డ ఉగ్రవాది ఉమర్ ఉన్ నబీతో కలిసి డానిష్ ఈ కుట్ర అమలుకు పనిచేశాడని ఎన్ఐఎ సోమవారం తన ప్రకటనలో పేర్కొంది. డ్రోన్లను నడపడం, రాకెట్లను తయారు చేయడం వంటి విషయాల్లో నబీకి సాంకేతికంగా సహాయం చేశాడని ఎన్ఐఎ పేర్కొంది. ఈ కేసులో ఇప్పటికే అమీర్ రషీద్ అలీని ఎన్ఐఎ అరెస్టు చేసింది. బాంబు పేలుడుకు ఉపయోగించిన కారు అలీ పేరు మీదనే రిజిస్టర్ అయింది. అలీని సోమవారం ప్రత్యేక కోర్టు ముందు హాజరుపరచగా 10 రోజుల పాటు ఎన్ఐఎ కస్టడీని కోర్టు విధించింది. ఉగ్రవాది నబీకి అమీర్ వసతి సౌకర్యం కల్పించడంతో పాటు ఇతర మద్దతు అందించాడని ఎన్ఐఎ పేర్కొంది.

గాజాలో అంతర్జాతీయ బలగాలు!

- ట్రంప్ శాంతి ప్రణాళికకు భద్రతా మండలి ఆమోదం
- తిరస్కరించిన హమాస్



పాలస్తీనీయులన్లకు మద్దతుగా న్యూయార్క్‌లోని అమెరికా కార్యాలయం వెలుపల నిరసనకారులు ప్రదర్శన

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన గాజా శాంతి ప్రణాళికను సమర్థిస్తూ, గాజాలో అంతర్జాతీయ స్థిరీకరణ బలగాల ఏర్పాటుకు అధికారమిస్తూ ఒక ముసాయిదా తీర్మానాన్ని ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ఆమోదించింది. దీన్ని 'నిజమైన చారిత్రక క్షణం' గా ట్రంప్ వ్యాఖ్యానించారు. సోమవారం సాయంత్రం జరిగిన ఓటింగ్‌లో భద్రతా మండలి ఈ తీర్మానాన్ని ఆమోదించింది. 15 మంది సభ్యులు గల మండలిలో 13 ఓట్లు అనుకూలంగా రాగా, చైనా, రష్యా గైర్హాజరయ్యాయి. గాజాలో శాంతి స్థాపనకు ఒక యంత్రాంగం 'బోర్డ్ ఆఫ్ పీస్ (బిఓపి)' ఏర్పాటును కూడా ఈ తీర్మానం స్వాగతించింది. అంతర్జాతీయ చట్టబద్ధతతో కూడిన ఈ పరివర్తనా పాలనా యంత్రాంగం ప్రస్తుత శాంతి ప్రణాళిక కింద గాజా పునర్నిర్మాణానికి అవసరమైన నిధులను సమన్వయం చేసుకోవడానికి ఒక ఫ్రేమ్‌వర్క్‌ను ఏర్పాటు చేస్తుంది. దీనిపై ట్రంప్ సోషల్ మీడియాలో ఒక పోస్టు పెట్టారు. ప్రపంచవ్యాప్తంగా శాంతి స్థాపనకు ఇది దారి తీస్తుందని వ్యాఖ్యానించారు. ఈ శాంతి బోర్డుకు ట్రంప్ నేతృత్వం వహిస్తారు. పలువురు ప్రపంచ నేతలు సభ్యులుగా వుంటారు. ఈ తీర్మానానికి అన్ని పక్షాలు కట్టుబడి వుండాలని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి గుటెరస్ ప్రతినిధి స్టీఫెన్ డుజారిక్ పేర్కొన్నారు. దౌత్యపరంగా 8సాగిన వ్యవహారమంతా ఇక క్షేత్ర స్థాయిలో కార్యాచరణగా మారాలని, అందుకు అత్యవసరంగా కొన్ని నిర్దిష్ట చర్యలు తీసుకోవాల్సిన అవసరం కూడా వుందని పేర్కొన్నారు.

నో చెప్పిన ఇజ్రాయిల్, హమాస్

అరబ్, ఇస్లామిక్ దేశాల మద్దతు కోసం దిగివచ్చిన అమెరికా...ఈ తీర్మానంలో స్వతంత్ర పాలస్తీనా ప్రస్తావన తీసుకొచ్చింది. అంతర్జాతీయ స్థిరీకరణ దళం (ఐఎస్ఎఫ్)లో తమకు భాగస్వామ్యం కల్పించాలని ఆయా దేశాలు కోరుతున్నాయి. పాలస్తీనా రాజ్య ఏర్పాటుకు ససేమిరా అంటున్న ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ భద్రతా మండలి సమావేశంలోనూ అదే మొండి వైఖరిని ప్రదర్శించారు. ఈ తీర్మానాన్ని హమాస్ తిరస్కరించింది. పాలస్తీనా హక్కులు, డిమాండ్లను నెరవేర్చడంలో ఈ తీర్మానం విఫలమైందని వ్యాఖ్యానించింది. గాజాపై విదేశీ సంరక్షత్వాన్ని విధించే దిశగా ఇదొక ప్రమాదకరమైన చర్య అని విమర్శించింది. ఈ తీర్మానం కేవలం ఇజ్రాయిలీల ప్రయోజనాలను మాత్రమే నెరవేరుస్తుందని పేర్కొంది. ఆయుధాలను విడనాడే ప్రశ్నే లేదని స్పష్టం చేసింది.

పాలస్తీనాపై కొరవడిన స్పష్టత

గాజాలోకి మానవతా సాయం ప్రవేశించడంపై నెలకొన్న అడ్డంకులను వెంటనే తొలగించాలని, ఇజ్రాయిల్ దళాల ఉపసంహరణతో ఏర్పడే శూన్యతను భర్తీ చేయడానికి అంతర్జాతీయ స్థిరీకరణ దళాన్ని ఏర్పాటు చేయాలని, గాజా పునర్నిర్మాణం వైపు అడుగులు వేయాలని తీర్మానానికి మద్దతు ఇచ్చిన దేశాలు కోరాయి. వాస్తవానికి అమెరికా రూపొందించిన ప్రారంభ ముసాయిదాలో పాలస్తీనాకు రాజ్య హోదా కల్పించాలన్న ప్రస్తావనే లేదు. పాలస్తీనాకు సంబంధించి తీర్మానంలో వాడిన పదాలు కూడా అస్పష్టంగా, షరతులతో కూడి ఉన్నాయి. పాలస్తీనా అథారిటీ తనను తాను సంస్కరించుకోవాలని, గాజా పునర్నిర్మాణం ప్రారంభమైన తర్వాతనే పాలస్తీనాకు స్వీయ నిర్ణయాధికారాన్ని, రాజ్య హోదాను కల్పించేందుకు అనుసరించాల్సిన విశ్వసనీయ మార్గం కోసం అన్వేషించాలని ముసాయిదా తీర్మానం సూచించింది. అరబ్, ఇస్లామిక్ దేశాలతో పాటు యూరోపియన్ కౌన్సిల్ సభ్యులు కోరుతున్న విధంగా పాలస్తీనా రాజ్య నిర్మాణంపై అది ఎలాంటి హామీ ఇవ్వలేదు. ఓటింగ్ అనంతరం ఆయా దేశాల ప్రతినిధులు మాట్లాడుతూ ప్రస్తుతం అమలులో ఉన్న ఒప్పందాన్ని కొనసాగించడానికి, గాజాలోని 22 లక్షల మంది పాలస్తీనియన్లకు ఆహారాన్ని అందించి రక్షణ కల్పించడానికి తక్షణ చర్యలు చేపట్టే నిమిత్తం రాజీకి అంగీకరించామని తెలిపారు.

తొలగని అనిశ్చితి

రెండేళ్లపాటు దౌత్యపరంగా కొనసాగిన ప్రతిష్టంభన కారణంగా 71 వేల మందికి పైగా పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. ఇది మారణహోమమేనని ఐరాస విచారణ కమిషన్, మానవ హక్కుల సంఘాలు స్పష్టం చేశాయి. రష్యా, చైనా వీటో హక్కును ఉపయోగించకుండా ఓటింగుకు గైర్హాజరు కావడంతో అనేక అంశాలపై ఇంకా అనిశ్చితి కొనసాగుతూనే ఉంది. తీర్మానం ఆమోదం పొందడంతో ట్రంప్ అధ్యక్షతన ఏర్పడే 'శాంతి బోర్డు'కు గాజాలో పర్యవేక్షక అధికారం లభిస్తుంది. ఈ బోర్డులో ఎంత మంది ఉంటారనే దానిపై ఇంకా స్పష్టత లేదు. ఈ బోర్డు ఐరాసకు నివేదిక అందజేస్తుంది. ఆ బోర్డు ఐరాస లేదా పాలస్తీనా అథారిటీ ఆకాంక్షలకు కట్టుబడి ఉండాల్సిన పని లేదు. గాజా స్ట్రిప్‌లో రోజువారీ పాలనా వ్యవహారాలు, ప్రజా సేవల కోసం సాంకేతిక నిపుణులతో కమిటీని ఏర్పాటు చేయాలని తీర్మానం సూచించింది. అందులో ఎవరు భాగస్వాములవుతారన్న దాని పైన కూడా స్పష్టత లేదు.

పాలస్తీనీయులకు మద్దతుగా ర్యాలీ

గాజాలో పాలస్తీనీయులకు మద్దతుగా న్యూయార్క్‌లోని అమెరికా కార్యాలయం వెలుపల నిరసనకారులు ప్రదర్శన నిర్వహించారు. గాజా పాలనపై అమెరికా, ఇజ్రాయిల్ ప్రభుత్వాలకు విస్తృత అధికారాలను కట్టబెడుతున్న తీర్మానాన్ని వారు ముక్తకంఠంతో వ్యతిరేకించారు. పాలస్తీనా పతాకాలను ధరించిన నిరసనకారులు అమెరికా కార్యాలయం వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. రమల్లాకు చెందిన మానవ హక్కుల సంస్థ అల్-హక్ కూడా తీర్మానాన్ని వ్యతిరేకించింది. ఇది స్వయం పాలనకు పాలస్తీనియన్లకు ఉన్న హక్కును కాలరాస్తోందని ఆరోపించింది. శాంతి బోర్డు ఏర్పాటు, తాత్కాలిక అంతర్జాతీయ స్థిరీకరణ దళం మోహరింపు వంటి చర్యలు అంతర్జాతీయ చట్టాన్ని పూర్తిగా ఉల్లంఘిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేసింది.


మారేడుమిల్లి రక్తసిక్తం

(మొదటిపేజీ తరువాయి)

భవన యజమానిని కూడా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పోలీసులకు పట్టుబడిన మావోయిస్టులంతా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారిగా గుర్తించారు. వీరి వద్ద 15 ఆయుధాలు లభించినట్లు సమాచారం. ఇద్దరు మహిళా మావోయిస్టులను కాకినాడ జిల్లా సామర్లకోటలో అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కొప్పవరం గ్రామంలోని ఎఫెక్స్ పరిశ్రమ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వీరిని పోలీసు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.

పోలీసు అదుపులో తిరుపతి : సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసి

మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు తిప్పరి తిరుపతి అలియాస్ దేవ్‌జి పోలీసుల అదుపులో ఉన్నట్లు సిపిఐ (ఎంఎల్) న్యూ డెమొక్రసి ఆరోపించింది. ఈ మేరకు ఆ పార్టీ అధికార ప్రతినిధులు పి. ప్రసాద్, చిట్టిపాట్టి వెంకటేశ్వర్లు మంగళవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. తిరుపతికి ప్రాణహాని ఉందని, ఆయనను తక్షణమే కోర్టులో హాజరు పరచాలని వారు డిమాండ్ చేశారు. ఆయనతో పాటు 50 మందిని రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు సోమవారం నాడే అదుపులోకి తీసుకున్నట్లుగా తెలుస్తోందని వారు పేర్కొన్నారు. రాష్ట్ర హైకోర్టు ఈ అంశాన్ని సుమోటోగా తీసుకుని అరెస్ట్ చేసిన వారిని కోర్టులో హాజరుపర్చాలని ఆదేశాలు జారీ చేయాలని వారు కోరారు. మరో ప్రకటనలో మారేడుమిల్లిలో జరిగిన ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బుగతా బంగారు రావు ఒక ప్రకటన విడుదల చేశారు.



విజయవాడ కొత్త ఆటోనగర్‌లో మావోయిస్టులను అదుపులోకి తీసుకున్న భవనం ఇదే!

హిడ్మా నేపథ్యం

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లా పూవర్తికి చెందిన హిడ్మా వయసు సుమారు 50 ఏళ్లు. విలాస్, హిడ్మాల్, సంతోష్ అనే పేర్లతో ఆయనను వ్యవహరించేవారు. హిందీ, గోండు, తెలుగు, కోయ, బెంగాలీ వంటి భాషలపై ఆయనకు పట్టుంది. దండకారణ్యంలో మావోయిస్టు కమిటీల్లో కీలక పాత్ర పోషించారు. గెరిల్లా యోధునిగా పేరుగాంచారు. 25 ఏళ్ల నుంచి మావోయిస్టు పార్టీలో వివిధ బాధ్యతల్లో కొనసాగుతున్నాడు.

2014 నుంచి 2024 వరకు జరిగిన సుమారు 25 నుండి 30 ఎదురు కాల్పుల్లో పాల్గొన్నారు. హిడ్మాపై రూ.కోటి రివార్డు, ఆయన భార్య రాజెపై రూ.50 లక్షల రివార్డు ఉంది. 2017లో 25 మంది సిఆర్‌పిఎఫ్ జవాన్ల మృతికి హిడ్మానే ప్రధాన కారకుడిని పోలీసులు చెబుతున్నారు.



జిల్లా కలెక్టర్ దిష్టి బొమ్మను దగ్ధం చేస్తున్న రైతులు

కస్టోడియన్ భూముల సమస్యపై

రాజస్థాన్‌లో భారీ ర్యాలీ

జైపూర్ : కస్టోడియన్ భూముల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాజస్థాన్‌లో రైతులు కదం తొక్కారు. రాష్ట్రంలోని దిద్వానాలో రైతులు మంగళవారం రెహ్మాన్ గేట్ నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు దాదాపు 10 కిలోమీటర్ల మేర మహా పాదయాత్ర నిర్వహించారు. కస్టోడియన్ భూములను స్వాధీనం చేసుకోవాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ వివిధ గ్రామాల రైతులు నిరసనలో భాగమయ్యారు. అధికారుల తీరును నిరసిస్తూ జిల్లా కలెక్టర్ దిష్టిబొమ్మను దహనం చేసి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. జిల్లా యంత్రాంగం తమ పూర్వీకుల భూములను లాక్కుంటోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే చేతన్ దూడి, రైతు నాయకుడు భగీరథ్ యాదవ్, సిపిఎం, అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) కార్యకర్తలతో పాటు కాంగ్రెస్, ఆర్ఎల్‌పి నుంచి కూడా వందలాది మంది ఈ పాదయాత్రలో పాల్గొన్నారు. అనేక మంది రైతులు ట్రాక్టర్లతో ర్యాలీలో పాల్గొన్నారు. 'రైతుల గొంతు అణచివేయలేరు.. పోరాటం మరింత ఉధృతం చేస్తాం' అంటూ నినాదాలు చేశారు.

ఎస్ఐఆర్ ప్రక్రియ నిలిపివేయండి

- సుప్రీంకోర్టును ఆశ్రయించిన కేరళ ప్రభుత్వం

తిరువనంతపురం : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై కేరళ ప్రభుత్వం మంగళవారం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. రాష్ట్రంలో ఎస్ఐఆర్‌ను వాయిదా వేయాలని భారత ఎన్నికల సంఘం (ఇసిఐ)ని ఆదేశించాలని కేరళ ప్రభుత్వం కోరింది. ఎస్ఐఆర్, స్థానిక సంస్థల ఎన్నికలను ఒకేసారి నిర్వహించడం 'దాదాపు అసాధ్యం' అని ప్రభుత్వం పేర్కొంది. ఈ నెల 4 నుంచి డిసెంబర్ 4 వరకు 'గందరగోళ' ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణ సమయంలోనే కేరళలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయని తెలిపింది. డిసెంబర్ 9, 11 తేదీల్లో రాష్ట్రంలోని ఎల్ఎస్‌జిఐలకు ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఇసిఐ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ రెండూ ఒకేసారి నిర్వహించడంతో మానవ వనరులకు తీవ్ర కొరత ఏర్పడుతుందని, ఉద్యోగులు ఒత్తిడికి గురవుతారని, ప్రభుత్వ రోజు వారీ పనితీరుపై తీవ్ర ప్రభావం పడుతుందని పేర్కొంది. సిబ్బంది కొరత 'పాలనా ప్రతిష్టంభన'కు కూడా దారితీయవచ్చని ఆందోళన వ్యక్తం చేసింది.

"ఎస్ఐఆర్ అనే ఎన్నికల సంబంధిత విధుల కోసం ప్రభుత్వ, పాక్షిక ప్రభుత్వ సేవల నుండి సుమారు 1,76,000 మంది సిబ్బందిని, మరో 68 వేల మంది పోలీసులు, ఇతర భద్రతా సిబ్బందిని మోహరించాల్సి ఉంది. ఎస్ఐఆర్ సంక్లిష్టతతో కూడిన గందరగోళ ప్రక్రియ. దీనికోసం 25,668 మంది అదనపు సిబ్బంది సేవలు అవసరం. శిక్షణ పొందిన, అనుభవజ్ఞులైన ఎన్నికల సిబ్బంది పరిమితంగా ఉండటంతో వాటికి ఆటంకం ఏర్పడుతుంది. ఎస్ఐఆర్, ఎల్ఎస్‌జిఐ ఎన్నికల కోసం ఒకేసారి ఇంత పెద్ద సంఖ్యలో అధికారుల కేటాయింపు దాదాపు అసాధ్యం, పాలనా ప్రతిష్టంభనకు దారితీస్తుంది" అని పిటిషన్‌లో పేర్కొంది. ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రజాస్వామ్యానికి అనుకూలంగా లేదని కేరళ ప్రభుత్వం తరపున పిటిషన్ దాఖలు చేసిన న్యాయవాది సి.కె.శశి పేర్కొన్నారు. ఎస్ఐఆర్‌తో స్థానిక సంస్థల ఎన్నికలను సజావుగా నిర్వహించలేమని తెలిపారు. కేరళలో 941 గ్రామ పంచాయితీలు, 152 బ్లాక్ పంచాయితీలు, 14 జిల్లా పంచాయితీలు, 87 మునిసిపాలిటీలు, ఆరు కార్పొరేషన్లతో కూడిన 1200 స్థానిక స్వపరిపాలన సంస్థలు (ఎల్ఎస్‌జిఐ)లు ఉన్నాయి. మొత్తం 23,612 వార్డులు ఉన్నాయి. ఆర్టికల్ 243-ఇ, 243-యు కింద రాజ్యాంగ ఆదేశాన్ని, కేరళ పంచాయితీరాజ్ చట్టంలోని సెక్షన్ 38, కేరళ మునిసిపాలిటీ చట్టంలోని సెక్షన్ 94కింద ఐదేళ్లలోపు ఎల్ఎస్‌జిఐలకు ఎన్నికలు నిర్వహించాలనే చట్టబద్ధమైన ఆదేశాన్ని పిటిషనర్ గుర్తు చేశారు. రాష్ట్రంలోని ఎల్ఎస్‌జిఐలకు ఓటింగ్, లెక్కింపు, ఫలితాల ప్రకటన సహా ఎన్నికల ప్రకటన ప్రక్రియను రాజ్యాంగ, చట్టబద్ధమైన ఆదేశాలకు అనుగుణంగా 2025 డిసెంబర్ 21లోపు పూర్తి చేయాలని కేరళ ప్రభుత్వం పేర్కొంది.

చర్చలకు ట్రంప్, మదురో సంసిద్ధత

వాషింగ్టన్/ కారకాస్ : ద్వైపాక్షిక చర్చలకు సిద్ధమేనని అమెరికా, వెనిజులా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్, నికోలస్ మదురో ప్రకటించారు. మదురోతో సమావేశమయ్యేందుకు సుముఖంగానే ఉన్నానని ట్రంప్ సోమవారం తెలిపారు. వెనిజులాపై సైనిక చర్య జరిపే అవకాశాలను ఆయన తోసిపుచ్చలేదు. 'నేను దానిని కాదనలేను. నేను దేనినీ తోసిపుచ్చను' అని ఆయన చెప్పారు.

మరో ట్రూ అప్ బాదుడు వద్దు

(మొదటిపేజీ తరువాయి)

చెల్లించమనడం ఏమిటని ప్రశ్నించారు. సెకీ ఒప్పందంపై విచారణ జరపకపోవడం అవినీతిని కప్పిపుచ్చుకోవడమేనని అన్నారు.

వినియోగదారులను బలి చేయొద్దు : వేణుగోపాలరావు

ప్రభుత్వ తప్పులకు వినియోగదారులను బలి చేయవద్దని విద్యుత్ రంగ నిపుణులు, సీనియర్ జర్నలిస్టు ఎం వేణుగోపాలరావు కోరారు. ప్రజాభిప్రాయ సేకరణలో ఆయన ఆన్‌లైన్ ద్వారా పాల్గొని తన అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. ఎఫ్‌పిపిసిఎల్ విధానాన్ని ఎత్తివేయాలని సూచించారు. విద్యుత్ వినియోగదారుల ఐక్యవేదిక కన్వీనర్ ఎంవి ఆంజనేయులు మాట్లాడుతూ ట్రూ అప్ ఛార్జీల భారాన్ని ప్రభుత్వమే భరించాలని కోరారు. సౌత్ ఇండియా సిమెంట్ మ్యానుఫాక్చరర్స్ అసోసియేషన్ ప్రతినిధి అమిత్ గోయెంకా, ఫ్యాప్సి కార్యదర్శి పి వైదేహి, ఎపిటిఎంఎ ప్రతినిధి ఆర్ శివకుమార్, ఎపిఎఫ్ఎపిఎ ప్రతినిధి పి విజయ్ గోపాల్ రెడ్డి ఆన్‌లైన్ ద్వారా తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఆదాయ వ్యయాల మధ్య పెరుగుతున్న అంతరాన్ని తగ్గించుకోవడానికి ట్రూ అప్ ఛార్జీల వసూలుకు అనుమతి ఇవ్వాలని డిస్కములు ప్రతిపాదించాయి. వాదనలు విన్న ఎపిఇఆర్‌సి ఛైర్మన్ పివిఆర్ రెడ్డి ఆర్డర్‌ను రిజర్వ్ చేశారు.

ఇఆర్‌సి కార్యాలయం ముందు ధర్నా

ట్రూ అప్, సర్ ఛార్జీలు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ వసూలు విధానాన్ని రద్దు చేయాలని ఇఆర్‌సి కార్యాలయం ముందు సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి రాముడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ ట్రూ అప్ ఛార్జీలను, సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని, ఇప్పటి వరకూ వివిధ రూపాల్లో వసూలు చేసిన విద్యుత్ భారాలను వెనక్కి తిరిగివ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎపిఇఆర్‌సి ఛైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పిఎస్ రాధాకృష్ణ, జి రామకృష్ణ, ఎండి అంజిబాబు, నారాయణ, ఓల్డ్ సిటీ కార్యదర్శి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు'ను తుక్కు చేసే కుట్రలు

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రంలోని మోడీ సర్కారుతో అంటకాగుతూ ఉక్కు పరిశ్రమను నిర్వీర్యం చేశాయి.

ప్యాకేజీ తర్వాత ఏం జరిగింది?

ప్యాకేజీ ఇచ్చామని చంద్రబాబు పదేపదే చెబుతున్నా టిడిపి కూటమి వచ్చాక 28 వేల మంది కార్మికుల్లో 1,600 మంది పర్మినెంట్ ఉద్యోగులను విఆర్‌ఎస్ ఇచ్చి ఇంటికి పంపించేశారు. 5,500 మంది కాంట్రాక్టు కార్మికులను అడ్డగోలుగా (ఫైనల్ సెటిల్‌మెంట్ కూడా చేయకుండా) తొలగించారు. ప్యాకేజీ నిబంధనల్లో భాగంగానే ఇదంతా జరిగింది. స్థానికులను తీసేసి ఒడిశా, బీహార్ ప్రాంతాల నుంచి కార్మికులను తెచ్చి వారికి ఎలాంటి కనీస వేతనాలు, హక్కులు, భద్రతా లేకుండా పనిచేయించుకుంటున్నారు. పైపెచ్చు ఇక్కడ కార్మికులు ఇళ్లల్లో ఉండి జీతాలు తీసుకుంటున్నారని, పనిచేయడం లేదని చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలు చేశారు. సొంతగనులు ఉంటేనే స్టీల్‌ప్లాంట్ పురోగమిస్తుంది. దేశంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు రంగ స్టీల్‌ప్లాంట్లకు సొంత గనులను కేటాయించి వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌పై మాత్రం పాలకులు వివక్షత ప్రదర్శించారు. ఎన్‌ఎండిసి ఐరన్ ఓర్‌ను మిట్టల్‌కు కట్టబెడుతున్నారు. 2010లోనే ఎన్‌ఎండిసి నుంచి వైజాగ్ స్టీల్‌కు పైప్‌లైన్ ద్వారా ఐరన్ ఓర్ సరఫరా చేయాలనే ఒప్పందానికి తూట్లు పొడిచారు. దీంతో, ఐరన్ ఓర్‌తో పాటు పెల్లెట్స్ కోక్‌ను ప్లాంట్ బయట కొంటోంది. టన్ను రూ.3 వేలు కాగా రూ.5 వేలు అదనంగా వైజాగ్ స్టీల్‌ప్లాంట్ వెచ్చించాల్సి వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రాజెక్టులకు వైజాగ్ స్టీల్‌ను వాడుతున్నామని ప్రభుత్వం చెబుతున్నా, రాయపూర్ నుంచి స్టీల్‌ను వాడుతోందని కేంద్ర ప్రభుత్వ మాజీ ఇంధన కార్యదర్శి ఇఎఎస్.శర్మ తెలిపారు. విశాఖ ఉక్కును తుక్కుగా మార్చే ఈ కుట్రలను ప్రజల మద్దతుతో కార్మికవర్గం ప్రతిఘటిస్తోంది. ఇకపైనా ప్రజా ఉద్యమం కొనసాగితేనే కుట్రలను ఓడించడం సాధ్యమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

జీవన సౌరభం

చేసే పనుల వల్లే గొప్పవాళ్లమవుతాం. పుట్టుకతో కాదు.

మీకోసం

వెండి సామగ్రి, ఆభరణాలు ఉంచేచోట కర్పూరం బిళ్లలను ఉంచితే అవి త్వరగా నల్లబడకుండా ఉంటాయి.




గోడ మీది బొమ్మ

గోడ మీది బొమ్మ
గొలుసుల బొమ్మ
గోల గోల బొమ్మ
గొలుసు వేసుకోని బొమ్మ!

వచ్చి పోయేవారికి
వడ్డించే బొమ్మ
వడ్డించే వరకు
తెలియనీయని బొమ్మ!

ఎర్రెర్రగా నల్ల నల్లగా
ఈడ మునిగి ఆడదేలు
చల్లచల్లగా మెల్లమెల్లగా
జారుకునే దొంగగాల్లు!

అందరికీ తెలియని దాని
కుడ్ కుడ్ శబ్దం



వెతికి పట్టుకుందామని
ఇల్లంతా నిశ్శబ్దం!

దీని పేరేమిటో చెప్పకోండి
దేహమంతా విషముండదండి
వాలము నందు విషము కొండి
అది తేలు అని తెలుసుకోండి!


- పట్లోళ్ళ బక్కారెడ్డి
97053 15250



తేడాలు గుర్తించండి

పిల్లలూ, ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు బొమ్మల్లో ఆరు తేడాలు ఉన్నాయి. అవి ఏంటో గుర్తించండి.

నేను గీసిన బొమ్మ






తన్మయి,
5వ తరగతి,
తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాల,
చింతకుంట,
కరీంనగర్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి.
ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

జాగ్రత్తలతో నియంత్రించొచ్చు!



నేడు సిఓపిడి డే

ధూమపానం, ఇంట్లో పొగ, వాతావరణ కాలుష్యం, వృత్తిపరమైన ధూళి, వాయువులు కారణంగా 'సిఓపిడి' వచ్చే ప్రమాదం ఉంది. సెకండ్ హ్యాండ్ స్మోకింగ్ (పాసివ్ స్మోకింగ్) కారణంగా కూడా ఈ ముప్పు పొంచివుంది. అయితే ఎంతోమంది వ్యాధిని గుర్తించక ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు ఉన్నాయి.

ఇవీ ముఖ్య లక్షణాలు : శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది; మళ్లీ మళ్లీ వచ్చే దగ్గు – దీర్ఘకాలంగా గళ్లపడటం; శ్వాసలో పిల్లికూతలు, గురగుర శబ్దాలు, తమ పనులను తామే చేసుకోలేక పోవడం; ఛాతీ బిగుతుగా మారడం; తక్కువ శ్వాస సామర్థ్యం; తరచుగా శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు; నీరసం, బరువు తగ్గడం

నియంత్రణా మార్గాలు : స్మోకింగ్‌కు దూరంగా ఉండాలి. దుమ్ము, ధూళి ప్రాంతాల్లో పనిచేసేవారు మాస్కులు ధరించాలి. తద్వారా ఊపిరితిత్తులకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలి. సెకండ్ హ్యాండ్ స్మోకింగ్‌కు దూరంగా ఉండాలి. అలర్జీ పదార్థాలకు దూరంగా ఉండాలి. పోషకాహారం తీసుకోవాలి. ప్రతి రోజూ కనీసం కొన్ని (30) నిమిషాల పాటు వ్యాయా మం చేయాలి.

ప్రాణాయామం చేయడం వల్ల ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంపొందించుకోవచ్చు. 60 ఏళ్లు పైబడిన వారంతా క్రమం తప్పకుండా ఫ్లూ, నిమోనియా వ్యాక్సిన్లు వేయించుకోవాలి.

చికిత్స : 'సిఒపిడి'కి చికిత్స లేకపోయినా.. 'సిఒపిడి' లక్షణాలకు చికిత్స పొందితే, దాని తీవ్రతను తగ్గించవచ్చు.

గోల్డ్ అంటే ఏమిటి?

GOLD (Global Initiative for Chronic Obstructive Lung Disease) అనేది **COPD** (క్రానిక్ ఆబ్స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్)పై ప్రపంచవ్యాప్తంగా అవగాహన పెంచడం, నిర్ధారణ, చికిత్స, నివారణ మార్గదర్శకాలను రూపొందించడం కోసం 1997లో స్థాపించబడిన అంతర్జాతీయ సంస్థ. **COPD** బాధితులకు మెరుగైన జీవన నాణ్యత అందించడం లక్ష్యంగా గోల్డ్ పనిచేస్తున్నది. ప్రతి ఏటా నవంబర్ మూడో బుధవారం 'సిఓపిడి' రోజును నిర్వహిస్తారు. గోల్డ్ సంస్థ ప్రతి ఏటా థీమ్ నిర్ణయించి, ప్రచార సామగ్రిని అందిస్తుంది.

COPD GOLD వర్గీకరణ పట్టిక

GOLD గ్రూప్	లక్షణాలు (సాధారణంగా)	శ్వాస పరీక్ష (FEV,%)	దాడుల చరిత్ర (Exacerbations)	చికిత్స మార్గదర్శకాలు
GOLD 1 (తక్కువ తీవ్రత)	తక్కువ శ్వాస సమస్యలు	≥ 80%	సంవత్సరానికి ≤1, ఆసుపత్రిలో చేరకుండానే	పీల్చే మందులు, తీవ్రతను బట్టి అనుసరిస్తారు
GOLD 2 (మధ్యస్థ తీవ్రత)	శ్వాస తీసుకోవడంలో కొంత ఇబ్బంది	50–79%	సంవత్సరానికి ≤1	
GOLD 3 (తీవ్రమైనది)	రోజువారీ కార్యకలాపాల్లో ఇబ్బంది	30–49%	≥2 లేదా ≥1 ఆసుపత్రిలో చేరడం	
GOLD 4 (అత్యంత తీవ్రమైనది)	తీవ్రమైన శ్వాస సమస్యలు, తరచూ దాడులు	< 30%	≥2 లేదా ≥1 ఆసుపత్రిలో చేరడం	

ఇన్‌హేలర్ల వాడకంతో ఉపశమనం లభిస్తుంది. వైద్యుని పర్యవేక్షణలో ఉంటూ.. జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకుంటే.. దీని లక్షణాల నుంచి కొంత ఉపశమనం పొందవచ్చు.

'సిఒపిడి' పూర్తిగా నయం చేయలేకపోయినా నియంత్రించగలిగిన వ్యాధి. సరైన అవగాహన, వైద్య మార్గదర్శకాలు, పొగాకు పొగను నివారించడం, కాలుష్య కారకాలకు గురి కావడాన్ని తగ్గించడం, జీవనశైలి మార్పులతో 'సిఒపిడి' ప్రభావాన్ని గణనీయంగా తగ్గించవచ్చు.



– డాక్టర్ రంగు సుధీంద్ర,
శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర చెస్ట్ అండ్ అలర్జీ హాస్పిటల్, అనంతపురం.

నెట్స్‌లో కఠోర సాధన

- శుభ్‌మన్ ఫిట్‌నెస్‌పై ఉత్కంఠ
- గౌహతి టెస్ట్‌కు సిద్ధమౌతున్న టీమిండియా



కోల్‌కతా: తొలిటెస్టులో అనూహ్యంగా ఓటమిపాలైన భారతజట్టు గౌహతి టెస్ట్ కోసం అస్త్రశస్త్రాలు సిద్ధం చేస్తోంది. న్యూజిలాండ్‌తో స్వదేశంలో జరిగిన టెస్ట్ సిరీస్ వైట్‌వాష్‌కు గురై పలు విమర్శలకు ఎదుర్కొన్న జట్టు మరోసారి అలా ఓటమి కోరల్లో నిలిచింది. ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లో కేవలం 124 స్వల్ప లక్ష్యాన్ని ఛేదించలేక చతికిలబడ్డ టీమిండియా.. రెండోటెస్ట్‌లో సఫారీ జట్టును చిత్తు చేస్తేనే సిరీస్‌ను కోల్పోకుండా సజీవంగా నిలుపుకోనుంది. తొలి టెస్ట్ ముగిసినా విశ్రాంతి తీసుకోవడానికి ఆటగాళు నెట్స్‌లో శిక్షణకు నిమగ్నమయ్యారు. కోల్‌కతాలోనే ఉన్న భారత ఆటగాళ్లు ఈడెన్ గార్డెన్స్‌లో మంగళవారం ప్రాక్టీస్ చేశారు. రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో 0–1తో వెనుకబడ్డ టీమిండియా.. రెండోటెస్టులో ఎలాగైనా గెలిచి సిరీస్‌ను సమం చేయాలని చూస్తోంది. ప్రాక్టీస్‌లో వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్, ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా నెట్స్‌లో బ్యాటింగ్ చేయగా.. ఆకాశ్‌దీప్, వాషింగ్టన్ సుందర్ బౌలింగ్ ప్రాక్టీస్ చేశారు. నెట్ సెషన్‌లో సాయి సుదర్శన్, జురెల్ స్పిన్నర్లను ఎదుర్కొన్నారు. సాయి సుదర్శన్‌కు తొలి టెస్టు తుదిజట్టులో చోటు దక్కలేదు. శుభ్‌మన్ రెండోటెస్ట్‌కు దూరమైతే ఛాన్స్ దక్కనుంది. అలాగే, ధ్రువ్ జురెల్ కుడి కాలుకు ప్యాడ్‌లు లేకుండా సాధన చేయడం కనిపించింది. రివర్స్ స్వీప్‌పై ఎక్కువగా దృష్టి పెట్టాడు. గంభీర్, బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ ఆటగాళ్ల శిక్షణను పరీక్షించారు. గౌహతిలో 22నుంచి జరిగే రెండోటెస్టు టీమిండియా ఆటగాళ్లు సిద్ధమౌతున్నారు.

శుభ్‌మన్ ఫిట్‌నెస్‌పై ఉత్కంఠ

టీమిండియా టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు అందుబాటులో ఉంటాడా? లేదా? అనే దానిపై సందిగ్ధత నెలకొంది. మంగళవారం ఆటగాళ్లు ప్రాక్టీస్‌లో పాల్గొనగా.. అతడు మాత్రం కనిపించలేదు. కోల్‌కతాలోని ఆసుపత్రినుంచి శుభ్‌మన్ మంగళవారం డిశ్చార్జ్ అయినా.. అతడి ఫిట్‌నెస్‌పై ఇంకా స్పష్టత రాలేదు. ఒకవేళ అతడు రెండోటెస్ట్‌కు దూరమైన పక్షంలో మరో బ్యాకప్ ప్లేయర్‌ను ఎంపికచేసే ప్రసక్తి లేదని సెలెక్షన్ కమిటీ తాజాగా ప్రకటించింది. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ స్థానం కోసం టీమిండియా రేసులో నిలవాలంటే దక్షిణాఫ్రికాతో జరిగే రెండో టెస్ట్‌లో టీమిండియాకు గెలుపు తప్పనిసరి.

అభిషేక్ శర్మ డబుల్ సెంచరీ

- జార్ఖండ్‌పై తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత



అభిషేక్ (247 పరుగులు)

జంషెడ్‌పూర్: రంజీట్రోఫీ ఎలైట్ గ్రూప్‌లో జార్ఖండ్‌పై ఆంధ్ర జట్టు పట్టు బిగించింది. జార్ఖండ్‌ను తొలి ఇన్నింగ్స్‌లో 328పరుగులకే పరిమితం చేసి అనంతరం ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 6వికెట్ల నష్టానికి 567పరుగుల వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసింది. దీంతో ఆంధ్రకు తొలి ఇన్నింగ్స్‌లో 239పరుగుల కీలక ఆధిక్యత లభించింది. టీమిండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ(247) భారీ డబుల్ సెంచరీకి తోడు కరణ్ షిండే(94), శ్రీకర్ భరత్(51), రషీద్(58) బ్యాటింగ్‌లో రాణించారు. అభిషేక్ శర్మ ఔటయ్యాక కెప్టెన్ రికీ బుయ్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేశాడు. జార్ఖండ్ బౌలర్లు అనుకుల్ రాయ్, రిషబ్ రాజ్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన జార్ఖండ్ జట్టు మూడోరోజు ఆట నిలిచే సమయానికి 2వికెట్ల నష్టానికి 34 పరుగులు చేసింది. శరణ్‌దీప్ సింగ్(13), మానిషి(2) క్రీజ్‌లో ఉన్నారు. ఆ జట్టు ఇంకా 205పరుగులు వెనుకబడి ఉంది.

ఓటమి అంచున హైదరాబాద్..

రంజీట్రోఫీ ఎలైట్ గ్రూప్–డిలో హైదరాబాద్ జట్టు ఓటమి అంచున నిలిచింది. జమ్ము–కాశ్మీర్ నిర్దేశించిన 472పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో మూడోరోజు ఆట నిలిచే సమయానికి 7వికెట్లు నష్టపోయి 169పరుగులే చేసింది. క్రీజ్‌లో అంకిత్ రెడ్డి(22), రక్షణ్(0) ఉన్నారు. ఆ జట్టు ఇంకా 303 పరుగులు వెనుకబడింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68